# అనువాద కథలు

## - గౌరీ కృపానందన్



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 23

# ఇందులో...


| | | |
|---|---|---|
| స్వార్థం | అశోక్ మిత్రన్ | 3 |
| నేను మాత్రం!? | శివశంకరి | 7 |
| కొత్తచెప్పులు కరుస్తాయి | జయకాంతన్ | 11 |
| మారిన విలువలు | దేవీబాల | 18 |
| ధర్మోపదేశం | అనూరాధా రమణన్ | 21 |
| వారసత్వం | ఎస్.శంకర నారాయణ్ | 27 |
| ఏర్పాటు | ఇందిరా పార్థసారధి | 32 |
| అంతరంగం | ఆనంద్ రాఘవ్ | 37 |
| పై గొళ్ళెం | ఆర్.వెంకటేష్ | 41 |
| బోడి | జయంతన్ | 46 |
| గడియారం | నీల పద్మనాభన్ | 50 |
| అమ్మకూచి | వి.ఎస్.నారాయణ్ | 55 |
| తొలగిన మేఘాలు | జి.తిలకవతి | 59 |




చెన్నై వాస్తవ్యులైన గౌరి గారు తెలుగు నుంచీ తమిళంలోకీ, తమిళంనుంచీ తెలుగులోకీ అనేక కథలూ, నవలలూ అనువాదం చేసారు. వీరి అనువాదాలు తెలుగు-తమిళ భాషలలోని అన్ని ప్రముఖ పత్రికలలోనూ ప్రచురించ బడుతున్నాయి.

# స్వార్ధం

తమిళ మూలం: అశోక్ మిత్రన్

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్



అశోక్‌మిత్రన్

**ఆ రోజు** ఉదయం లేచేటప్పటికే బాగా ప్రొద్దెక్కి పోయింది. నిన్న ఫ్యాక్టరీలో ఓవర్ టైము ముగించుకుని ఇంటికి వచ్చి చేరినప్పుడు రాత్రి పదకొండు అయ్యింది. భోజనం కూడా చేయకుండా అలాగే నిద్రపోయాను.

ఆలస్యంగా వెళితే డిపో వాడు పాలు అయిపోయాయని అంటాడేమోనని భయపడుతూ ఉరుకు పరుగులతో వెళ్ళి పాల పాకెట్ తీసుకుని వచ్చాను. అప్పటికే నాన్నగారు లేచి హాల్లో పడక్కుర్చీలో కూర్చుని ఉన్నారు. వంటింట్లో ఏ చప్పుడూ వినబడలేదు.

కామాక్షిని మెల్లగా తట్టిలేపడానికి ప్రయత్నించాను. కొంచెం కదిలి దుప్పటి తీసి పూర్తిగా ముసుగు పెట్టి అటు తిరిగి పడుకుంది కామాక్షి.

"కామాక్షీ! లే మరి. నాన్నగారు అప్పుడే లేచేసారు."

"నాకు ఒంట్లో బాగా లేదు. "క్లుప్తంగా వచ్చింది జవాబు.

"ఏమైంది?" నుదుటి మీద చెయ్యి పెట్టి చూసాను. దుప్పటి ముసుగు పెట్టుకున్న వేడి మాత్రమే అని అనిపించింది.. "సరేలే! లేచి కాఫీ పెట్టి కాస్త చారు పచ్చడి చేసేయి, చాలు."

"ఓ పక్క నాకు ఒంట్లో బాగా లేదని చెపుతుంటే కొరడాతో కొట్టి పనిచేయిస్తారా?"

"అరవకే, మరీ లేచి తిరగలేనంత జ్వరంలాగా అనిపించడం లేదు."

"నా ఆరోగ్యం గురించి నాకు తెలుసా. మీకు తెలుసా? వంట చేస్తూ చేస్తూ కళ్ళు తిరిగి పొయ్యి మీద పడిపోతే ఏం చేస్తారు? తండ్రీ కొడుకులు కలిసి ఆ చేత్తోటే దహన సంస్కారాలు కూడా పూర్తి చేసేస్తారా?"

"గొంతు చించుకుని అరవకే ఒంట్లో బాగోలేదంటే మామూలుగా చెపితే చాలదూ. నీ పిచ్చి వాగుడంతా నాన్నగారి చెవులకి వినిపిస్తుందో ఏమో ?"

"వినిపిస్తే ఏం? నేను వెర్రిబాగుల్దాన్నని, నేను చేసే పనులు కూడా అలాగే ఉంటాయనీ అస్తమానం దెప్పి పొడిచే మనిషికి నా పిచ్చి వాగుడు వినబడితే మాత్రం ఏమౌతుంది?"

ఒక చేత్తో ఆమె నోరు నొక్కిపట్టి మూస్తూ లేచాను. మామగారికి, కోడలికి మధ్య మళ్ళీ ఏదో గొడవ జరిగినట్లుంది.

వంటింట్లోకి వెళ్ళి పొయ్యి వెలిగించాను. కాఫీ పెట్టడం, వంట చేయడం నాకేమీ కొత్తకాదు, ఏడున్నరకల్లా బయలుదేరాలి. అందుకోసం ఇప్పుడు నేను ఆదరాబాదరాగా చేసే ఈ పచ్చడి మెతుకులు, చారు నాన్నగారు పదకొండు గంటలకి తినేటప్పుడు చప్పగా

చల్లారిపోతాయి. అమ్మ చనిపోయిన తర్వాత నేను పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకున్నదే నాన్నగారు భోజనానికి కష్టపడకూడదు అని. కానీ నాన్నగారి జాతక చక్రంలో ఆయోగం అంత బలంగా ఉన్నట్లు లేదు.

పదినిముషాల్లో కాఫీ కలిపి నాన్నగారికి తీసుకెళ్ళి ఇచ్చాను. నా నాలుక మీద శనీశ్వరుడు తిష్టవేసుకుని కూర్చున్నాడనుకుంటాను.

"వేన్నీళ్ళు పెడతాను. మీరు మొదట స్నానం చేసేయండి."

నాన్నగారు తలెత్తి నావైపు చూసారు. "ఏమైంది తనకి?"

"పెద్దగా ఏమీ లేదు. ఏదో ఒంట్లో కాస్త నలతగా ఉన్నట్లుంది."

"ఒంట్లో బాగా లేకపోతే డాక్టర్ దగ్గరికి వెళ్ళి మందులు తీసుకోవాలి."

"అలాగే. సాయంత్రం వచ్చిన తర్వాత తీసుకెళతాను."

"అంతవరకు వంటింట్లో గిన్నెల్ని కిందా మీదా చెయ్యొద్దని చెప్పు నీ భార్యకి."

ఉన్నట్లుండి నాన్నగారు కూడా కామాక్షిలాగే మాట్లాడుతున్నట్లు అనిపించింది. కానీ అప్పుడు ఆ విషయం గురించి ఎక్కువగా ఆలోచించడానికి అవకాశం లేదు. పెరట్లోకి వెళ్ళి బాయిలర్ వెలిగించాను. నీళ్ళు కాగేవరకూ ఆగకుండా చన్నీళ్ళతోనే స్నానం చేసి పొయ్యి మీద కుక్కర్ పెట్టాను. ఆ రోజంటూ వంటకు అరటి పువ్వు మాత్రమే ఉంచింది కామాక్షి. దానిని అలాగే ఉంచేసి చారు పెట్టి, నాలుగు అప్పడాలు వేయించాను. గంట ఏడున్నర అయ్యింది. ఫ్యాక్టరీకి బయలుదేరాను.

ఇలా జరగటం ఇదేమీ మొదటిసారి కాదు. ఈ ఒక్క ఏడాదిలో నాలుగైదుసార్లు జరిగింది. నాన్నగారు కామాక్షికి సరికి సరి మాట్లాడే కొద్దీ ఆమెకి ధైర్యం మరీ ఎక్కువైపోయింది.

"కాస్త సర్దుకుపోరాదూ" అని ఆమెతో చెప్పి చూసాను.

"వంటింటి విషయంలో మగవాళ్ళు ఎందుకు తలదూర్చాలి?" ఇదీ ఆమె జవాబు.

అమ్మ బ్రతికున్న రోజుల్లో నాన్నగారు రోజంతా బైటే ఉండేవారు. రిటైరు అయ్యాక కూడా ప్రొద్దున పదిగంటలకి భోజనం చేసి బయలుదేరారంటే సాయంత్రం ఏడుగంటలకి ఇంటికి చేరుకునేవారు. మధ్యాహ్నం ఒంటిగంటదాకా క్లబ్బులో పేకాట. ఆ క్లబ్ కాంటిన్‌లోనే టిఫిన్ తినేసి ఇంకో క్లబ్‌కి వెళ్ళి మూడు నుంచీ ఏడుగంటలదాకా పేకాడేవారు. చీకటి పడిన తర్వాత పేకాడటం ఆయనకి నచ్చని విషయం. సూర్యుడు అస్తమించిన తర్వాత మెదడుతో చేసే పనులు ఏమీ చేయకూడదని ఆయన సిద్ధాంతం. అమ్మకి ఉన్నట్లుండి సుస్తీ చేసి ఇరుగు పొరుగంతా హడావిడిగా అటూ ఇటూ పరుగులు పెడుతున్నప్పుడు నాన్నగారు క్లబ్బులో ఉన్నారు. ఆ రోజు ఏదో క్రొత్త క్లబ్బుకి వెళ్ళినందువలన ఆయనకి కబురు అందలేదు. ఆఖర్న సాయంత్రం ఆయన ఇంటికి వచ్చేసరికి ప్రాణం లేని అమ్మ శరీరాన్ని కాళ్ళూ చేతులు కట్లు వేసి వసారాలో పడుకోబెట్టారు.

మా ఫ్యాక్టరీలో లంచ్‌కి నలభై అయిదు నిమిషాలు విరామం. స్నేహితుడి దగ్గర స్కూటర్ అరువు తీసుకుని ఇంటికి వచ్చాను. అప్పటికి కామాక్షి లేచి స్నానం అదీ చేసి బాగానే ఉన్నట్లు కనబడింది. భోజనానికి నాకు మాత్రమే కంచం పెట్టకుండా నాన్నగారికీ పెట్టింది. నేను ఇంటికి వచ్చిందే మంచిదయ్యింది. లేకపోతే నాన్నగారు భోజనం చేయకుండా పస్తు ఉండేవారేమో.

"ఇంత సేపైంది. నాన్నగారికి ఇంకా అన్నం పెట్టలేదూ?"

"ఆయన రాలేదు."

"నువ్వు పిలిచావా?"

కామాక్షి జవాబు చెప్పలేదు.

"అసలు నీ గురించి నువ్వు ఏమనుకుంటున్నావు?"

ఏ కళన ఉందో కామాక్షి తన అలవాటు ప్రకారం ఊరూ వాడా వినేట్లు అరవకుండా నా వైపు ఓ చూపు చూసి ఊరుకుంది. నేను వెళ్ళి నాన్నగారి భోజనానికి పిలిచాను. మౌనంగా వచ్చి కంచం ముందు కూర్చున్న నాన్నగారిని చూస్తే ఆ క్షణంలో నిజంగా ఆయన మీద జాలివేసింది.

అమ్మ బ్రతికి ఉన్నప్పుడు ఇలా జరిగి ఉంటే పెద్ద గొడవ అయి ఉండేది. నాన్నగారికి కోపం వస్తుందో రాదో తెలియదు కానీ అమ్మ అలా పరిస్థితులను సృష్టించేది.

"నాన్నగారికి కోపం వస్తుంది. అరుస్తారు."

"ఆయనకి ఇవన్నీ నచ్చవు."

"ఆయన్ని ఒక్క మాట అడకుండా ఈ పని చేయకూడదు."

ఇలా చెప్పి చెప్పి తెలిసిన వాళ్ళకీ, చుట్టాలకీ మధ్య నాన్నగారి గురించి ఒక సింహస్వప్నాన్ని సృష్టించింది. అమ్మపోయిన తర్వాత ఆ రూపం మాసిపోయి, ఇరవై ఏళ్ళు కూడా నిండని గయ్యాళి కోడలితో వేగలేక చల్లారిన చారన్నాన్ని నోరెత్తకుండా తినాల్సి వచ్చిన అగజాత్యం నాన్నగారికి.

భోజనం ముగించి నాన్నగారు చెయ్యికడుక్కోడానికి వెళ్ళినప్పుడు కామాక్షిని అడిగాను.

"ఇప్పుడు ఒంట్లో కులాసాగానే ఉన్నట్లుందే?"

"అంటే నేను మంచం మీదే పడి ఉండాలా? చెప్పండి. అలాగే మంచం మీదే పడి చస్తాను."

"ప్రతిదానికీ ఊరంతా వినబడేలా అరుస్తావెందుకు? నోటిమాటగా కాస్త మంచిగా నిన్నేమీ అడక్కూడదా?"

"అవునండీ. నాకు ఊరంతా వినబడేటట్లు అరవడం మాత్రమే వచ్చు. మీరంతా కార్యశూరులు. నేనేం చేసినా అది తప్పే. ఎందుకంటే నేను పల్లెటూరినుంచీ వచ్చిన దాన్నికదా. ఇల్లూ వాకిలి చక్కపెట్టుకోవడం నాకు రాదు. వంటా వార్పూ అస్సలు చేతకాదు. నలుగురితో మసులుకోవడం తెలీదు." కామాక్షి సాగదీస్తున్నట్లుగా ఏకరువు పెట్టింది.

ఆమె వైపు న్యాయం లేదని నేనలేను. తనకీ రోషం ఉందని ఆమె చూపించుకోగల్గిన చోటు వంటిల్లు మాత్రమే.

నాన్నగారు వచ్చి గుమ్మం దగ్గర నిలబడ్డారు. ఆయన మనసులో ఎలాంటి ఆలోచనలు సాగుతున్నాయో నాకు తెలుసు. నేను నోరు తెరిచి ఏదీ అడగక్కరలేదు.

"నాన్నా! తను చిన్నపిల్ల. ఆమెతో సమంగా పోటీ మీకెందు?" అని నేను అడగదలుచుకున్న ప్రశ్న నాన్నగారికి అర్థం అయ్యే ఉంటుంది. ఆ ప్రశ్నకి నాన్నగారు తన మనస్సులోనే ఈ విధంగా జవాబు తయారు చేసి ఉండొచ్చు.

"ఒరేయ్ వాజమ్మా! నువ్వు కదా నీ భార్యని అదుపులో పెట్టుకుని ఉండాల్సింది. నన్ను అడుగుతున్నావా పెద్ద మొనగాడిలా?"

ఒక వయస్సు దాటిన తర్వాత ఎవ్వరినీ అదుపులో పెట్టడం సాధ్యపడే విషయం కాదేమో.

నాన్నగారికి అమ్మని అదుపులో పెట్టుకోవాల్సిన అవసరం ఎప్పుడూ రాలేదు. కానీ పసికందుకూడా తనకంటూ ఒక దారి ఉందని భీష్మించుకుని కూర్చునే కాలం ఇది. మరీ అదుపులో పెట్టాలని చూస్తే విపరీతంగా ఏదైనా జరిగే ఆస్కారం ఉంది.

స్కూటర్ మీద స్పీడ్‌గా మెయిన్ రోడ్డుకి చేరుకున్నాను. నాన్నగారు మునపటిలాగా క్లబ్బులకీ, పేకాటలకీ వెళుతూ ఉంటే ఇంట్లో ఇంత గొడవ ఉండేది కాదు. కానీ నాన్నగారు ఇంటి గుమ్మం కూడా దాటడం మానేశారు. చనిపోయిన అమ్మ ఏ క్షణమైనా తిరిగి వస్తుందేమో అన్నట్లు, అప్పుడు తను ఇంట్లోనే ఉండి ఆమెను 'రామ్మా! లోపలికి రా' అని స్వాగతం పలికి లోపలికి తీసుకెళ్ళాలి అన్నట్లు ఇంట్లోనే పడి ఉన్నారు.

అంత దుఃఖంలో ఉన్న మనిషి ఇంట్లో వేరే ఏ విషయాలనూ పట్టించుకోకూడదు. కామాక్షి గిన్నెల్ని క్రింద మీదా చేసే విషయాన్ని కూడా. కామాక్షి కూడా అదే అడుగుతోంది. "నా కంటూ ఒక జీవితం వంటింట్లో కూడా ఉండకూడదా? అక్కడకి కుడా వచ్చి నన్ను అజమాయిషీ చేయాలా?" అని.

నాన్నగారు ఎందుకు సర్దుకుపోలేకపోతున్నారు? కొంచెం ఆలోచిస్తే నాకు ఆ విషయం అర్ధమయ్యింది. నాన్నగారి హయాంలో అమ్మ చాలా స్వేచ్ఛగా ఉండేది. ఇంకా చెప్పాలంటే మా ఇంట్లో ఏ విషయంలోనైనా నిర్ణయం అమ్మదే. అలా సర్వాధికారిగా ఉన్న అమ్మ నాన్నగారి రోజువారీ పనులలో కొంచెం కూడా అశ్రద్ధగా ఉండేది కాదు.

చప్పుడు చేయకుండా కంచం పెట్టేది. స్నానాల గదిలో వేన్నీళ్ళు, సబ్బు, టవలు అన్నీ తయారుగా ఉంచేది. నాన్నగారు స్నానం చేసి రాగానే గంధం అరగదీసే పీట, గంధపు చెక్క తయారుగా ఉంచేది. మాసిన బట్టలు చాకలి వాడికి వేయడం, పర్సులో యాభై రూపాయలకి తక్కువకాకుండా ఉండేటట్లు చూసుకోవడం, క్లబ్బులకి కట్టాల్సిన చందాలను ముందుగానే గుర్తుచేయడం... ఇలా ప్రతి చిన్న విషయంలో కూడా ఏ కొరతా రాకుండా చూసుకునే ఒక మనిషి పట్ల గౌరవం ఇలాంటి చిన్న చిన్న విషయాల్లోనే కనబడుతుందని నాన్నగారు అనేవారు. ఆ రీతిన చూస్తే కామాక్షి నాన్నగారిని పురుగుకన్నా హీనంగా చూస్తుందనే చెప్పవచ్చు.

నాన్నగారైనా కామాక్షిని పెద్దింటి అమ్మాయిలా - రాజకుమారిలా భావిస్తున్నట్లు మాట వరసకైనా అని ఉండాల్సింది. ఈ కాలంలో రాజకుమారిని ఎవరు చూడొచ్చారు? ఎదుటివాళ్ళగురించి మనం గొప్పగా అనుకుంటున్నట్లు నడుచుకుంటే వాళ్ళ నుంచీ మనకీ అదే విధమైన స్పందన వారికి ఉండేదేమో. కానీ నాన్నగారు, కామాక్షి ఒకరి నొకరు కాలి ధూళికన్నా హీనంగా భావిస్తున్నారు. ఇద్దరూ అవస్థలు పడుతూ, గొడవలను సృష్టిస్తున్నారు. కామాక్షి చిన్నది. కానీ నాన్నగారు అలా కాదుకదా. అమ్మపోయిన తర్వాత ఆయన మనస్సు పూర్తిగా దుఃఖంతో నిండిపోయింది. ఒకవేళ అమ్మే తిరిగి వచ్చినా ఆ గాయం ఇక మాసిపోదు.

ఫ్యాక్టరీ నుంచి వచ్చేటప్పుడు క్యాంటిన్ మేనేజర్ని చూడటానికి వెళ్ళాను. నాన్నగారికి క్యాంటిన్‌లో చేసే మిక్చర్ అంటే చాలా ఇష్టం. చిన్న చిన్న విషయాలు కూడా ఎలా దుఃఖాన్ని కలిగిస్తాయో అలాగే సంతోషాన్ని ఇచ్చే విషయాలు కూడా ఒక్కోసారి చాలా అల్పమైనవిగా ఉంటాయి. ఇలా ఇంట్లో గొడవ జరిగిన తర్వాత అన్నీ మాములుగా సర్దుకున్న రోజులున్నాయి. ఈసారీ అలాగే సర్దుకుంటుందని అనుకున్నాను. నాన్నగారు మిక్చరు పొట్లం తీసుకున్నప్పుడు అంతా సర్దుకుందని తృప్తిపడ్డాను కూడా.

కానీ అలా జరగలేదు. నాన్నగారు తనలో తాను ముడుచుకుని పోవడం ప్రారంభించారు. కామాక్షి కడుపుతో ఉందని తెలిసి ఆమె తాలూకు చుట్టాలు ఇంటికి వచ్చినప్పుడు నాన్నగారు ఎవరితోనూ మాట్లాడకుండా, ఒకరోజు పూర్తిగా అన్నం తినకుండా ఉండిపోయారు. కామాక్షికి గాజులు తొడిగించడానికి వాళ్ళు ఊరుకి తీసుకువెళ్ళిన మర్నాడూ నాన్నగారికి స్ట్రోక్ వచ్చి స్పృహ పోయింది. ఆ మరుసటి రోజే ఆయనపోయారు. గాజులు తొడిగించడం, సీమంతం ఏదీ జరగకుండానే నేను బాబుకి తండ్రినయ్యాను.

కామాక్షి కొడుకును చూసుకుంటూ, నాకు సవ్యంగా వండిపెడుతోంది. నేను ఆమెను అస్సలు కోపగించుకోవటం లేదు. ఇంకా చెప్పాలంటే కన్నకొడుకు కన్నా మిన్నగా, చాలా జాగ్రత్తగా ఆమెను చూసుకుంటున్నాను. ఆమె నిండా నూరేళ్ళూ బ్రతకాలి. అప్పుడే నా కొడుకు పెద్దవాడైన తర్వాత ఆఖరురోజుల్లో మా నాన్నగారికి పట్టిన గతి నాకు పట్టకుండా ఉంటుంది.

## నేను మాత్రం..!?

తమిళ మూలం: శివశంకరి

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్



రచయిత్రి

**కాళ్ళు చాపుకుని** చాపమీద పడుకున్న విశాలాక్షికి ‘అమ్మయ్య!‘ అని అనిపించింది. ఎంత పెద్ద పని సవ్యంగా ముగిసింది!? ఒంటరిగా బ్రతికే ఆడదే అయినా నలుగురూ మెచ్చుకునే విధంగా కూతురుకి పెళ్ళి చేసి అత్తారింటికి పంపించడం అంటే మాటలా?

అంతా ఏడుకొండల వాడి దయ. కామాక్షి పిన్నిగారి సాయం మాత్రం లేకపోతే కూతురి పెళ్ళి గురించి అసలు ఆలోచించగలిగేదా?

కార్లు, బంగళాలు లేకున్నా వియ్యంకులు అంతస్తుగలవాళ్ళే, అల్లుడికి స్కూటర్ ఉంది. ఉన్న ఇల్లు పెద్దకొడుక్కి సొంతం. "పాపా! పాపా!" అంటూ ప్రేమగా చూసుకునే అత్తగారు. పెళ్ళికి పట్టుచీర, మంగళ సూత్రాలు అన్నీ వాళ్ళు తెచ్చినవే?

"వదినగారూ! మీ పరిస్థితి నాకు తెలుసు. అనవసరంగా అప్పు చేసి కష్టపడకండి. మీ అమ్మాయి మా ఇంట్లో మహాలక్ష్మిలా అడుగుపెడితే అంతేచాలు."

ఎవరు ఉంటారు ఇలా? ఈ కలికాలంలో ఎవరు అంటారు ఇలా?

ఈ సంబంధం కుదరడానికిదారి చూపించిన కామాక్షి పిన్నికి గుడి కట్టించి మూడుపూటలా ప్రదక్షిణం చేసినా తక్కువే.

"విశాలాక్షీ! కూతురు పెళ్ళీడు కొచ్చిందని, త్వరగా పెళ్ళి చేసేయాలని నువ్వు రోజూ మొర పెట్టుకుంటూ ఉంటావు కదూ. ఆ దేవుడు నీ మొర ఆలకించినట్లున్నాడు. నిన్న మా ఆడపడచు కూతురికి సీమంతం అని భువనగిరికి వెళ్ళాను కదా. అక్కడ సుభద్రని చూసాను. సుభద్ర ఎవరో నీకు చెప్పలేదు కదూ. మా ఆడపడుచు కూతురు పంకజం లేదూ! వాళ్ళ ప్రక్కింటావిడ. వాళ్ళాయన పోయి నాలుగేళ్ళు అవుతుందట. నలుగురు కొడుకులు. ఉమ్మడి కుటుంబం. పెద్దబ్బాయి వకీలు. రెండోకొడుకు మెకానిక్ షాప్ నడుపుతున్నాడు. ఆఖరు కొడుకు ఇంటర్ చదువుతున్నాడు. అన్నీ ఉన్నా ఏం ప్రయోజనం చెప్పు? ఏదో శాపం తగిలినట్లు ఇద్దరు ఆడపిల్లల్ని దిక్కులేని వాళ్ళలాగా వదిలేసి అర్థాంతరంగా పెద్దకోడలు రెండేళ్ళ క్రితం చనిపోయిందట, రెండో కోడలికి ఉన్నట్టుండి పక్షవాతం వచ్చి ఒక చేయి, కాళు పడిపోయి ఆరునెలలుగా మంచం మీదే ఉందట. పాపం! వింటుంటే చాలా కష్టంగా అనిపించింది. పెద్దకొడుకుని "మళ్ళీ పెళ్ళీ

చేసుకోరా. నాకూ ఇంట్లో కాస్త సాయంగా ఉంటుంది" అని ఆ తల్లి బ్రతిమాలిందట. కానీ అతగాడు ఒప్పుకోలేదట" పెద్దవాళ్ళిద్దరూ సన్యాసుల్లా బ్రతుకుతున్నారు. మూడోవాడికైనా గుణవతి అయిన అమ్మాయి భార్యగా రావాలి మా ఇల్లు కళకళలాడాలి' అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది. 'డబ్బు దస్కం ఏమీ వద్దు. ఆస్తులు, అంతాస్థులు, అందచందాలు లేకున్నా ఫరవాలేదు. గుణవంతురాలైతే చాలు' అని సుభద్ర అన్నప్పుడు నాకు మన జయ జ్ఞాపకం వచ్చింది. వెంటనే ఆవిడతో చెప్పాను. 'వంటామె కూతురైతే మాత్రం ఏమైంది. స్కూల్ ఫైనల్ దాకా చదివింది. నోరెత్తని పిల్ల, గుణవంతురాలు, చుడ్డానికీ బాగానే ఉంటుందని మీరే అంటున్నారు. ఇంకా ఏం కావాలి? వచ్చే శుక్రవారం పెళ్ళి చూపులకి వస్తామని చెప్పండి' అన్నారావిడ. విశాలాక్షీ! నీ కూతురుకి కళ్యాణ గడియ వచ్చేసింది సుమా."

అవును మరి. ఆ కళ్యాణ ఘడియ రాకపోతే శుక్రవారం పెళ్ళిచూపులు అవగానే ఆ చేత్తోనే తాంబూలాలు మార్చుకుని సరిగ్గా ఎనిమిదోరోజు యాదగిరి గుట్టలో పెళ్ళి జరిపించి, మొన్న భువనగిరిలో శోభనం అయ్యాక జయను అత్తగారింట్లో దిగబెట్టి మళ్ళీ నేను ఇలా హాయిగా విశ్రాంతి తీసుకుంటున్నాను అంటే అది జరిగే పనేనా?

కళ్ళు మూసుకున్నా విశాలాక్షికి నిద్ర వచ్చేట్లు లేదు. అటూ ఇటూ పొర్లింది. లేచి కూజా నుంచి నీళ్ళు వంపుకుని త్రాగింది.

ఏడు సంవత్సరాలు గడిచిపోయాయి కదూ, ఆ మనిషిని పాడె మీద పడుకోబెట్టి ఎన్నో యుగాలుగా వైధవ్యం అనుభవిస్తున్నట్లుగా దుఃఖం ఇంకా పచ్చిగా మనసును తొలిచేస్తుంది.

లోకంలో ఇంత మంది మగవాళ్ళు ఉండగా ఆ దిక్కుమాలిన టి.బి ఈయనకే రావాలా!? మొదట్లో ఏదో మామూలు దగ్గు, జ్వరం అని అశ్రద్ధ చేశాడు కృష్ణమూర్తి. మిరియాల కషాయం, కరక్కాయల చూర్ణం అంటూ వంటింటి వైద్యంతో సరిపెట్టుకున్నాడు. ఇంకాస్త విషమించగానే వేడిచేసినట్లుందని ఆవుపాలతో మిరియాలపొడి, పటిక బెల్లం కలిపి తాగాడు. ఇలా చిట్కా వైద్యాలు చేస్తూ రోజులు రోజులు గడిచే సరికి రోగం. బాగా ముదిరిపోయింది. ఆ తర్వాత గవర్నమెంట్ ఆస్పత్రికి వెళ్ళి చూపించుకున్నాడు.

ఒకరోజు రాత్రి లేచి కూర్చుని ఊపిరి అందనట్లుగా దగ్గాడు. "గుండెలో నొప్పిగా ఉంది విశాలాక్షీ!" అన్నాడు. విశాలాక్షి గబగబా తవుడు వేయించి కాపడం పెడుతుండగానే "తల బ్రద్దలవుతున్నట్లుగా ఉంది విశాలాక్షీ!" అంటూ భళ్ళున రక్తవాంతి చేసుకున్నాడు. అంతే! ఆ క్షణమే ప్రాణం పోయింది.

జీవితాంతం తోడుగా ఉంటాడనుకున్న మనిషి అర్ధాంతరంగా చనిపోయినప్పుడు విశాలాక్షికి ఇరవైఎనిమిదేళ్ళు. కూతురు జయకు తొమ్మిది నిండి పదో ఏడు.

దిక్కు తోచక తోడబుట్టిన అన్నగారింటికి వెళ్ళింది. ఆరునెలలు కూడా అక్కడ ఉండలేకపోయింది. వదిన పరమ గయ్యాళి మూడు ముద్దలు పడేసి తనచేత గాడిద చాకిరి చెయించుకున్నందుకు కూడా విశాలాక్షి బాధపడలేదు. కానీ తొమ్మిదేళ్ళ పసిదానికి చద్దన్నం మాత్రం పెట్టి, బావినుంచీ నీళ్ళు తోడించడం, ఇంట్లో ఉన్న గంగాళాలు, బకెట్లు ఆఖరికి గ్లాసు కూడా వదలకుండా నీళ్ళు నింపమని పురమాయించడం, అందినప్పుడల్లా చావబాదడం... అన్నీ చూసాక ఓర్చుకోలేకపోయింది. అన్నగారింటి నుంచీ బయలుదేరి మేనమామ ఇంటికి వెళ్ళింది.

అన్నగారిల్లు మండే పొయ్యి అంటే మేనమామ ఇల్లు కాలే పెనం అని నెల తిరక్కముందే విశాలాక్షికి అర్ధమయ్యింది.

అత్తయ్య ఊళ్ళో పెత్తనానికి బయలుదేరిన సమయంలో మేనమామ "హి...హి" అంటూ పళ్ళికిలించడం మొదలు పెట్టాడు. కాఫీగ్లాసు ఇస్తే చెయ్యి తగిలేటట్లు అందుకునేవాడు. రోజంతా చూపులతో వెంటాడేవాడు.

ఒకరోజు అత్తయ్య గుడికి వెళ్ళిన సమయం చూసి వీధి తలుపు గొళ్ళెం పెట్టి లోపలికి వచ్చాడు. రోట్లో పచ్చడి దంచుతున్న విశాలాక్షి వెనక నుంచి గట్టిగా కావలించుకున్నాడు.

"విశాలా! మిస మిసలాడే నిండు యవ్వనాన్ని ఇలా వృధా చేయవచ్చా? అత్తయ్య ఇప్పట్లో రాదులే. బుద్ధిగా నేను చెప్పినట్లు

విన్నావంటే, నీకేం కావాలో అన్నీ నేనే చూసుకుంటాను. అర్థం అయ్యిందా? అనవసరంగా బెట్టు చేయకు" అంటూ గుసగుసలాడాడు.

విశాలాక్షిని వెనకనుంచీ గట్టిగా కావలించుకున్నాడు.

విశాలాక్షి చేతిలో ఉన్న రోకలిని మామయ్య కాలి మీద దబ్బున వేసింది. "దుర్మార్గుడా! నీ మనసులో ఏమనుకుంటున్నావు? అత్తయ్య ముఖం చూసి వదిలిపెడుతున్నాను. లేకపోతే రోకల్ని నీ నెత్తి మీదే వేసేదాన్ని. కుక్కచావు చస్తావు. " అదిరే గుండెలతో ఆవేశంగా అరిచింది. ఒక్కక్షణం కూడా ఆలస్యం చెయ్యకుండా మూలనున్న బట్టల సంచి తీసుకుని, వీధిలో ఆడుకుంటున్న జయతో సహా అక్కడినుంచీ బయలుదేరింది.

అక్కడనుంచీ నేరుగా తాను ముందు కాపురం ఉన్న ఇంట్లో వెనక పోర్షన్‌లో ఉంటున్న గుండమ్మ దగ్గరికి వెళ్ళింది.

"నాకు ఏ దిక్కూ లేదు పెద్దమ్మా! ఈ లోకంలో మొగుడు పోయినదానికి ఒక్కొక్క అడుగులోనూ ఆపద పొంచి ఉంటుందన్న సంగతి బాగా అర్థమయ్యింది. ఈ బొందిలో ఊపిరి ఉన్నంతవరకు సీతమ్మగారిలాగే బ్రతకాలని అనుకుంటున్నాను. నాకు సాయం చేయండి. మిమ్మల్నే నమ్మకుని కొండంత ఆశతో వచ్చాను." పెద్ద పెట్టున ఏడ్చింది విశాలాక్షి.

గుండమ్మ పన్నెండేళ్ళ వయసులోనే పెద్దమనిషి కాకముందే పసుపుకుంకుమలు కోల్పోయి గుండు గీయించుకుంది. బంధువులు, తెలిసిన వాళ్ళు అంటూ ఎవరింటికీ వెళ్ళకుండా స్వశక్తినే నమ్ముకుని బ్రతుకు తెరువు చూసుకుంది. పెళ్ళిళ్ళకి పండగలకీ స్వీట్లు, కారా చేయడంలో చేయి తిరిగిన మనిషి.

వైధవ్యం ఎంత భయంకరంగా ఉంటుందో స్వయానా అనుభవించి ఉన్నందువల్ల పెట్టకోడి తన పిల్లలకి రెక్కల క్రింద ఆశ్రయం ఇచ్చినట్లు రెండుచేతులూ చాపి విశాలాక్షి, జయలను అక్కున చేర్చుకుంది గుండమ్మ.

తొలిరోజుల్లో పిండి మరకి వెళ్ళి బియ్యం పిండి ఆడించుకుని రావడం, జంతికలకి పిండి కలపడం. జంతికల్ని దోరగా వేయించడం అంటూ మొదలుపెట్టి కాల్రకమేణా గుండమ్మకి వారసురాలిగా పేరు సంపాదించుకుంది. స్వీట్లు, కారాలు చేయడంలో గురువుని మించిన శిష్యురాలిగా విశాలాక్షి తయారయ్యేసరికి కాలగర్భంలో ఏడు సంవత్సరాలు కలిసిపోయాయి.

ఈ మధ్య కాలంలో జయ స్కూల్ ఫైనల్ పరీక్షలు వ్రాసింది. చూస్తుండగానే రేసు గుర్రంలాగా మంచి నిగారింపుతో ఏపుగా ఎదిగింది. నల్లగా నిగనిగలాడే తలకట్టు, అంగసౌష్టవం చూసే వాళ్ళ దృష్టిని తమ వైపు తిప్పుకునేలా చేసాయి.

వంటామె కూతురికి ఇంత అందం ఎందుకు అన్న భయం పట్టుకుంది విశాలాక్షికి. వంట పని మీద ఎవరింటికైనా వెళ్ళినప్పుడు "కూతురు పెళ్ళీడుకొచ్చింది రోజులు చూస్తే బాగా లేవు. కట్టుకున్న మొగుడు పోయాడు. చేతిలో చిల్లిగవ్వలేదు. ఒంటరి ఆడదాన్ని. నేనేం చేయగలను? కూతురికి పెళ్ళి చేసి ఈ భారాన్ని ఎలా దింపుకోనూ?" అంటూ కనబడ్డ ప్రతి మనిషి దగ్గరా తనగోడు వెళ్ళబోసుకునేది.

విశాలాక్షి ఏ ముహూర్తాన అలా అన్నదో గానీ జయకి వెంటనే పెళ్ళి సంబంధం కుదిరింది. లేకపోతే ఇంత మంచి సంబంధం తనని తానుగా వెతుక్కుంటూ వాకిట్లోకి వస్తుందా?

మంచినీళ్ళు తాగి మళ్ళీ వచ్చి చాపమీద పడుకున్న విశాలాక్షికి పెళ్ళికోసం చేసిన అప్పు గుర్తుకు వచ్చింది. అప్పు తీర్చాలంటే ఎన్ని నెలలు పడుతుందో మనసులోనే లెక్కవేసి చూసుకుంది.

కార్యం కూడా అయిపోయింది. ఇక ఏ నిమిషమైనా శుభవార్త రావచ్చు. ముప్పై ఆరేళ్ళు నిండకుండానే తను అమ్మమ్మ కూడా అయిపోతుంది అని అనుకోగానే విశాలాక్షికి సంతోషంగా అనిపించింది. ఆ సంతోషంలో పెదాల మీద చిరునవ్వు మెదులుతుండగానే వీధి తలుపును ఎవరో దబదబా బాదినట్లు శబ్దం వినిపించింది.

లేచి తలుపులు తీసిన విశాలాక్షి స్థంభించినట్లుగా నిలబడిపోయింది.

జయేనా ఇది! రేగిన జుట్టు, ఏడ్చి ఏడ్చి వాచిపోయిన ముఖం! ఏమైంది తనకి?

"ఏమైంది జయా? ఏం జరిగింది?"

జయ లోపలికి వచ్చి మూలగా గోడకి చేరగిలబడి కూర్చుంది.

"ఏం జరిగింది జయా? చెప్పి చావు."

"....."

"నీవేమైనా తప్పు చేసావా? అల్లుడుగారు నిన్ను కొట్టారా? అత్తగారేమైనా కోప్పడిందా?"

"..."

"అత్తగారింట్లో ఎలా మసులుకోవాలో తెలియక వాళ్ళకి తలవంపులు కలిగేలా ఏదైనా పిచ్చి పని చేసావా?"

"....."

"దేవుడి దయవల్ల నీ మెడలో మూడుముళ్ళు పడ్డాయని నేను సంతోషిస్తుంటే అదికాస్తా హరించుకుపోయేలా ఏదైనా ముదనష్టపు పని చేసావా?"

పావుగంట... అరగంట దాటింది. విశాలాక్షి కూతురిని బ్రతిమాలింది. కళ్ళెర్ర చేసింది. ఫలితం మాత్రం శూన్యం.

దేనికీ నోరు విప్పకుండా మౌనంగా ఉన్న జయను చూస్తే విశాలాక్షిని శివం ఎత్తినట్లయింది. పూనకం వచ్చిన దానిలా ఊగుతూ కూతురి జడలు పట్టుకుని గట్టిగా ఊపింది.

"ఇలా బెల్లం కొట్టిన రాయిలా కూర్చుంటే ఏమనుకోవాలి నేను? నీ మనసులో ఏమనుకుంటున్నావు? ఒళ్ళు బలుపెక్కి పులిసిపోయిందా? శ్రీరాముడిలాంటి భర్తనీ, కౌసల్యాలాంటి అత్తగారిని వదిలేసి ఇక్కడికి ఎందుకు వచ్చావు? ఇప్పటికిప్పుడు నిన్ను మీ అత్తగారింట్లో దిగ బెట్టి వచ్చిన తర్వాతే నాకు మనశ్శాంతి. మొదట లేచి రావే."

అంత సేపూ పిచ్చిదానిలా చూస్తూ కూర్చున్న జయ చటుక్కున తలతిప్పి కళ్ళు పెద్దవి చేసి తల్లివైపు చూస్తూ కూర్చున్న జయ చటుక్కున తలతిప్పి కళ్ళు పెద్దవి చేసి తల్లివైపు చూసింది.

'అమ్మా! ఏమన్నావు? రాముడిలాంటి భర్త, కౌసల్యలాంటి అత్తగారు అనా? లేదమ్మా లేదు. ఆవిడ ఒక కుంతి. దొరికిన దాన్ని సమంగా పంచుకోండి అని తన కొడుకులతో చెప్పిన నవీన కుంతి ఈమేనమ్మా."

"ఏమిటే జయ! ఏమిటినువ్వంటున్నది?"

"జీవితాంతం సీతమ్మవారిలాగా ఉండాలన్న కోరిక నీకు ఈ వయస్సులో కూడా ఉన్నప్పుడు నన్ను మాత్రం ద్రౌపదిలాగా బ్రతకమని ఎందుకు వెళ్ళగొడుతున్నావు? నేను మాత్రం ద్రౌపదిగా ఎందుకు బ్రతకాలి?"

నీళ్ళు నిండిన కళ్ళతో ఆవేశంగా అన్న జయ, తల్లిని పట్టుకుని నిశ్శబ్దంగా ఏడవసాగింది.

# కొత్త చెప్పులు (కరుస్తాయి)

తమిళ మూలం: డి.జయ కాంతన్
తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్




**ఆమె ముఖం** మీదే కొట్టినట్లుగా ధడాల్మని తలుపుల్ని వేస్తూ బయటకి వచ్చి నిలబడ్డాడు నందగోపాల్. తలుపులు వేసేంతవరకూ ఎక్కడికో వెళ్ళాలని కాని అతను అనుకోలేదు. ఆమె మీద తనకున్న కోపం, తన భావాల్ని లెక్కచేయకుండా తనని అవమాన పరిచే విధంగా గోడకి అటుపక్క తిరిగి ఆమె పడుకున్న తీరు, 'ఇంకా మీరు పడుకోలేదా?' అని ఆమె అడగాలన్న తన ఎదురు చూపు ..... ఆ అవమానం సహించుకోలేక ఆవేశంగా బయటకి వచ్చి ధడాలున తలుపులు వేశాడు.

ఆమె నిజంగా నిద్రపోయి ఉంటే ఈ శబ్దానికి మెలుకువ వచ్చి ఉండాలి. ఈ రభసకి ప్రక్క పోర్షన్ వాళ్ళెవరైనా మేల్కొన్నారో ఏమో? తన చేతలకు తానే సిగ్గుపడుతూ చీకటి పరచుకున్న ఆ ముంగిట్లో ఎదుటి పోర్షన్ వైపు చూసాడు. లోపల నైట్ లాంప్ మాత్రం వెలుగుతుండటం వెంటిలేటర్ ద్వారా కనబడింది. టేబుల్ ఫ్యాన్ తిరిగేచప్పుడు. గంట పదకొండు అయి ఉంటుంది. చేతిలో ఉన్న వాచ్ వైపు చూసాడు. చీకట్లో ఏమీ కనిపించలేదు. ఎక్కడికైనా వెళ్ళి రేపు ఉదయం తిరిగి వస్తే ఏం అని అనిపించింది. కానీ తలుపుల్ని ఇలా బార్లా తెరచి ఉంచి ఆమెను ఒంటరిగా ఎలా వదలి వెళ్ళడం అన్న జంకు ఏర్పడింది. ఆమె కావాలనే ఇలా మొండిగా ప్రవర్తిస్తున్నదని అతని మనసుకి అర్థమైంది.

ఏం చెయ్యాలో అతనికి అర్థం కాలేదు. తనమీదే జాలి వేసింది. ఇదంతా తన తలరాత అని మనస్సులోనే నొచ్చుకున్నాడు. తన ఉద్యోగం, తన జీతం అంటూ స్వతంత్రంగా తిరుగుతూ జీవితంలోని సంతోషాన్ని లేక వెలితిని అనుభవిస్తూ ఉన్న తను, అలాగే జీవితాన్ని గడిపేయదలచుకున్న తను, ఈ పెళ్ళి, భార్య, సంసారం వీటిల్లో ఏదో పెద్ద సుఖం ఉన్నట్లు, మనిషి జీవితం యొక్క పరమార్థమే అందులో ఉందనుకుని ఏదో దెయ్యం తనని ఆవహించి ఆ రొంపిలో దింపిన వైనాన్ని తలచుకుని నిట్టూరుస్తూ ఇంట్లోకి వెళ్ళకుండా అరుగుమీదే కూర్చుని సిగరెట్టు వెలిగించుకున్నాడు. చీకటి నిండిన ఆకాశంలో మెరుస్తున్న నక్షత్రాల వైపు చూసాడు.

"దెయ్యం" అన్న తలంపురాగానే అతనికి గిరిజ జ్ఞాపకం వచ్చింది. ఆమె ఎంత మంచిది సభ్యత సంస్కారం తెలిసిన మనిషి. ఒక దెయ్యాన్ని పెళ్ళి చేసుకుని ఇంటికి తీసుకుని వచ్చి గిరిజను పోయి దెయ్యం అన్నానే అని తనను తానే నిందించుకున్నాడు. కాని తాను పెళ్ళి చేసుకుని సంసార బంధంలో చిక్కుకోవడానికి కారణం ఆ గిరిజే కాబట్టి ఆమె మీద తనకి ఉన్న కోపం కూడా న్యాయమైనదే అని అనుకున్నాడు నందగోపాల్.

ఇప్పుడు ఈ సమయంలో ఆమెని చూసి వస్తే? అన్న ఆలోచన వచ్చింది అతనికి. ఆమెను ఎప్పుడైనా చూసి రావచ్చు, ఈ ఆరునెలల్లో, పెళ్ళయిన తర్వాత భార్యతో గొడవ పడినప్పుడల్లా 'ఎందుకు ఇలా రొంపిలో దిగబడ్డాం?' అని మనసులో నిరాశ ఆవరించుకున్న సమయంలో అతనికి గిరిజ జ్ఞాపకం వచ్చేది. కాని అక్కడికి వెళ్ళాలి అన్న ఆలోచన మాత్రం ఇప్పుడే వచ్చింది.

తను వత్సలని పెళ్ళి చేసుకోకముందు ఎలా తిరిగినా ఇప్పుడు తనని వంటరిగా వదిలేసి అక్కడికి వెళ్ళడం ఆమెకి ద్రోహం చేసినట్లు కాదా అని కూడా అనిపించింది. ఎంత గయ్యాళి అయినా, ఆమె మీద తనకి ఎంత కోపం ఉన్నా తన మీద ఉన్న ద్వేషంతో స్వాంతన కోసం ఆమె అలా ఏదైనా చేస్తే భర్తగా తను దానిని సహించుకోగలడు అన్న ఆలోచన రాగానే ఆ తలంపును కూడా తట్టుకోలేనట్లు

కణతల్ని బలంగా రుద్దుకున్నాడు.

గోడ గడియారంలో ఒకసారి గంట కొట్టిన శబ్దం వినబడింది. ఇంకా ఒంటిగంట అయి ఉండదు. మూసి ఉన్న తలుపు సందులోంచి వచ్చే సన్నని వెలుతురిలో చేతి గడియారాన్ని చూసాడు. పదకొండున్నరే అయ్యిందన్న తీర్మానానికి వచ్చాక తలుపు సందు ద్వారా తొంగిచూసాడు. ఆమె కదలకుండా, మెదలకుండా మునుపటిలాగే అటువైపు తిరిగి పడుకుని ఉంది. నందగోపాల్‌కి రోషం ముంచుకు వచ్చింది. లేచి వెళ్ళి ఒకసారి కాలితో తన్నాలని, చెంపలు పగిలేటట్లు వాయించాలని బలంగా అనిపించింది. "ఛీ..ఛీ" అని వెంటనే తన మీదే తనకి అసహ్యం వేసింది.

అటువంటి క్రూరమైన, భయంకరమైన సంఘటనలన్ని అతను చిన్న వయస్సులో చాలాసార్లు చూసి ఉన్నాడు. ఉన్నట్లుండి రాత్రిళ్ళలో అతని తల్లి యొక్క దీనమైన స్వరం వినబడేది. ఉలిక్కిపడినట్లుగా లేచి కూర్చునేవాడు. మనసు, శరీరమూ గజగజమని వణుకుతుండగా ఓ మూలగా నిలబడేవాడు. అతని తండ్రి ఏదో పూనకం ఆవహించినట్లు ఆవేశంగా తల్లిని ముఖం మీద, శరీరం మీద చేత్తో కాళ్ళతో తన్నేవాడు. "ఓరి దుర్మార్గుడా నీ చేతులు పడిపోను" అంటూ ఏడుస్తూ ఆక్రోశంగా తల్లి తిట్టిపోసేది. తల్లి తిటడం తండ్రి కొట్టడం... ఇలాగే సాగేది.

ఆ రోజులు చాలా భయంకరమైనవి. మర్నాడు ఏమీ జరగనట్లు ఇద్దరూ నడుచుకోవటం... ఆమె ఆయనకి సేవలు చేయడం ... ఆయన ఆమెను పేరు పెట్టి పిలిచి ఊర్లోని విశేషాలు చెప్పడం.... ఇవన్నీ మనసులో పేరుకునేది.

పదిహేను సంవత్సరాల దాకా ఇలాంటి జీవితాన్నే అనుభవించాడు. తల్లితండ్రుల గొడవల కన్నా వాళ్ళు రాజీపడే విధానం అతని మనసుని చాలా బాధించింది. అతను తన తండ్రిని మనస్ఫూర్తిగా ద్వేషించేవాడు. సంసార జీవితం పట్ల అసహ్యం ఆ లేత ప్రాయంలోనే ఏర్పడడానికి ఈ అనుభవాలే కారణం అయి ఉండవచ్చు.

ఇప్పుడు అతనికి తండ్రిలేడు. తల్లి ఊర్లో ఒంటరిగా ఉంటోంది. తను చనిపోయేముందు కొడుక్కి పెళ్ళి చేసిచూడాలన్న తన కోరికను అతని దగ్గర ప్రస్తావించినప్పుడల్లా ఆమె జీవితాన్ని ఉదాహరణంగా చూపించి ఎద్దేవా చేసేవాడు. అప్పుడు ఆమెకి కోపంగానూ, బాధగానూ కూడా ఉండేది. పట్టువదలకుండా "పెద్దగా చెప్పొచ్చావు నా సంసారానికేమొచ్చింది?" అని గొప్పలు చెప్పుకునేది. ఆఖర్న 'పెళ్ళిచేసుకోవడం కుదరదు' అని తల్లి దగ్గర కుండబద్దలు కొట్టినట్టు చెప్పేసి వచ్చేసాడు నందగోపాల్.

పట్నంలో ఉద్యోగం చేస్తూ ఒంటరి జీవితానికి అలవాటు పడిపోయి ముప్పై ఏళ్ళు నిండేదాకా గడిపేసిన నందగోపాల్ మనసులో పెళ్ళి గురించి, సంసారం గురించి అందమైన ఊహలను రేకెత్తించి,అతన్ని దానికి తయారు చేసింది గిరిజ యొక్క సాహచర్యమే. గిరిజకి ముందు అతనికి అలాంటి సంబంధం ఏ అమ్మాయితోనూ లేదు. ఆమెకు ఇతను చాలా క్రొత్త మనిషిలాగా అనిపించాడు. కానీ ఆమె అలా కాదని, ఫలానా అని ఇతనికి మాత్రమే కాకుండా అందరికీ తెలిసిన విషయమే. ఆమె కూడా ఆ విషయాన్ని దాచిపెట్టే స్థితిలో లేడు. అయినా కూడా ఇతనితో ఉన్న రోజుల్లో ఆమె చాలా విశ్వాసంతో, ప్రేమతో స్త్రీయొక్క సహచర్యం ఒక మగవాడికి ఎంత సంతోషాన్ని తృప్తినీ కలిగిస్తుందో తెలిపే విధంగా జీవించింది.

ఆ రెండు నెలలు తను గడిపిన దాంపత్యం చాలా అపురూపమైనదని ఈ క్షణంలో అనిపించింది నందగోపాల్‌కి. తనను అవమానపరచి, అలక్ష్యం చేసి ఈ అర్ధరాత్రిలో గుమ్మానికి అవతల నిలబెట్టి ఏమీ పట్టనట్లు పడుకుని ఉన్న భార్యమీద కోపంతో రగిలిపోతూ, నిట్టూరుస్తూ నీళ్ళు నిండిన కళ్ళతో ధైర్యంగా మళ్ళీ లోపలికి తొంగి చూసాడు.

ఆమె ఖచ్చితంగా లేవడమో, రాజీ పడడమో చేసే మనిషి కాదు. ఈ ఆరునెలల అనుభవంతో ఇలాంటి సంఘటనలకి అలవాటు పడిపోయి ఉన్నందువలన దీని ప్రారంభం ముగింపు అతనికి ముందుగానే తెలిసిపోతున్నాయి. అయినా కూడా దీనిని అడ్డుకోలేకపోతున్నాడు. తర్వాత ఆలోచించి చూస్తే న్యాయానికీ ఈ గొడవలకీ సమన్వయం ఉన్నట్లనిపించలేదు. రోజు రోజుకీ

అవమానభరితంగా, దుఃఖపూరితమైనదిగా మారుతూ ఉండే ఈ జీవితాన్ని ఎలా భరించాలో అతనికి అర్థం కాలేదు.

లోపల మసక వెలుతుర్లో దండెం మీద ఆరేసిన బట్టలు, చిందరవందరగా ఉన్న గిన్నెల తాలూకు నీడలు ఏదో శోకాన్ని ప్రతిబింబిస్తున్నట్లు అనిపించింది.

ఒక గది, దాన్ని ఆనుకుని తలుపులు లేకుండా గోడతో వేరు చేయబడిన వంటిల్లు, అందులోనే నీళ్ళ తొట్టె, స్నానానికి చిన్న మరుగు ఉన్న ఆ పోర్షన్‌కి అద్దె నలభై అయిదు రూపాయలు. ఇంటి ఖర్చులకి నెలకి నూటయాభై. నందగోపాల్ జీతం దాదాపు మూడువందలు. మనసులు కలిసి జీవించగలిగితే ఆ ఇరుకు ఓ లెక్క కాదు. ఆరేడు మంది కలిసి తలా నూరురూపాయలు ఇచ్చి అన్ని సౌకర్యాలతో గడిపిన ఆ మెస్ జీవితాన్ని తలుచుకుంటే ఇప్పుడు తను ఉన్న స్థితి చేదుగా అనిపించింది.

నిట్టూరుస్తూ లేచాడు. గిరిజ దగ్గరకి వెళ్ళి ఈ రాత్రి తనతో గడపడం తన మనస్సుకి కొంచెం సమాధానంగా ఉంటుందని అనిపించింది. వేరే దేనికోసమూ కాదు అన్న ఆలోచనతో, దాని గురించిన సంశయాన్ని వదిలేసినట్లుగా, ఆమెతో మాట్లాడుతూ ఉండడం తనకి శాంతిగా ఉంటుందన్న సమాధానంతోనూ బయలుదేరాడు. లోపలికి వెళ్ళి షర్ట్ తీసి వేసుకున్నాడు. మసక వెలుతురికి అలవాటు పడిన కళ్ళకి నలభై వోల్టు బల్బువేయగానే వెలుతురుకి తట్టుకోలేక కళ్ళు చికిలించాడు.

"ఇదిగో నిన్నే" అంటూ మెల్లగా ఆమెను తట్టిలేపడానికి ప్రయత్నించాడు. ఆమె కదలలేదు.

"ఇప్పుడు నీతో సరసాలాడటానికి లేపలేదు. బైటకి వెళుతున్నాను. లేచి తలుపులు వేసుకో" అంటూ ఆమె భుజాన్ని గట్టిగా నొక్కుతూ నొప్పి కలిగేటట్లు మొరటుతనంగా తిప్పాడు.

ఆమె లేచి కూర్చుని ముఖం చిట్లిస్తూ కోపంగా అతని వైపు చూసింది.

ఇంతసేపూ లేవని మనిషి తను వెళుతున్నానని అనగానే తలుపులు వేసుకోవడానికి సిద్ధంగా లేచి కూర్చోగానే అతనికి అగ్గిమీద గుగ్గిలం వేసినట్లు భగ్గుమంది.

'ఈ రాత్రివేళలో ఎక్కడికి వెళుతున్నారు?' అని అడగడమే కదా న్యాయం? కానీ ఆమె అడగలేదు. 'వెళేవాడివైతే వెళ్ళి చావు. నేను హాయిగా పడుకుని నిద్రపోవాలి' అన్న రీతిలో ఆమె అతన్ని కొంచెం కూడా లక్ష్యం చేయకుండా ముఖం తిప్పుకుని కూర్చుంది.

నందగోపాల్ చెప్పులకోసం మంచం క్రింద వెతికాడు. మంచం చివర్న వ్రేలాడుతున ఆమె చీర యొక్క నీడనో లేక ఆమె కాళ్ళ నీడనో అతనికి కనబడనీయకుండా చేసింది. మంచం క్రింద చెప్పుల కోసం తను ఇలా వెతుకుతున్నప్పుడు ఆమె అడ్డంగా మంచం మీద కూర్చుని ఉండటం, అలా తాను అడ్డంగా కూర్చుని ఉన్న విషయం కూడా ఆమెకి తెలియదని అతనికి అర్థం అయినా ఇలా తనకేమీ పట్టనట్లు కూర్చుని ఉండటం తనని అవమానించడమే అని అతనికి అనిపించింది.

ఆ కోపంతోనే అతను చెప్పులు వెతికి తీసుకుని లేచేటప్పుడు మంచం కోడుకి తల కొట్టుకుంటుంది. నొప్పిని తట్టుకోలేనట్లు కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆమె కొంచెంకూడా తొణకకుండా నిబ్బరంగా అలాగే కూర్చుంది. ఇలాంటి సందర్భంలో ఆమెకి తలకి దెబ్బగానీ, వేలికి గాయంగానీ అయి ఉంటే ఇలా కంగారు పడకుండా ఉండటం అతనికి చేతకాదేమోనన్న ఆలోచన రాగానే అతనికి తనమీదే జాలివేసింది. ముఖం తిప్పుకొని చెప్పులు వేసుకుని బయలుదేరాడు.

తెరిచిన తలుపుల్ని మూయకుండా నిదానంగా నడిచి సావిట్లో ఓ మూలన ఉన్న సైకిల్ యొక్క తాళం తీసాడు. చీకట్లో ఉన్న తనని చూడటం ఆమెకు సాధ్యం కాదు. కాబట్టి తలుపు దగ్గరకి వచ్చి తొంగి చూస్తుందేమోనని ఎదురుచూసాడు. అతని మనసు గాయపడే విధంగా ఆమె తలుపుల్ని ధడాల్మని వేస్తూ లోపల గొళ్ళెం పెట్టుకుంది. ఆమె తన కోసం తొంగి చూడకుండా ఇలా చేయడం అతనికి చాలా బాధగా అనిపించింది. లోపల వెలుగుతున్న బల్బును తీసేసినట్లు, నైట్‌ల్యాంప్ వెలుతురు వెంటిలేటర్ ద్వారా కనబడింది.

నందగోపాల్ సైకిల్‌ను తోసుకుంటూ ముందుకు సాగాడు. వాకిట్లో సాన్పు జల్లే నూకాలమ్మ చాపమీద కూర్చుని దగ్గుతున్నదల్లా

అతను బైటకి వెళ్ళడం చూసి "మళ్ళీ ఎప్పుడొస్తావు బాబూ" అని అడిగి తను లేదనగానే లేచి తలుపులు వేసుకుంది.

బైటకి వెళ్ళి సిగరెట్టు వెలిగించుకుంటూ ఉండగా వీధి దీపాలు చటుక్కున ఆరిపోయాయి. సైకిల్ డైనమో వెలుతురు దారిచూపించగా అతను సైకిల్ మీద ఎక్కి రివ్వున సాగాడు.

గిరిజ ఇల్లు మాంబళంలో గతుకులు, గుంటలు, గేదెలు నిండిన ఒక సందులో ఉంది. వీధి వైపు మేడమెట్లు ఉన్న ఇక ఇంట్లో, మేడమీది పోర్షన్‌లో ఆమె అద్దెకు ఉంటోంది. ఆమెకు తల్లి ఉంది. ఎక్కడో డబ్బున్న వాళ్ళింట్లో ఆయాగా పనిచేస్తోంది. ఎప్పుడో ఒకసారి కూతుర్ని చూడటానికి వచ్చి నాన్‌వెజ్ తిని వెళుతుంది. ఆమె పనిచేసే ఇంట్లో అది దొరకదట. గిరిజకి ఇరవై ఐదేళ్ళ వయస్సున్న తమ్ముడొకడు ఉన్నాడు. ఏదో సినిమా కంపెనీలో పని చేస్తున్నాడు. అతను ఎప్పుడో గానీ రాడు. గిరిజ పదవ తరగతి దాకా చదువుకుంది. పర్మెనెంట్ ఉద్యోగం కాకపోయినా టెంపరరీగానే ఆమె పలురకాలైన ఉద్యోగాలు చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తుంది. నిరంతరం కాని జీవనాధారంలో కూడా ఆమె నిండు మనస్సుతో సంతోషంగా ఉండేది.

నందగోపాల్ పనిచేసే కాస్మెటిక్ కంపెనీ వాళ్ళ ఎగ్జిబిషన్‌లో ఒక స్టాల్ పెట్టారు. అక్కడ ఆమె పని చేస్తున్నప్పుడే పోయిన డిసెంబర్‌లో ఆమెను అతను చూసాడు. మొదటిసారి ఆమెను చూడగానే ఇంతకు ముందే ఎక్కడో చూసినట్లు ఒక భావన. ఆమె ముఖం ముందే పరిచయం ఉన్నట్లుగా అనిపించింది. ఇలాంటి స్టాల్స్‌లో సేల్స్‌గర్ల్‌గా పనిచేసేటప్పుడు తెచ్చి పెట్టుకున్న భావమేమో అని కూడా అనుకున్నాడు. ఆ తర్వాతే తెలిసింది, అతను డిస్పాచ్ క్లర్క్‌గా పనిచేసే ఆ కాస్మెటిక్ కంపెనీలో ప్రతిరోజూ పార్శిల్ పార్శిల్‌గా పంపించబడే పవుడర్ డబ్బాల మీద ఉన్న మోడల్ అమ్మాయి రూపం తనదేనని. రెండు నెలలపాటు సాయంత్రం వేళల్లో మాత్రం పార్ట్ టైంగా అతనుఎగ్జిబిషన్ స్టాల్‌లో పని చేసినప్పుడు ఏర్పడిన నిరంతరమైన ఉద్యోగం కోసం ఆమె ప్రతి ఒక్కరి దగ్గర అభ్యర్థిస్తున్నప్పుడు ఇతనూ ఆమె కోసం జాలి పడ్డాడు. కానీ ఆమెకి సహాయం చేయడం తన శక్తికి మించిన పని అవడం వల్ల ఆమె గురించిన సమస్య నుంచీ కాస్త దూరంగానే ఉన్నాడు.

ఆమె అందరితోనూ కలుపుగోలుగా మాట్లాడేది. నందగోపాల్‌ని ఆమే మొదట టీ త్రాగడానికి పిలిచింది. ముందుగా మాటలు కలిపింది. రాత్రిళ్ళలో పదకొండు గంటల తర్వాత ఇంటికి వెళ్ళే రోజుల్లో సేల్సు మేనేజరు ఆమెను తన కారులో వెళ్ళే దారిలో దింపుతానని చెప్పి ఎక్కించుకుని వెళ్ళేవాడు. ఆయన గురించి ఆఫీసులో అందరూ ఓ మాదిరిగా మాట్లాడుకునేవాళ్ళు. ఆయనతో ఆమె వెళ్ళడం నందగోపాల్‌కి ఏదోలాగా అనిపించేది. ఒక రోజు మేనేజర్ తనతో రమ్మని అన్నప్పుడు ఆమె నందగోపాల్‌ని చూపిస్తూ "మిస్టర్ నందగోపాల్ మా ఇంటికి వెళ్ళే దారిలోనే ఉన్నారు సార్. మేము నడుచుకుంటూ వెళ్ళిపోతాం. అంతే కదూ మిస్టర్?" అని ఇతన్ని చూసి నవ్వినప్పుడు అతనూ ఒప్పుకున్నాడు.

ఆమె భాష ఇతని కొంచెంవింతగా ఉండేది. "ఏమిటండీ.... అవునండీ... సరేనండీ..." అంటూ సాగదీసి మాట్లాడేది. వాళ్ళింట్లో మాట్లాడే భాష తెలుగు అని ఆ తర్వాత తెలిసింది. ఆమె చదివినదంతా తమిళంలోనే. మద్రాసు తమిళంలాగా మద్రాసు తెలుగు.

'ఆమె ఎంత బాగా నవ్వుతూ మాట్లాడుతుంది' అని అనుకుంటూ సైకిల్‌ని వేగంగా తొక్కాడు నందగోపాల్.

ఆమె నిజంగానే సంతోషంగా ఉండే మనిషి అని ఆమెతో పరిచయం అయిన తర్వాత నందగోపాల్‌కి అర్థ అయ్యింది. ఎక్జిబిషన్ స్టాల్‌ల్లో ఉద్యోగ పర్వం ముగిసిన తర్వాత టెలిఫోన్లను శుభ్రపరిచి సెంటువేసే కంపెనీలో చేరింది. ఫోను ఉన్న ఇళ్ళకీ, కంపెనీలకీ వెళ్ళి వచ్చే రోజుల్లో ఒకసారి ఆమెను దారిలో చూసాడు. ఇలా ఏదో ఒక గౌరవమైన పని చేసి ఆమె సంపాదించేది. వయస్సు ముప్పై అవడం మూలాన ఈ మధ్య కాలంలో నమ్మకం వల్లనో లేక అవసరానికో కొంతమంది మగవాళ్ళతో ఆమెకి సంబంధం ఉన్న మాట నిజమే అయినా దానినే జీవనాధారంగా చేసుకునే హీనమైన మనసు ఆమెకి లేదని అతని అర్థమైంది.

ఎప్పుడైనా నందగోపాల్ ఆమెను వెతుక్కుంటూ వెళ్ళేవాడు. ఇద్దరూ మాట్లాడుతూ కూర్చునే వాళ్ళు. కాఫీ మాత్రం కలిపి ఇచ్చేది.

ఆమె సినిమా పత్రికలు ఎక్కువగా కొనేది. చేతిలో డబ్బు ఉన్నప్పుడల్లా సినిమాలకి వెళ్ళేది. సమయం దొరికినప్పుడల్లా సినిమాల గురించి, సినిమా వాళ్ళ గురించి బాగా తెలిసినట్లు మాట్లాడేది. సినిమా కంపెనీలో పనిచేసే ఆమె తమ్ముడు "అక్కా! నువ్వు ఏ పనైనా చెయ్యి కానీ సినిమాలో ఛాన్స్ ఇప్పిస్తానని ఏ వెధవైనా చెపితే దాన్ని నమ్ముకుని వెళ్ళిపోకు. నేను అక్కడ పనిచేస్తున్నాను కాబట్టి నా పరువుని కాపాడడం కోసమైనా నీవు అందులో కాలుపెట్టకు, అని ఎప్పుడో అన్న మాటలకి తాను కట్టుబడి ఉన్నట్లు మాటల మధ్యలో ఓ సారి చెప్పింది.

ఆమెతో అతను రెండు నెలలు గడిపాడు. ఆరోజుల్ని తలుచుకుంటే ఇప్పుడు కూడా మనసుకి హాయిగా అనిపించింది. సంతోషంగా ఉన్న జీవితాన్ని వదిలేసి వేరే దానికి ఆశపడి తప్పుచేసానని, ఆ తప్పుకి తగిన శిక్షే ఇప్పుడూ తాను అనుభవిస్తున్న నరకం అని అనుకుంటూ ముందుకు సాగాడు నందగోపాల్. గిరిజ ఇల్లు ఇంకా ఒక మైలన్నా ఉంటుంది.

ఏ పనీ దొరకకుండా ఉన్న రోజుల్లో ఈసారి నందగోపాల్ పని చేసే కంపెనీకి అతన్ని వెతుక్కుంటూ వచ్చింది గిరిజ. ఆఫీసు ముగిసే సమయం అవడం వల్ల ఆమెను కాస్త ఉండమని, ఆ తర్వాత ఆమెతోనే కలిసి బయటికి వచ్చాడు నందగోపాల్. ఇద్దరూ కలిసి హోటల్‌కి వెళ్ళారు. ఆమె చాలా అలిసిపోయినట్లుగా కనబడింది. అతను కాఫీ కోసం ఆర్డర్ ఇవ్వబోయాడు. ఆ విషయం ముందుగానే ఊహించినట్లు ఆమె అన్నది. "నాకు కాఫీ మాత్రం చాలదు సుమండీ. ఏదైనా తినాలండీ."

స్వచ్ఛమైన ఆమె మనసు అతడిని ఆకట్టుకుంది. ఆమె అడిగినవన్నీ తెప్పించి తినిపించాడు. ప్రొద్దుటినుంచీ ఏమీ తినలేదని ఉద్యోగం లేక చాలా కష్టపడుతున్నదని తెలిసినప్పుడు బాధపడ్డాడు. ఉద్యోగం కోసం ఎక్కడైనా రికమెండ్ చేయమని ఆమె అన్నప్పుడు తనకి నమ్మకం లేకున్నా ఆమెకి మాట ఇచ్చాడు. ఆసాయంత్రం అలాగే ఆమె ఇంటికి వెళ్ళే దారిలో వంటకి కావల్సినవన్నీ కొన్నప్పుడు దానికీ అతనే డబ్బులు ఇచ్చాడు. ఆరోజు రాత్రి అతన్ని తన ఇంట్లోనే భోజనం చేయమని ఆమె అన్నది.

ఆరోజు రాత్రి ఆమె వంట చేస్తూ పనులను చక్కబెట్టే తీరును గమనిస్తూ కూర్చున్నాడు. అక్కడే భోజనం చేశాడు. అతనికి తన తల్లి ఆప్యాయత, ఆమె చేతివంట రుచి జ్ఞాపకానికి వచ్చాయి. తన వంట అతనికి నచ్చిందా అని అడుగుతూ కొసరి కొసరి వడ్డించింది.

ఆ రాత్రి అతను అక్కడే ఉండిపోయాడు. ఆమె తన గురించి, తన తల్లి తమ్ముళ్ళ గురించి మనసు విప్పి అతనితో మాట్లాడింది. అప్పటికప్పుడు తనకు వచ్చిన ఆలోచనను అతనితో చెప్పింది. "మీరు మెస్సుకు ఇచ్చే డబ్బును ఇక్కడ ఇస్తే మీకూ వంట చేసి పెట్టి నేనూ ఒక ముద్ద తింటాను. ఏమండీ! మీకు సౌకర్యంగా ఉంటుందాండీ?"

అతను కాసేపు ఆలోచించి సరేనన్నాడు. ఇంతవరకు వాళ్ళ మధ్య స్నేహంగా మాత్రమే ఉన్న బంధం ఆరోజు క్రొత్త అనుభవానికి దారి తీసింది. జీవితంలోనే అది అతనికి తొలి అనుభవం. అలాగే ఇటువంటి వ్యక్తిని కలవడం ఆమెకీ మొదటిది, క్రొత్తదీ అయిన అనుభవం.

ఎందుకోసమనో తను ద్వేషించి వదులుకున్న దాంపత్య జీవితం అనేది - ఒక స్త్రీతో కలిసి జీవించడం అనేది ఎంత సుఖమైన, ఆనందమయమైన, అర్థపూరితమైన అనుభవం అని తెలుసుకున్న తర్వాత అతను దానికి పూర్తిగా లొంగిపోయాడు.

ఆ ఇల్లు, ఆ జీవితం చాలా నిరాడంబరమైనవి. మేడమీద ఒకే గదిలోనే వంట, పడుకోవడం అంతా. స్నానానికి మాత్రం క్రిందకు రావాలి. గతుకుల నేల మీద చాపమీద పడక. ఆమె తల్లిగానీ, తమ్ముడు గానీ పగటపూటే వచ్చేవాళ్ళు. అప్పుడే తనూ అక్కడికి వచ్చినట్లు వాళ్ళముందు నటించాలి. ఈ వ్యవహారమంతా అతనికీ నచ్చింది.

పెళ్ళి గురించి తను భయపడిన కారణాలను ఆమె దగ్గర చెప్పినప్పుడు ఆమె నవ్వింది. "మీ నాన్నగారు అమ్మని హింసించారని భయపడ్డారా? ఒక అమ్మాయికి ఇలాంటి భయం వస్తే అది న్యాయం. ఒక మగాడు ఎందుకు భయపడాలి? ఆయనలాగా మీరు మీ భార్యని కొట్టకుండా ఉంటే సరిపోతుంది కదా!"

అతను తన పెళ్ళి గురించి, ఊరినుంచీ అమ్మ వ్రాసే ఉత్తరాల గురించి ఆమెతో చెప్పేవాడు. ఇద్దరూ కలిసి బ్రతుకుతున్నప్పుడు

తను ఇంకో స్త్రీని పెళ్ళి చేసుకోవడం గురించి ఆమెతో మాట్లాడటం, దానికి వ్యతిరేకమైన విషయంగా ఇద్దరికీ అనిపించలేదు. ఇద్దరూ విడివిడిగా ఉన్నప్పుడు మనసులో ఎక్కడో ఆ తేడా ఉన్నందువల్లనే వాళ్ళు దానిగురించి చాలా సహజంగానూ, ఎక్కువగానూ మాట్లాడుకున్నారు కాబోలు.

ఆఖర్న ఒక రోజు నందగోపాల్ తన తల్లి సిఫార్సు చేసిన, తనకి దూరపు చుట్టమే అయిన, పదవ తరగతి దాకా చదువుకున్న చాలా గారాబంగా పెంచబడిన, ఇంతకు ముందే ఎప్పుడో ఓసారి చూసినప్పుడు అందగత్తె అని ఒప్పుకోబడిన వత్సలని పెళ్ళిచేసుకోవడానికి సమ్మతం తెలుపుతూ ఉత్తరం వ్రాసి ఆ తర్వాత ఆ విషయాన్ని గిరిజకి చెప్పాడు.

ఆమె మనసులో ఆమెకే తెలియని విధంగా ఒక విధమైన నిరాశ, బాధ ఏర్పడినా మనస్ఫూర్తిగా సంతోషంతో అతనికి అభినందనలను తెలిపింది. "కొత్త పెళ్ళికొడుకు... కొత్త పెళ్ళికొడుకు" అని ఆట పట్టించింది. ఎన్నో బుద్ధిమతులు చెప్పింది. అతనికన్నా అనుభవమూ, నైపుణ్యము ఉన్నందువలన అతనికి ఎన్నో నేర్పించింది. అతనూ ఆమెకి కృతజ్ఞతలను తెల్పుకున్నాడు. స్త్రీ అంటేనే భయపడి, ద్వేషించిన తనని పెళ్ళికి, దాంపత్యజీవితానికి తయారు చేసిన ఘనత ఆమెదేనని అతను నమ్మడంతోనే కాకుండా ఆ ముక్క ఆమెతోనే అనేవాడు. అలాంటి సమయంలో ఆమె ఏ భావం వ్యక్తపరచకుండా లోలోపలే నవ్వుకునేది.

అతనితో ఉన్న ఆ రెండు నెలల్లో ఆమె ప్రక్కనే ఉన్న నర్సరీ స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం సంపాదించుకుంది. సాయంత్రాలలో కుట్టు క్లాసుకి వెళ్ళింది. ముందే ఆమెకి టైలరింగ్ కాస్త తెలుసునట.

పెళ్ళి తేదీ నిశ్చయమయ్యేవరకు అతను ఆమెతోనే ఉన్నాడు. ఆ తర్వాత ఆమే అంది. "నేను ఇలా అంటున్నానని తప్పుగా అనుకోకండి. ఇంకా ఒక నెల మాత్రమే ఉంది పెళ్ళికి. మీరు మీ మెస్సుకే వెళ్ళిపొండి. ఆరోగ్యం జాగ్రత్త. వేళపట్టున భోజనం చేయండి. పెళ్ళి అయిన తర్వాత ఒక స్నేహితుడిగా వచ్చి వెళ్ళండి నాకూ సంతోషంగా ఉంటుంది."

అప్పుడు ఆమె కళ్ళలో తిరిగిన నీరు గుర్తుకు వచ్చినప్పుడు నందగోపాల్‌కి ఉద్వేగం పెల్లుబికింది. వాకిట్లో సైకిల్‌కి తాళం వేస్తూ మేడ వైపు చూసాడు. మేడమీద తాటాకుల షెడ్‌లో చిన్న చిన్న సందుల ద్వారా లోపల లైటు వెలుగుతున్నట్లు తెలిసింది. అగ్గిపుల్ల వెలిగించి గడియారంలో టైం చూసాడు. పన్నెండయ్యింది.

ఎదురు చూడని విధంగా తనను చూడగానే ఆమె పడే ఆశ్చర్యాన్ని తలుచుకుంటూ, ఆమెను చూడబోయే ఉద్వేగంలో గుండెలు వేగంగా కొట్టుకుంటుండగా అతను మేడమెట్లు ఎక్కాడు.

ఆఖరి మెట్టు ఎక్కుతున్నప్పుడు అతనికి తలమాత్రమే కనబడుతూ, కాలి అడుగుల శబ్దం వినబడగానే కుట్టుమిషన్ దగ్గర స్టూల్ మీద కూర్చుని సూదితో కుట్లు విప్పుతున్న గిరిజ గద్దిస్తున్నట్లుగా "ఎవరదీ?" అంటూ లేచింది.

"నేనే!" అతను పేరు చెప్పడానికి ముందే సంతోషం తట్టుకోలేనట్లు "మీరా! రండి... రండి" అంటూ స్వాగతం పలికింది. అతన్ని కౌగిట్లో బంధించాలని ఉవ్విళ్ళూరుతున్న చేతుల్ని బలవంతంగా మెటికలు విరుస్తూ "ఏమిటీ ఈ వేళప్పుడు దర్శనం? కూర్చోండి... భోజనం అయ్యిందా?"కుశల ప్రశ్నలు వేస్తూ చాప తీసి నేలమీద పరచింది.

"ఎందుకో నిన్ను చూడాలనిపించింది. వచ్చేసాను" అన్నాడు. ఆమె కంగారు పడింది. కానీ ఆ విషయం అతనికి తెలియనీయకుండా సంబాళించుకుంటూ నవ్వింది. "మంచినీళ్ళు త్రాగుతారా" అంటూ నీళ్ళు తెచ్చి ఇచ్చింది.

ఇద్దరికీ ఉద్వేగం, గుండెలు అదరడం తగ్గటానికి కాస్త వ్యవధి పట్టింది. కొత్తగా ఉన్న కుట్టుమిషన్ చూసి అతను అడిగాడు. తను టైలరింగ్ పరీక్ష పాస్ అయినట్లు, వాయిదాల పద్ధతిలో కుట్టుమిషన్‌ని కొన్నట్లు, ఇందులో బాగా సంపాదిస్తున్నట్లు చెప్పింది. క్రొత్తగా చేయించుకున్న బంగారు గొలుసు చూపిస్తూ మంచి స్థితిలో ఉన్నట్లుతెలియజేసి అతన్ని సంతోష పెట్టింది. అతని మనసుకి ఆమె చెప్పింది చాలా హాయిగా అనిపించింది. అతనికి నిజంగానే సంతోషం కలిగింది.

"మీరు ఎలా ఉన్నారు? మీ వైఫ్ బాగానే ఉన్నారుకదా?" అంటూ కుతూహలంగా ఆమె అడిగినప్పుడు అతను నిట్టూరుస్తూ ఆమెని చూసి పేలవంగా నవ్వాడు.

ఆమె కుట్టుమిషన్ మీద కుప్పలుగా వేసి ఉన్న కుట్టిన, కుట్టవలసిన, కత్తిరించాల్సిన కొత్త బట్టలను తీసి వేరు చేస్తూ, పెట్టెలో మడత పెడుతూ ఇతనితో మాట్లాడటం కోసం తన పనిని మూట కట్టసాగింది. అతను ఏదో బాధలో ఉన్నాడని ఆమె గ్రహించింది. అందుకే అతన్ని సంతోష పెట్టే విషయాలన్నీ తానే ముందుగా చెప్పింది. ఇది ఆమె తెలివితో చేసిన పనికాదు. అతనిపట్ల ఆమెకు ఉన్న అభిమానం కొద్దీ చేసింది. అతను బాధపడుతున్నాడని తెలిసినపుడు ఆమెకీ కష్టంగా అనిపించింది.

అతను సిగరెట్టుని వెలిగించి గుండెల నిండా పొగను పీల్చి ఇంటి కప్పుకేసి చూస్తూ గాఢంగా పొగను వదిలాడు. సిగరెట్ యొక్క బూడిదను వేళ్ళ మధ్య క్రిందకి రాలుస్తూ ఆమె ముఖం వైపు చూడకుండా బాధతో నిండిన గొంతుతో "నేను నీకు చేసిన అన్యాయానికి ఇప్పుడు అనుభవిస్తున్నాను. నిన్నే పెళ్ళిచేసుకుని ఉండాల్సింది. ఇప్పుడు అనుకుని ఏం లాభం?" అని అన్నాడు.

అతనికి ప్రక్కనే వచ్చి కూర్చుంది గిరిజ.

పెళ్ళై తనతో బయలుదేరినప్పుడు ప్రారంభించిన ఏడుపుని ఇంకా ఆపలేదని, ఆమెకు తనతో కలిసి జీవించడం ఇష్టం లేదని, ఈ రోజు కూడా నెత్తి, నోరు బాదుకుంటూ ఏడ్చిందని వరుసగా వత్సల గురించి పుకార్లు చెపుతూ తన బాధను ఇంకా ఎక్కువ చేసుకున్నాడు.

కుట్టు మిషనుకు ప్రక్కనే ఉన్న ఆయిల్ కేన్‌ను తీసుకుని కాలి బొటన వేలికి రెండో వేలుకి మధ్యలో ఉన్న పుండుకు నూనెను చుక్కలుగా వేస్తూ అతను చెప్పేదంతా మౌనంగా వింటూ కూర్చుంది గిరిజ. "పాపమండీ ఆ అమ్మాయి. వివరం తెలియని పిల్ల కదండీ మరీ."

ఆమె అలా అనగానే అతను అర్థంకానట్లు తలెత్తి ఆమె వైపు చూసాడు.

"మిమ్మల్ని పెళ్ళి చేసుకున్నంత మాత్రాన మీకు సరిసమంగా అయిపోతుందాండీ ఆమె? అమ్మా నాన్నల దగ్గర చాలా గారాబంగా పెరిగిన పిల్ల అని మీరే కదా చెప్పారు. అందర్నీ వదిలేసి ఊరుకాని ఊరులో మీతో వచ్చి ఉండాలంటే ఆ చిన్నపిల్ల మనసు ఎంత బెదిరిపోయి ఉంటుంది? ఒక మగాడితో సహచర్యం ఆమెకి చాలా కొత్తకదా. భయంగా ఉంటుంది. అసహ్యంగా కూడా అనిపించి ఉంటుంది. నేను మీతో చనువుగా మసిలాను అంటే దానికి కారణం ఏమిటి? నేను 'ఎక్స్‌పీరియన్స్' ఉన్నదాన్ని కదా? భార్యగా ఉండటానికి ముందుగానే ట్రైనింగ్ ఉండాలని అనేవాళ్ళు ఎవరండీ? ఇప్పుడు అన్నారు కదా నన్నే పెళ్ళిచేసుకుని ఉండాల్సిందని. అప్పుడు ఎందుకు అనిపించలేదు? ముందుగానే అనుభవం ఉండటం నా యొక్క డిస్క్వాలిఫికేషన్. అదే దానికి కారణం. మీ భార్యకన్నా మీకు ఈ విషయంలో అనుభవం ఎక్కువ అన్నది మీరు గుర్తుంచుకోవాలి. ఆమెను ఒక చంటిపాపలాగా అర్థం చేసుకోవాలి. తొలి రోజుల్లో నేను మీతో ఉన్నట్లు మీరు ఆమెతో ప్రవర్తించాలి. అప్పుడే రోజులు గడిచే కొద్దీ అంతా సవ్యంగా సర్దుకుంటుంది." అనునయిస్తున్నట్లుగా అన్నది గిరిజ.

మాటలతోనే ఆమె సమస్యను ఇంత తేలికగా మార్చేసిన వైనాన్ని తలచుకుని అతను ఆశ్చర్యపడ్డాడు. ఈమె దగ్గరకి రావాలని తాను అనుకున్నది ఎంత సరియైన విషయం అని అనుకున్నాడు.

అతనితో మాట్లాడుతుండటం వల్ల ఇంతసేపూ నిలిపి ఉంచిన, కాలి వేళ్ళ మధ్య నూనె వేసే పనిని మళ్ళీ కొనసాగించింది.

"ఏమైంది కాలికి? "అంటూ దగ్గరకి వంగి చూసాడు.

"పోయినవారం కొత్త చెప్పులు కొన్నాను. కరిచేసింది మిషన్ కుట్టడం వల్ల, కాలివేళ్ళు కదులుతూ ఉండటం వల్ల త్వరగా పుండు మానడం లేదు" అని చెపుతూ ఉన్నదల్లా తలెత్తి అతని వైపు చూస్తూ నవ్వింది. "చూసారా... చెప్పులు కూడా కొత్తగా ఉన్నప్పుడు

కరుస్తాయి. అందుకోసమని ఎవరైనా పాత చెప్పుల్ని కొంటారా?

ఆమె నవ్వుతూనే అన్నది. అతను ఆమె చేతులను పట్టుకుని ఏడ్చేశాడు.

## మారిన విలువలు

తమిళ మూలం: దేవీబాల

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్



దేవీబాల

"జానకీ! నేను రేపు రిటయిర్ అవుతున్నాను." రాఘవన్ అన్నాడు.

జానకి కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవి అయ్యాయి. "అంతలో యాభై ఎనిమిదేళ్ళు గడిచిపోయాయా? ఆశ్చర్యంగా లేదూ."

"నన్ను చూస్తే యాభైఎనిదేళ్ళు నిండినవాడిలా కనబడటంలేదు కదూ.

"చాల్లే ఊరుకోండి. ఆవంక పెట్టుకుని దగ్గరికి రాకండి. ఇంకోనెల రోజుల్లో మన కొడుక్కి పెళ్ళి మర్చిపోకండి."

"జానకీ! నువ్వు వాలంటరీ రిటైరుమెంట్ తీసేసుకో."

"ఎందుకు?"

"నీవు లేకుంటే నాకు చాలా బోర్ కొడుతుంది."

"ఆ బోర్‌ని మీరు తిప్పికొడుదురుగాని. నాకు ఇంకా ఏడేళ్ళ సర్వీస్ ఉంది. నెల తిరిగితే పదిహేనువేలు చేతికి వస్తున్నప్పుడు ఎందుకు వాలంటరీ రిటైర్‌మెంట్? ఇంట్లో కూర్చుని నేను చేసేదేముంది?"

"ఎంతైనా మన అరుణ్ బుద్ధిశాలి."

"కాదని ఎవరన్నారు? నేను పదినెలలు మోసి కన్నబిడ్డకదా మరి."

"నేను చెప్పేది విను జానకీ. ఉద్యోగానికి వెళ్ళే అమ్మాయి వద్దని పట్టుదలతో నిలబడ్డాడు. అనుకున్నది సాధించాడు. కోడలు పిల్ల ఇంట్లోనే ఉంటుంది. "

"అందులో మీకేమిటి సంతోషం?"

"ఖచ్చితంగా సంతోషమేనమ్మా "అంటూ లోపలికి వచ్చాడు అరుణ్.

"నీ ఉద్దేశ్యంతో నేను ఏకీభవించలేను అరుణ్."

"అమ్మా! ఆడది ఇంట్లో ఉంటే ఆ ఇంటికే ఒక కళ."

"ఇప్పుడేమైంది? మన ఇల్లు కళకళలాడటంలేదా? నేనూ ముగ్గురిని కన్నాను. నీ చెల్లెళ్ళు ఇద్దరికీ మంచి సంబంధాలు చూసి పెళ్ళి జరిపించాము. నువ్వూ పెద్ద చదువులు చదివి మంచి ఉద్యోగంతో ఉన్నావు. ఈ కుటుంబానికేం తక్కువ?"

"పైపైన చూస్తే ఏ తక్కువా లేదు. కాని మేం చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు ఎంతకోల్పోయామో నీకు తెలీదమ్మా. "

"అరుణ్!"

"చేతినిండా సంపాదిస్తున్నప్పుడు మొగుడు, పిల్లలు కూడా లక్ష్యం ఉండదు. డబ్బురుచి మరిగిన ఆడాళ్ళకి ఊరికే ఉండమంటే ఉండలేరు. ఉద్యోగానికే వెళ్ళలేదనుకో. సమస్యే ఉండదు కదా?"

"రుచి మరగడం అంటూ కొత్తగా చెప్పకు అరుణ్. మీ నాన్నగారి ఒక్క సంపాదన మాత్రమే ఉంటే ఇన్ని వసతులతో మన ఇల్లు ఉండేది కాదు. సొంత ఇల్లు నీ చెల్లెళ్ళకి మంచి సంబంధాలు చూసి గొప్పగా పెళ్ళి జరిపించాం. ఇంట్లో ఏ సౌకర్యాలకీ కొరతలేదు. నేను గడపదాటి వెళ్ళి ఉద్యోగం చేయడం వల్లనే ఇది సాధ్యమయింది."

ఒక నెల గడిచిపోయింది.

అరుణ్ పెళ్ళి జరిగింది. వనిత ఇంట్లో అడుగుపెట్టింది.

వనిత చదువుకున్న అమ్మాయి. కాస్తోకూస్తో ఉన్న కుటుంబం. ఒక్కగానొక్క కూతురు. ఉద్యోగానికి వెళ్ళాలనే అభిలాషలేని మనిషి.

పెళ్ళైన తర్వాత హనీమూన్ అదీ ఇదీ అని ఒక నెల గిర్రున తిరిగింది.

అరుణ్ డ్యూటీలో జాయిన్ అయ్యేరోజు జానకి అలవాటు ప్రకారం ప్రొద్దున్నే నాలుగ్గంటలకే లేచి ఇంటి పనులు చేసుకోసాగింది.

బాత్‌రూంకి వెళ్ళడానికి లేచి వచ్చాడు రాఘవన్.

"జానకీ!"

"ఏమిటండీ?"

"కోడలు పిల్ల వచ్చేసిందిగా. తనూ లేచి కాస్త ఇంటిపనులు చేయనీ. నువ్వు ఒక్కర్తీ ఇంటిపనులను చూసుకుంటూ, ఆఫీసుకి వెళ్ళాలంటే ఈ వయస్సులో కష్టం కదా."

జానకి నవ్వింది. "పాపం చిన్నవాళ్ళే కదా. పైగా పెళ్ళైన కొత్త. త్వరగా లేచి రావాలంటే మనసు రాదు. నిద్రపోనీయండి. నాకు అలవాటైన పనులేగా. మీరు పోయి పడుకోండి."

రాఘవన్ వెళ్ళిపడుకున్నాడు.

జానకి బయలుదేరే సమయం వనిత బెడ్‌రూం నుంచీ లేచి వచ్చింది.

"వనితా! నేను వెళ్ళొస్తానమ్మా! వంట టిఫిన్ అన్నీ తయారుచేసి హాట్‌ప్యాక్‌లో పెట్టాను. కాఫీ మాత్రం కలుపుకోవాలి."

జానకి వెళ్ళిపోయింది. అరుణ్ స్నానం అదీ ముగించుకుని డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు.

"ఏమండీ!" గోముగా అంది వనిత.

"చెప్పు వనీ."

"మీరు ఆఫీసుకి వెళ్ళిపోతే నాకు ఇంట్లో చాలా బోర్‌గా ఉంటుంది."

"అయితే?"

"మా అమ్మగారింట్లో నన్ను దింపేసి వెళ్ళండి. మళ్ళీ సాయంత్రం వచ్చేటప్పుడు పికప్ చేసుకుందురుగానీ."

"నాన్నగారు ఇంట్లో ఒంటరిగా ఉంటారు వనీ."

"మీ నాన్నగారికి నేను తోడుగా ఉండగలనా చెప్పండి"

"సరే. అలాగే కానీ."

ఇద్దరు పదినిముషాల్లో తయారయ్యి బైకులో వెళ్ళిపొయ్యారు. రాఘవన్ అలాగే చూస్తూ కూర్చుండిపోయాడు.

పెళ్ళై రెండు నెలలు గడిచిపోయాయి. వనిత ఇంట్లో ఒక్క పూచిక పుల్లకూడా తీసి పెట్టలేదు. ఎప్పుడూ పుట్టింట్లోనే. ఇక్కడ అన్నీ జానకే చూసుకుంది.

ఒకరోజు వనితకి వాంతులయ్యాయి. అరుణ్ కంగారుపడి డాక్టరు దగ్గరకి తీసుకువెళ్ళాడు.

వనిత గర్భవతి అని డాక్టరు కన్ఫర్మ్ చేయగానే కబురు పుట్టింటికి చేరింది.

ఆ రోజు ఆదివారం. ఆమె తల్లితండ్రులు ఇంటికి వచ్చారు.

"అమ్మాయిని తీసుకుని వెళతాం."

"మూడోనెల వచ్చాకే కదా తీసుకెళ్ళడం సంప్రదాయం?"

"మేము ఇప్పుడే తీసుకెళ్ళాలనుకుంటున్నాము. మా అమ్మాయికి మీ ఇంట్లో రెస్ట్ దొరకదు. మీరూ ఉద్యోగానికి వెళ్ళిపోతారాయె. కాఫీ కలిపి ఇవ్వాలన్నా ఇంట్లో ఆడదిక్కులేదు. కావాలంటే అల్లుడు మా ఇంటికే వచ్చి ఉండవచ్చు."

అరుణ్ జవాబు చెప్పలేదు.

వనితకి ప్రసవ సమయం దగ్గర పడింది

ఆ రోజు సాయంత్రం....

అరుణ్ ఇంట్లోనే ఉన్నాడు.

"అమ్మా!"

"చెప్పు అరుణ్."

"నువ్వు ఉద్యోగానికి రాజీనామా ఇచ్చేయమ్మా.!"

"ఎందుకు బాబూ?"

"పాపో బాబో పుట్టిన తర్వాత వనిత ఇక్కడికొస్తే ఎవరు చూస్తారు?"

"ఏం? వనిత ఇంట్లోనే ఉంటుంది కదా!."

"చంటి పిల్లని చూసుకోవడం ఆమెకి ఎలా చేతనవుతుంది? స్నానం చేయించాలి. సాంబ్రాణి వేయాలి. పాలు పట్టించాలి. ఇవన్నీ చూసుకోవడానికి ఇంట్లో వయస్సులో పెద్దవాళ్ళు ఉండాలికదా?"

రాఘవన్ దగ్గరకి వచ్చాడు.

"అరుణ్! మీ అమ్మ తన బాధ్యతలను ఏ రోజూ విస్మరించలేదు. మీ నాయనమ్మ ఒక్క పనీ చేయకుండా ఉన్నరోజుల్లో కూడా ఇంటి పనులన్నీ మీ అమ్మే చేసుకునేది. ఒక్కరోజు కూడా విసుక్కోలేదు. నీ భార్య ఇంట్లో అడుగుపెట్టిన రోజు నుంచీ ఈ క్షణం దాకా ఇటు పుల్ల తీసి అటు పెట్టింది లేదు.

"నాన్నా!"

"ఒరేయ్! మీ అమ్మ పడుతున్న పాట్లను నువ్వుకూడా అర్థం చేసుకోలేదంటే కొత్తగా వచ్చిన పిల్లకి ఏం తెలుస్తుంది? ప్రతిదానికి పుట్టింటికి వెళుతోందిగా. మీ పిల్లని కూడా అక్కడే పెరగనీ. ఉద్యోగానికి వెళ్ళి, ఒంటరిగా ఇంటి పనులను చూసుకున్న మీ అమ్మ పెంపకంలో మీరెవరూ చెడిపోలేదు. అప్పుడు మా అమ్మ పెత్తనం. ఇప్పుడు నీ భార్య సోమరితనం. మధ్యలో నలిగిపోయింది ఈ

అమాయక ప్రాణి మాత్రమే. ఇన్ని సంవత్సరాలుగా ఎన్నోసార్లు మీ అమ్మతో ఉద్యోగాన్ని వదిలెయమని చెపుతూ వచ్చాను. దానికోసం గొడవపడ్డాను కూడా. కాని ఇప్పుడు చెపుతున్నాను. జానకీ! నువ్వు ఉద్యోగాన్ని వదలకు. "

జానకి సంభ్రమంగా భర్తకేసి చూసింది.

## ధర్మోపదేశం

తమిళ మూలం: అనురాధా రమణన్

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్




"తాళి కట్టిన భర్తే అయినా అలవాటు లేకపోతే పరాయి మనిషే కదా."

ధర్మసంవర్ధిని వంటింట్లో చారుకి పోపుపెడుతూ హాల్లో సోఫాలో కూర్చుని పెద్దగా నవ్వుతున్న మనిషిని ఒకసారి చూసింది.

ఎన్ని సంవత్సరాలు గడిచిపోయాయి?

హరిహరన్, హాల్లో కూర్చున్న పెద్దమనిషి, అప్పుడు యవ్వనంలో ఉన్నాడు.

పసుపు పచ్చని మేనిఛాయ, మంచి ఒడ్డూ పొడువు. చక్కగా దువ్విన క్రాపు, గ్రీకు వీరుడులాంటి ముక్కు, తెలివితేటల్ని ప్రతిఫలించే కళ్ళు...

ఇప్పుడు శరీరపు ఛాయ ఇంకో పిసరు ఎక్కింది. కానీ అడ్డంగా పెరిగిన ఒళ్ళు ఆ ఎత్తును దిగమింగేసింది. తల మాత్రం క్రిందటి సంవత్సరం కుంభకోణంలో కొన్న ఇత్తడి చెంబు ఆకారంతో, మాట్లాడుతున్నప్పుడల్లా మెడక్రింద గంగడోలులాగా ముడతలు పడ్డ చర్మం అటూ ఇటూ కదులుతూ విచిత్రంగా అన్పించింది. కళ్ళు చింతాకుల్లా చిన్నగా, కళ్ళక్రింద ఎర్రగా ఉబ్బిన సంచిలాగా.....

ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలంటే ఈ మనిషిని బజార్లో ఎక్కడైనా చూడమంటూ జరిగితే ధర్మసంవర్ధిని గుర్తుపట్టలేకపోయేది.

పెళ్ళి జరిగినప్పుడు చూసిన ముఖమే ధర్మసంవర్ధినికి జ్ఞాపకంలేదు. ఆ ముఖాన్ని అప్పట్లో నాలుగైదుసార్లు చూసిందేమో, అంతే.

సరిగ్గా ఒక్క నెల... ముప్ఫైరోజులు... అందులోనే తిరుపతి, స్వామిమలై దర్శనాలు, సుమంగళి ప్రార్థన, పెదనాన్నగారింట్లో విందుభోజనం, చిన్నత్తగారింట్లో కాఫీ టిఫిన్లు.

పాతికేళ్ళ ముందు పెళ్ళైన కొత్త దంపతులకు అంత స్వతంత్ర్యం ఉండేది కాదు. ఇంటినిండాజనం. పెళ్ళికి వచ్చిన చుట్టాలు.

అది చాలదన్నట్లు హరిహరన్ అక్కగారి పిల్లలు "మామయ్యా... మామయ్యా" అంటూ ఒక్క క్షణం కూడా వదలకుండా హరిహరన్‌ని అంటిపెట్టుకుని ఉండేవాళ్ళు. ముసలి అత్తగారు, చిత్త స్వాధీనంలేని మనిషి, ఎప్పుడోగాని వంటిమీద తెలివి ఉండదు. అధవా ఉన్నప్పుడు కూడా సొంత కొడుకు కళ్ళల్లోకి గుచ్చి గుచ్చి చూస్తూ "మీరు ఎప్పుడు వచ్చారండీ?" అని అడిగేది. లేకపోతే "ఇప్పుడైనా నన్ను వెతుక్కుంటూ రావాలనిపించిందా?" అని శోకాలు పెట్టేది.

"నువ్వేం భయపడకు. హరి చంటిపిల్లాడిగా ఉన్నప్పుడే మా నాన్నగారు ఒక నాట్యగత్తెను ఉంపుడుగత్తెగా ఉంచుకుని ఆఖరుదాకా అలాగే ఉండి చనిపోయారు. అమ్మకి ఎప్పుడు అదే ధ్యాస."

హరిహరన్ అక్కయ్య ధర్మసంవర్ధినితో చెప్పింది ఒకసారి.

" హరి అమెరికాలోనే ఉంటున్నాడు. ఎప్పుడో రెండు సంవత్సరాలకి ఒకసారి వస్తాడు. పాపం మా అక్కయ్య! అతని మీదే ప్రాణాల్ని పెట్టుకుంది. ఏదో ఈసారి కొడుకుని పసుపు బట్టల్లో - పెళ్ళిపీటల మీద చూసే భాగ్యం దొరికింది. మళ్ళీ ఎప్పుడు వస్తాడో ఏమో. అంత వరకు ముసలిప్రాణం బ్రతికి ఉంటుందో లేదో. పాపం, వాళ్ళని మాట్లాడుకొని,నువ్వు నీ భర్తతో మాట్లాడడానికి ఇంకా ఎంతోకాలం ముందుంది. ఇప్పుడు పోయి పడుకో."

ఇది చిన్నత్తగారి ఉపదేశం.

ధర్మ సంవర్ధిని భర్తతో చనువుగా ఇంకా మాట్లాడనేలేదు. సగం సిగ్గు... సగం భయం. అన్నిటికన్నా మించి దిగ్భ్రమ.

ఇన్నిటికీ మధ్య సదా కడుపున పడ్డది ఎప్పుడూ?

అది ఆమెకే ఆశ్చర్యం కల్గించిన విషయాలల్లో ఒకటి. హరిహరన్ అమెరికా ప్రయాణం కోసం పెట్టె బేడా అన్నీ సర్ది ఉంచి మర్నాడు ప్రొద్దున్న విమానాశ్రయానికి బయలుదేరడానికి అలారం పెట్టుకుని పడుకున్నాడే........

అప్పుడే ఆ సంఘటన జరిగి ఉంటుంది. ఎంత మధురమౌన రాత్రి అది! ఎంత ప్రేమ పూరితమైన మాటలతో ధర్మని ముంచెత్తారు. అతడు!

"ధర్మా! ఏడుస్తున్నావా? పిచ్చిదానా. ఎందుకీ ఏడుపు? ఇంకో ఆరునెలలు. నువ్వు చక్కగా అక్కడికి వచ్చేయొచ్చు. ఆ తర్వాత పుట్టిన దేశాన్నీ, ఊరిని చూడాలంటే మూడు సంవత్సరాలకి ఒకసారి మాత్రమే."

"ఇలా ఉన్నఫళంగా నిన్ను వదిలేసి వెళ్ళడం నాకు మాత్రం కష్టంగా లేదనుకుంటున్నావా? ఆడదానివి కాబట్టి ఏడ్చి నీ దుఃఖాన్ని కరిగించుకుంటున్నావు. నేను మగాడ్ని. ఏడిస్తే అందరూ నన్ను వెక్కిరించరూ."

ధర్మసంవర్ధిని దీర్ఘంగా నిట్టూర్చింది. "నాన్నగారు ఇన్సులిన్ వేసుకున్న తర్వాత చాలాసేపు ఆకలితో ఉండలేరు. ఒక్కదానికే వడ్డించడం కష్టంగా అనిపిస్తే విజీని తోడుకి పిల్చుకో."

గబగబా చెప్పేసి పట్టుపంచె పరపరమంటుండగా అదే వేగంతో తిరిగి వెళ్ళిపోయాడు.

విజి సదా భార్య. పెళ్ళై రెండు నెలలు అవుతోంది.

ఈ పెళ్ళని వంక పెట్టుకుని హరిహరన్ పాతికేళ్ళ తర్వాత అమెరికానుంచి వచ్చి దిగాడు.

'నాన్నగారు, ఇన్సులిన్ వేసుకున్న తర్వాత చాలాసేపు ఆకలితో ఉండలేరు.'

ఏదో ఎప్పుడూ నాన్నతోనే ఉంటున్నట్లు అంటున్నాడే సదా. రెండు సంవత్సరాల ముందు కూడా అమ్మ చేతి చద్దన్నం తిని బస్సుకు చిల్లర అడిగి తీసుకుని కాలేజీకి పరిగెట్టిన వాడే కదా.

పుట్టినప్పటినుంచి ఇరవై మూడేళ్ళదాకా చూసి ఎరగని తండ్రి అతనికి ఇప్పుడు చాలా కావాల్సిన మనిషి అయిపోయాడు.

ఇన్నేళ్ళుగా కొడుకుని భుజాల మీద, గుండెల్లోనూ ఎత్తుకుని, అతని కోసం ఉపవాసాలు చేసి నోములు నోచిన తల్లి ఈరోజు పరాయి మనిషి అయిపోయింది.

"అమ్మా! ఏడవకమ్మా. నేను పెద్దవాడినైన తర్వాత నీకు చీరలు, నగలు అన్నీ కొనిపెడతాను. ఇప్పుడు ఒక్కముద్దు పెట్టనా."

ముద్దు ముద్దు మాటలతో చిన్నపిల్లాడు సదా అన్నప్పుడు ఆమె కళ్ళు మాత్రమా వర్షించాయి? అతనికి పాలిచ్చిన గుండెలు కూడా పగిలేటట్లు ఏడవలేదూ.

"స్కూల్లో పిల్లలందరూ మీ నాన్నగారు ఎక్కడ? అని హేళన చేస్తున్నారమ్మా. నాన్నగారు అమెరికాలో ఉన్నారని చెపితే 'మరి నువ్వు ఇక్కడ స్ట్రాప్ తెగిన ప్లాస్టిక్ చెప్పులు వేసుకుని మధ్యాహ్నం భోజనానికి క్యూలో నిలబడ్డావెందుకు?" అని అడుగుతున్నారమ్మా."

పదేళ్ళ పిల్లవాడు గుక్క తిప్పుకోకుండా ఏడ్చినప్పుడు దగ్గరకి తీసుకుని, అతనికి సమాధానం చెప్పడానికి మాటలు దొరక్క పిచ్చి పట్టిన దానిలా అలాగే కూర్చుండిపోయింది.

"అమ్మా! ఎవరు ఏం చెప్పినా సరే. ఆ పెద్ద మనిషి మాత్రం తిరిగి వస్తే నువ్వు ఇంట్లోకి రానీయకు. అలా మాత్రం జరిగితే నేను ఇక్కడ ఉండను. ఇప్పుడే చెపుతున్నాను. ఇంకెందుకు ఈయన సహాయం? నేను ఎమ్మెస్సి ముగించబోతున్నాను. పి.హెచ్.డి చేయడానికి స్కాలర్‌షిప్ కూడా దొరుకుతుంది. నేను అమెరికాకు వెళ్ళి స్కాలర్ షిప్‌కూడా తెచ్చుకుంటాను. నేను ఉన్నానమ్మా నీకు. నీకు నేనున్నాను."

కొండంత ఎత్తుకు ఎదిగిన కొడుకును చూసి పరవశించిపోయి తాను పడ్డ కష్టాలన్నీ తీరిపోయినట్లుగా నమ్మకంతో ధర్మసంవర్ధిని తలెత్తి తన చుట్టూ చూసినప్పుడు...........

ఇల్లూ వాకిలీ మాత్రమే పాతబడలేదు. ఆమె కూడా తలనెరిసి, నడుము వంగిపోయి, మూసి ఉంచిన పూదండలాగా వాడిపోయి...

"ఈ సంక్రాంతికి నీకు నలభై అయిదు నిండుతాయి."

ధర్మసంవర్ధిని తల్లి పంచాంగాన్ని తిరగేస్తూ వేళ్ళు మడిచి ప్రభవ, విభవ అని మనసులోనే లెక్కవేసుకుంటూ చెప్పింది.

ధర్మసంవర్ధినికి ఆశ్చర్యంగా అనిపించింది. ఇరవై అయిదేళ్ళగా ఒంటరి ఆడదానిగా నిలబడి ఏటికి ఎదురీది ఇన్నిటినీ సమాళించుకుని వచ్చానా!

పాతికేళ్ళు గడిచిపోయాయి. ఇంకా ఆయన వస్తారని నమ్మకం ఏమిటి? ఉన్నారో లేక....

ఛీ...ఛీ.... ఎక్కడ ఉన్నా దీర్ఘాయుస్సుతో ఉండాలి. ఇప్పుడు తిరిగివచ్చినా నా దగ్గర ఇప్పుడేముంది?

ధర్మసంవర్ధిని అద్దంలో ముఖం చూసుకోవడం మర్చిపోయి ఎన్నో ఏళ్ళు అయిపోయాయి.

ఛామన చాయే అయినా నిగనిగలాడే చెంపలు, ఇంద్రధనుస్సులాగా తీర్చిదిద్దిన కనుబొమలు, విశాలమైన కళ్ళు, ఎప్పుడూ నవ్వుతూ ఉండే పెదవులు.

అన్నీ ఎప్పుడో కాలగర్భంలో కలిసిపోయాయి. వట్టిపోయిన గుండెలు, పగుళ్ళు బారిన పాదాలు. శూన్యం నిండిన ఆమె జీవితానికి చరిత్ర చిహ్నాలుగా....

ఇప్పుడేమయ్యింది? ఇదిగో అమెరికాకి వెళ్ళి చదువు ముగించుకుని సదా ఇండియాకి రాబోతున్నాడు. రెండు నెలలు సెలవులట. మళ్ళీ వెళ్ళేటప్పుడు తల్లిని కూడా తీసుకెళ్తానని చెప్పాడు. త్వరలోనే అతనికి పెళ్ళిచేసి కోడలితో సహా అమెరికానో ఆఫ్రికానో ఏదో ఒకటి, బాబు తీసుకెళ్ళేచోటకి తనుకూడా వెళ్ళిపోతుంది. ఆ తర్వాత తనకేం కావాలి? ఆడించడానికి మనవడో మనవరాలో, వేళకి ఒక ముద్ద ఉంటేచాలు.

ధర్మసంవర్ధిని ఆలోచనలు ఇలా సాగుతుండగానే సదా ఆర్భాటంగా సొంత గడ్డమీద కాలుపెట్టాడు.

అతడు వచ్చాడో లేదో ఆ రోజుదాకా ఉన్నావా చచ్చావా అని అడగని వాళ్ళుకూడా తమ కూతుళ్ళ జాతకాలతో సహా దాడి చేయటం మొదలుపెట్టారు..

"అమ్మా! మరీ వెతికి వెతికి చూడకు. ఏదో పది ఉండాల్సిన చోట ఐదుఉన్నా చాలు. ఉద్యోగం చేసే అమ్మాయి వద్దు. డిగ్రీ చదువు ఉంటే చాలు. మరీ పెద్దింటి సంబంధం చూస్తే రేపు మనం చెప్పిన మాట వినదు."

విజయ ఆ ఇంటికోడలుగా సదా వచ్చిన పదిహేనో రోజే తీర్మానించబడింది. మరో పదిహేనురోజుల్లో ముహూర్తం కుదిరింది.

"ధర్మ కొడుకు విదేశాల్నించి వచ్చి పెళ్ళిచేసుకుంటున్నాడు. ఆమెకి మాత్రం ఎవరున్నారు? మనమే కదా. మనం కూడా వెళ్ళకపోతే ఎలా? ".

ఇలా చెప్పుకుంటూ పెళ్ళికి ఓ వారానికి ముందునుంచే చుట్టాలు వచ్చి దిగుతున్న సమయం....

"నేను వస్తున్నాను" హరిహరన్.

మొదట టెలిగ్రాము వచ్చినప్పుడు ఆమె నమ్మలేదు.

సదాకి ఐదేళ్ళు నిండే వరకూ హరిహరన్ దగ్గర్నించి ఒకటి రెండు ఉత్తరాలు, టెలిగ్రాములు వచ్చి ఉన్నాయి.

"ఇదిగో వస్తున్నాను.'

"వచ్చే సంవత్సరం ఆగస్ట్‌లో ఒక నెల సెలవులు."

చివరిగా వచ్చిన ఉత్తరం క్లుప్తంగా రాయబడింది.

"ఆశీర్వాదం.

ఇప్పుడు నేను ఉన్న పరిస్థితుల్లో బయలుదేరి రావడం కుదరదు. ఇన్ని రోజులుగా నీ దగ్గర ఒక విషయం చెప్పకుండా దాచి ఉంచినందుకు నన్ను క్షమించు. ఇక్కడ నాకు ముందే ఒక భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. వాళ్ళని వదిలి నేను రాలేను. అమ్మ తన ఆఖరి రోజుల్లో కోరిన కోరికను తీర్చడానికే మన పెళ్ళి జరిగింది. ఇక నువ్వు నీదారిలో వెళ్ళొచ్చు. మళ్ళీ పెళ్ళిచేసుకో.

ఇట్లు
హరిహరన్

ఆ మనిషి ముఖాన్ని మర్చిపోయినా, ఆయన వ్రాసిన ఉత్తరంలోని వాక్యాలను మర్చిపోలేదు.

పెళ్ళికి ఈయన్ని ఎవరు పిలిచింది. ధర్మసంవర్ధిని అలాగే పూజ గదిలో కూలబడింది. సదా తటపటాయిస్తూ తల్లి దగ్గరకి వచ్చాడు.

"నేనమ్మా ఆయనకి పెళ్ళిపత్రిక పంపి ఉత్తరం వ్రాసి..."

"నీకు ఎలా ఆయన......"

"అడ్రసు తెలుసమ్మా ఇక్కడినుంచి వెళ్ళేముందే వెంకు మామయ్య దగ్గర అడ్రస్ తీసుకుని వెళ్ళాను. ఏదో ఆవేశం, 'నువ్వు నన్ను చూడకున్నా నేను పెరిగి పెద్దవాడినయి, అమెరికాకు వచ్చి చదువుకునేంతదాకా ఎదిగాను చూడు' అని గొప్పగా చెప్పుకోవాలని ఆశపడ్డాను. కాని అక్కడికి వెళ్ళాకే నాన్నగారి పరిస్థితి తెలిసింది."

సదా తండ్రి గురించి ఆకాశమంత ఎత్తుకు పొగిడాడు. బాగా డబ్బుందట. పరపతి ఉందట. అమెరికన్ భార్య ఏడెనిమిదేళ్ళు మాత్రమే ఆయనతో కాపురం చేసిందట. తర్వాత తర్వాత విడాకులిచ్చేసి పిల్లలతో సహా వెళ్ళిపోయిందట. తండ్రి ఇప్పుడు ఒంటరివాడట. సదాని చూడగానే ఏడ్చేశాడట. సదాని తన స్నేహితులకి పరిచయం చేసాడట. అదికూడా ఎలాగా?

"నా కొడుకు. ఇండియా నుంచి చదువుకోవడానికి వచ్చాడు" అని.

గత రెండు సంవత్సరాలుగా తాను కన్నకొడుకు తనని వదిలేసిన భర్త దగ్గరే, అతని ఇంటిలోనే ఉండి చదివి ఇప్పుడు పెళ్ళికోసం మాతృదేశానికి తిరిగి వచ్చాడని తెలిసినప్పుడు ధర్మసంవర్ధిని నిలువునా కూలిపోయింది.

"పెళ్ళి నిశ్చయం కాగానే ఫోనులో తెలియజేయమన్నారమ్మా. ఇన్నేళ్ళూ తాను చేసిన దానికి ప్రాయశ్చిత్తంగా ఆయనే వచ్చి పెళ్ళిని తన చేతుల మీదుగా జరిపిస్తానన్నారు. అలా చెప్పిన తర్వాత ఎలాగమ్మా వద్దని చెప్పడం? ఎంతోమంది ఇళ్ళల్లో జరుగుతున్న వ్యవహారమే కదా ఇది. పైగా ఆయనే తప్పును గ్రహించి, బాధపడుతున్నప్పుడు మనం కూడా ఆయన్ని హింసించడం భావ్యంకాదు."

"................."

"ఆడపెళ్ళివాళ్ళింట్లో కూడా నిశ్చింత. ఎంత బాగా చదువుకున్నా, చేతినిండా సంపాదిస్తున్నా పెళ్ళికొడుకు తండ్రికీ తల్లికీ పడదు అన్న కొరత ఉండే ఉంటుంది. ఇప్పుడు అంతా సవ్యంగా చక్కబడింది."

ధర్మసంవర్ధిని తనకొడుకును కొత్త మనిషిని చూసినట్లు చూసింది.

నిశ్చితార్ధం జరిగినప్పుడు వ్రాయబడిన ముహూర్త పత్రికలో చిన్న మార్పును సూచించింది ధర్మసంవర్ధిని.

"శ్రీమతి ధర్మసంవర్ధిని యొక్క కుమారుడు" అన్న పదాన్ని తీసేసి దానికి బదులుగా 'శ్రీ హరిహరన్ గారి కుమారుడు' అని వ్రాసి ఆయన చదివిన చదువులనీ, డిగ్రీలనీ వేయమన్నది.

"శ్రీమతి మరియు శ్రీ హరిహరన్ గార్ల"

కొడుకు సాగదీస్తున్నట్లుగా అన్నాడు. కాని ధర్మసంవర్ధిని ఒప్పుకోలేదు. అది మాత్రమే కాదు పెళ్ళిపందిట్లో పెళ్ళికొడుకు తల్లి స్థానంలో సదా ప్రక్కన నిలబడటానికి కూడా ఇష్టపడలేదు.

"ఏంటమ్మా ఇది? ఉన్నట్లుండి నువ్వు ఇలా బిగుసుకుంటే ఆడపెళ్ళివాళ్ళింట్లో ఏమనుకుంటారు? నాన్నగారి మనసు ఎలా బాధపడుతుంది?"

ధర్మసంవర్ధిని కొడుకుని చూసి నవ్వింది. "ఈ క్షణం కోసం ఇరవైఐదేళ్ళుగా తపస్సు చేశాను సదా. కాని అమెరికానుంచి దీనికోసమని పరుగెత్తుకుంటూ వచ్చారు మీ నాన్నగారు. ఆయన్నే నిలబడనీ నీ పక్కన. బక్కచిక్కి ఎముకుల పోగులా, దిష్టి బొమ్మలాగా నేను ఎందుకు? వద్దు...."

ధర్మసంవర్ధిని తల్లికూడా కూతురి వాలకం చూసి మండిపడింది.

"ఏంటే నీ పంతం? రానే రాడనుకున్న మనిషి వచ్చాడు. నువ్వేదో ఆకాశంలో ఎగురుతున్నట్లు అతన్ని కాలితో తంతావెందుకు? చదువు లేని మొద్దు అన్నది సరిగ్గానే ఉంది."

హరిహరన్!

భార్య కోపం అతనికి అర్ధమయ్యింది. ఆమె దగ్గరికి వెళ్ళకుండా, కాస్త ఎడంగా నిలబడి తనచుట్టూ ఒక గుంపును కూడా బెట్టూకుని ఆమె చెవులకీ వినపడేటట్లు బిగ్గరగా అన్నాడు.

"చాలు మామయ్యా అమెరికా వాసం విసుగొచ్చేసింది. ఇలాంటి ఒక కొడుకు ఉంటే చాలు. గుత్తివంకాయ కూర ఎప్పుడు తింటామా అని నోరు చచ్చిపోయింది. ఇక మీదట ఇక్కడే"

"బోలెడంత ఆస్తి ఉంది. బాబు ఎలాగూ అక్కడికే వెళుతున్నాడు. ఇక్కడ వాళ్ళమ్మనుచూసుకునే బాధ్యతను నేను తీసుకుందామని అనుకుంటున్నాను."

"మా అమ్మ చనిపోయి పదిహేను సంవత్సరాలవుతోంది. ఒక్కగానొక్క కొడుకుని. ఆమెకి ఇంతవరకూ ఒక్క పిండం కూడా పెట్టింది లేదు. ఆ దేశంలో ఉన్న పరిస్థితులలో అదంతా సాధ్యంకాదు. ఒకసారి కాశీకి ధర్మతో సహా వెళ్ళి అమ్మకి చేయాల్సిన కర్మకాండలన్నీ చేసి రావాలనుకుంటున్నాను. మీరేమంటారు మామయ్యా?"

చుట్టూ ఉన్నవాళ్ళంతా "ఆహా! ఓహో" అంటూ పొగిడారు.

ధర్మసంవర్ధిని మాత్రం రాతి శిల్పంలా, జడంగా చూస్తూ నిలబడి ఉంది.

ఆ రోజు నాన్నగారిని, ఇంకా కొంతమంది బంధువులను ముందు పెట్టుకుని సదా అమ్మతో అన్నాడు.

"అమ్మా! నేను వచ్చే శుక్రవారం బయలుదేరుతున్నాను."

ధర్మసంవర్ధిని చీర కొంగుతో ముఖాన్ని గట్టిగా తుడుచుకుంటూ లేచి నిలబడింది.

"ఇదిగో చూడు సదా! నువ్వు నా కడుపున పుట్టిన కొడుకువే అయినా నేను నిన్ను నమ్మడానికి సిద్ధంగాలేను. పాతికేళ్ళుగా పెంచిన తల్లికన్నా, నిన్న చూసిన నాన్నే గొప్ప అని అటువైపు మళ్ళిన వాడివి నువ్వు. అందుకే అంటున్నాను నువ్వు నన్ను తీసుకెళ్ళకపోయినా ఫర్వాలేదు. కానీ నీ భార్యను ఇక్కడే వదిలి వెళ్ళడానికి నేను ఒప్పుకోను. నీ టిక్కెట్టును క్యాన్సిల్ చేసుకో. ఆమెతో కలిసి వెళ్ళు."

"అమ్మా! ఏంటమ్మా నువ్వనేది? నేను ఈనెల ఇరవై తారీఖున అక్కడ ఉండి తీరాలి."

"అది నీ తలనొప్పి. విజి ఎక్కడ?"

విజి ఇంకా అత్తగారికింటికి అలవాటు పడలేదు. మెల్లగా తొంగి చూసింది.

"విజీ! నీ మొగుడితో నువ్వు బయలుదేరు."

"ఆయన ఇప్పుడు కుదరదని..."

"అతని నాన్నగారు కూడా నా దగ్గర అలాగే అన్నారు. ఇరవై ఐదేళ్ళ తర్వాత ఇదిగో మళ్ళీ ఇప్పుడొచ్చారు. ఒంట్లో జవసత్వాలు, అహం ఉన్న రోజుల్లో ఆయనకి అమెరికన్ భార్య కావాల్సివచ్చింది. ఇన్నేళ్ళ తర్వాత ఎదిగిన కొడుకుతో బాటు, కమ్మగా వండి పెట్టడానికి, జ్వరం వస్తే గంజి కాచి ఇవ్వడానికి, కాశీకి వెళ్ళి కన్నతల్లికి పిండం పెట్టడానికి భార్య కావాల్సి వచ్చింది."

"ఒసేయ్ ధర్మా! నువ్వు కాస్త నోర్మూసుకో," తల్లి కూతుర్ని కసురుకుంది.

ధర్మసంవర్ధిని నిదానంగా, స్థిరమైన గొంతులో అన్నది. "మీకందరికీ ఏం కావాలమ్మా? ఒక ఫారిన్ చీర, సెంట్లు, సబ్బులు తెచ్చి ఇస్తే చాలు. మా అల్లుడు బంగారం అని అంటారు. నాకు అలా కాదు. కలలో లాగా ఒకే ఒక్క నెల మాత్రం నాతో కాపురం చేసి, కడుపులో బిడ్డనూ ఇచ్చి వెళ్ళిన మనిషి, ఈ పాతికేళ్ళలో భార్య బ్రతికే ఉందా చచ్చిపోయిందా అని కూడా పట్టించుకోని మనిషి, ఈ రోజు చెట్టంత ఎదిగిన కొడుకును చూడగానే రక్తసంబంధాన్ని పునరుద్దరించుకోవడానికి పరిగెత్తుకొచ్చారు. నా కడుపున పుట్టిన కొడుక్కీ అదే రక్తమే కదా. డబ్బునీ, ఆడంబరాన్నీ చూడగానే అటు పక్కకి వెళ్ళిపోయాడు."

"అమ్మా!"

"నోర్మూసుకోరా. నువ్వు నిజంగా నా కొడుకువే అయితే ఈ విదేశీ వ్యామోహాన్ని వదిలేసి ఇక్కడే భార్యతో సత్యంగా కాపురం చెయ్యి. వచ్చే జీతం చాలు. అక్కడికి వెళ్ళి లక్షలకి లక్షలు సంపాదించేకన్నా ఇక్కడే ఒక లక్ష్యంతో జీవితాన్ని కొనసాగించు."

ధర్మసంవర్ధిని కోడలు దగ్గరికి వచ్చి భుజం మీద తట్టింది. "ఇదిగో చూడూ నీ మొగుడు నీతో సవ్యంగా కాపురం చేస్తాడని నమ్మకం కలిగే ముందే అతని బిడ్డకి కడుపులో పెరగనివ్వకు. జాగ్రత్తగా ఉండు. ఇప్పుడే అనుమానంగా ఉంటే డాక్టరు దగ్గరకి వెళ్ళి అబార్షన్ వేయించుకో ఇలాంటి మగాడికి తల్లిగా ఉండటం కన్నా గొడ్రాలు అని పేరు తెచ్చుకోవడం మంచింది."

ధర్మసంవర్ధిని చిన్న సంచిలో తన చీరల్ని కుక్కింది. కొడుకుతో విదేశాలకి వెళుతున్నామన్న సంబరంతో ముందే సర్ది పెట్టుకున్న సామాన్లను తీసి మళ్ళీ లోపల పెడుతూ ఎవరినీ ఉద్దేశించకుండా అన్నది.

"నేను ఎవరితోనూ కాశీకి వెళ్ళడానికి సిద్ధంగా లేను. ఈయన తన కన్న తల్లికి పిండం పెట్టకపోయినా, నేను మా అత్తగారికి సంవత్సరం తప్పకుండా అన్నీ చేస్తూనే వచ్చాను. ఇరవై అయిదేళ్ళ తర్వాత నేను ఎవరికీ భార్యను కాను. ఇంకా చెప్పాలంటే ఆడదాన్నే కాను. మగాడికి సమంగా పాట్లుపడ్డాను. మగాడిలా బ్రతికాను. అది చాలు నాకు."

హరిహరన్ ముఖం కుచించుకుపోయినట్లు నల్లబడింది. దించుకున్న తలతో మెల్లగా అక్కడినుంచీ తప్పుకున్నాడు.

విజి సదాను ఓ ప్రక్కగా తీసుకెళ్ళి గొంతు తగ్గించి అడిగింది. "ఇంత జరిగాక కూడా మీరు అమెరికాకు వెళ్ళాలనుకుంటున్నారా?"

"వేరే దారి లేదు విజీ. అక్కడ నా ఉద్యోగం మాత్రమేకాదు. నాన్నగారి ఆస్తి, ఎస్టేటు అన్నీ..."

"మరి నేను?"

"చెప్పానుగా. ఇంకో నాలుగు నెలల్లో"

"అయితే నన్ను ఒక లేడీ డాక్టరు దగ్గరకు తీసుకువెళ్ళండి, వెంటనే."

"ఏమయ్యింది విజీ?"

"నేను స్నానం చేసి నలభై ఐదురోజులవుతోంది. మీ అమ్మగారన్నట్లు విశ్వాసం లేని ఈ వంశానికి నేనొక వారసుడిని కని ఇవ్వదలచుకోలేదు. ఇప్పుడే తీయించేసుకోవాలనుకుంటున్నాను. భార్య అనే స్థానమే లేనప్పుడు అమ్మ అన్న మరో స్థానానికి వెళ్ళడం నాకు ఇష్టం లేదు."

విజి ఈ కాలపు అమ్మాయి. సమస్యను గొడ్డలి దాకా పోనీయకుండా గోటితోనే త్రుంచెయ్యడానికి సిద్ధమైంది.

## వారసత్వం

తమిళ మూలం: ఎస్.శంకరనారాయణన్

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్



శంకరనారాయణన్

దేవకి అక్కయ్యకి ఈరోజు పెళ్ళిచూపులు. తెల్లగా, పొడగరిగా ఉన్న అక్క ప్రతిరోజూ హడావిడిగా, నిలువుటద్దంలో ఒకసారి చూసుకుని ఆఫీసుకి బయలుదేరుతుంది. కనుబొమలను తీర్చిదిద్దుతూ "చిన్నీ!" అని పిలుస్తుంది. టిఫిన్ బాక్స్‌ను రిలే రేసులాగా తీసుకుంటూ ఉరుకు పరుగులతో వెళుతుంది.

పెళ్ళికొడుక్కి వేరే ఊరు. పెళ్ళైన తర్వాత అక్కయ్యకి ట్రాన్స్‌ఫర్ దొరుకుతుందేమో మాట్లాడాలంటున్నారు. చిన్నికి అక్కయ్యని వదిలి ఉండటం కష్టమే. ఎప్పుడైనా మంచి మూడులో ఉంటే చిన్నిని పిలిచి తల దువ్వి జడవేస్తుంది.

"వంకర పాపిడా! అయ్యో వద్దక్కా."

"ఊరుకోవే పల్లెటూరి మొద్దూ. కూర్చో చెపుతాను."

ఒకసారి ఊరికి వెళ్ళినపుడు చిన్ని వంకర పాపిడి తీసి జడ వేసుకుంది. చెల్లెలు కోకిల ఆశ్చర్యంగా చూసింది. పట్నపువాసం

పిల్లలాగే ఉంది చిన్ని.

"అక్కోవ్! నాకూ వెయ్యవే" అంటూ దగ్గరికి వచ్చి నిలబడింది కోకిల.

మురికి పట్టిన లంగా, గుండీలు లేని జాకెట్టు చూసిన చిన్ని "పోవే. మొదట స్నానం చేసిరా" అని తరిమేసింది.

"ఒసేవ్ చిన్నీ! ఇలారా. "దేవకి అక్కయ్య పిలిచింది.

"ఏంటక్కా?"

"ఈపూలు తలలో సరిగ్గా పెట్టు.. చూద్దాం."

"టైమయ్యింది. ఇంకా తయారుకాలేదా? "హాలు నుంచి నాన్నగారి కేక వినిపించింది.

"అయిపోవచ్చింది. ఒక్క నిమిషం. "దేవకి పళ్ళ మధ్య హేర్ పిన్ను విడదీస్తూ అరిచింది.

"కుచ్చిళ్ళు సరిగ్గా వచ్చాయా చూసుకో" అమ్మ అన్నది.

చిన్ని మోకాళ్ళ మీద కూర్చుని కుచ్చిళ్ళను సరిచేసింది.

"ఎప్పుడు వస్తారమ్మా?" అడిగింది చిన్ని.

"ఇదిగో ఇంకో పావుగంటలో వచ్చేస్తారు. వీళ్ళ నాన్నగారు ఎక్కడ?"

"బజారు దాకా పంపించానమ్మా" అంది దేవకి

"చిన్నీ! బజ్జీలు, రవ్వకేసరి అన్నీ రెడియేనా?

"రెడీగా ఉన్నాయమ్మా. మీరేమి కంగారు పడకండి" అంది చిన్ని.

మగపెళ్ళివారి కోసం ఎదురుచూస్తూ అందరూ కూర్చున్నారు. వాళ్ళకి ఎదురు వెళ్ళి తీసుకుని రావాలన్నట్లు నాన్నగారు గుమ్మం దగ్గరే నిలబడ్డారు. అమ్మ టేప్ రికార్డర్‌లో నాదస్వరం పెట్టింది. దేవకి కుదురుగా ఉండలేక లోపలగదిలో కుర్చీలో అటూ ఇటూ కదులుతోంది.

అక్కయ్యని చూసి చిన్ని నవ్వింది.

"నువ్వు కూడా వేరే డ్రెస్సు మార్చుకో చిన్నీ."

"ఫర్వాలేదక్కా. కాసేపైన తర్వాత.."

"ఎందుకు?"

"లోపల కాస్త పనుంది. బజ్జీలు చేయడానికి కడాయి పెట్టాలి."

చిన్ని వంటింట్లోకి వెళ్ళి పాలు ఉన్న స్టవ్‌ని ఆఫ్ చేసింది. డికాషన్ రెడీ. అందరూ రాగానే కాఫీలు కలపాలి. అమ్మగారితో చిన్న ఇబ్బంది. ఆమె ఎప్పుడు వంటింట్లోకి వచ్చినా డబ్బాలను పై అలమారలో పెట్టేస్తుంది. స్టూల్ లేకుండా తీయడం కుదరదు. చిన్ని చక్కెర డబ్బాను తీసి ప్రక్కన పెట్టుకుంది.

"అక్కా! కొంచెం కాఫీ?"

"తీసుకురా."

"ఇదిగో" అంటూ అందించింది చిన్ని. "అక్కా! జాగ్రత్త. ఒలికితే మరక పోదు. చీర పాడవుతుంది."

ఘుమఘుమలాడుతున్న కేసరిలో నెయ్యిలో వేయించిన జీడిపప్పు అక్కడక్కడా మెరుస్తున్నాయి. తీసి ప్రక్కనే పెట్టి, బజ్జీల కోసం బాణలిని స్టవ్ మీద పెట్టింది చిన్ని. శనగ పిండి కలుపుతున్న తర్వాత బజ్జీలకై తరగి ఉంచిన అరటికాయ ముక్కల్ని పిండిలో ముంచి నూనెలో వేసింది. బజ్జీలు దోరగా నూనెలో వేగుతున్నాయి.

మేడమెట్లమీద దడదడమంటూ ఎవరో క్రిందకి వస్తున్నట్లుగా శబ్దం వినిపించింది. నటరాజన్ వచ్చాడు.

"మెల్లగా దిగిరాకూడదూ" అంది అమ్మ.

నటరాజన్ బజ్జీల వాసనను ఘ్రాణిస్తూ "ఆహా!" అన్నాడు. నేరుగా వంటింట్లోకి వచ్చాడు.

"వేడిగా ఉంది జాగ్రత్త" అంది చిన్ని.

"నా బట్టలన్నీ ఉతికేశావా చిన్నీ" అంటూ వేడిగా ఉన్న బజ్జీని త్రుంచి నోట్లో వేసుకున్నాడు.

"ఉతికేశాను. ఆరేయాలి."

"ఎప్పుడు?"

చిన్ని తిరిగి చూసింది. "దండెం ఎత్తులో ఉంది. డాబా మీదికి వెళ్ళి ఆరేయాలి."

"అదే...ఎప్పుడూ? దానికీ వారం వర్జ్యం చూడాలా?"

"నటరాజ్! ఇలారా. వాళ్ళు వచ్చేటప్పుడు నువ్వూ ఎదురెళ్ళాలి. "

"పోమ్మా. ఇలా పెళ్ళి చూపులు చూడడం, స్వీట్లు కారం తినడం.... ఇవన్నీ పాత పంచాంగం."

"ష్.. బిగ్గరగా మాట్లాడకు. వాళ్ళే వచ్చే సమయం ఒసే చిన్నీ!

"ఏంటమ్మా?" చిన్ని తొంగి చూసింది.

"అన్నీ రెడీయేనా?"

"రెడీగా ఉన్నాయమ్మా."

"ఏమిటే? నువ్వింకా డ్రస్సు మార్చుకోలేదూ?"

స్టవ్ ఆర్పేసి "ఇదిగో" అంటూ పరిగెత్తింది చిన్ని. పాటీ లంగా, దానికి మేచింగ్‌గా జాకెట్టు పోయినసారి దీపావళికి తీసి ఇచ్చారు. ఆమెకి చాలా ఇష్టమయిన డ్రస్సు అది. దాన్ని వేసుకున్నప్పుడల్లా ఆమెకి కాశంలో విహరిస్తున్నట్లుగా ఉంటుంది.

"అక్కోవ్... ఒకసారి నేను తొడుక్కోనా?"

"వీల్లేదు" అంది చిన్ని చెల్లెలితో.

"ఎందుకు?" కోకిల అడిగింది. అడుగుతుండగానే ఏడుపు ముంచుకుని వచ్చింది ఆమెకి. "ఈసారి దీపావళికి నాకేదీ కొనలేదక్కా."

అమ్మ వచ్చిన ప్రతీసారి చిన్ని డ్రస్సులలో కొన్ని ఊరుకి పట్టుకెళుతుంది. వద్దు అని చెప్పలేక, ఏడుపు తన్నుకుని వస్తున్నా మౌనంగా చూస్తూ ఉండాల్సిన పరిస్థితి.

"దేవకి అక్కయ్యా! మీరు తప్పుగా అనుకోకుండే.."

"ఏంటే? చెప్పు..."

"ఈ డ్రస్సు కాస్త మీ అలమారలో పెట్టండి. నేను తర్వాత తీసుకుంటాను."

"నీ పెట్టెలో జాగాలేదా?"

"అది కాదక్కా. మా అమ్మ వస్తోంది ఈరోజు."

మగపెళ్ళివాళ్ళు నలుగురు టాక్సీలో వచ్చి దిగారు. పెట్రోలు వాసన గుప్పుమని వ్యాపించింది. తెల్లజబ్బా వేసుకున్న పెళ్ళికొడుకు వ్రేలి ఉంగరం మెరుస్తుండగా చేతులు జోడిస్తూ నవ్వాడు.

చిన్ని అతన్ని పరకాయించి చూసింది. తర్వాత గబగబా లోపలికి వెళ్ళి దేవకితో "అక్కా! వాళ్ళు వచ్చేసారు" అంది వేగంగా

ఊపిరి పీలుస్తూ.

"అలాగా" అంటూ దేవకి లేచి ఒకసారి కుచ్చిళ్ళను సరిచేసుకుంది.

"హలో! - ఐయామ్ నటరాజ్."

"ఐయామ్ వివేక్."

తాతగారు లేవబోతుండగా అందరూ ఒకేసారి "మీరు కూర్చోండి తాతయ్యా" అన్నారు.

"కాస్త నలతగా ఉంది. " తాతగారు నవ్వారు.

చిన్ని అమ్మగారి దగ్గరికి వెళ్ళి "తాతగారి టాబ్లెట్లు ఇవ్వాలమ్మా" అంది.

"అన్నీ తర్వాత చూసుకోవచ్చు."

"లేదమ్మా... టైముకి..."

"అన్నీ నాకు తెలుసు." కసురుకుంటూ లోపలి గదిలోకి తొంగిచూసింది. లోగొంతుకతో "రెడీయేనా" అన్నది.

"ఊమ్."

"అద్దంలో చూసుకున్నది చాలు. రా"

చిన్ని అక్కయ్యని చూసింది. ఎంత అందంగా ఉంది అక్కయ్య! మళ్ళీ పెళ్ళికొడుకుని చూసింది.

"చిన్నీ! కాఫీలు...."

"ఇదిగో తెస్తున్నానమ్మా."

"అలా చేతులు నులుముకుంటూ మడ్డిలా నిలబడకు. త్వరగా తీసుకురా."

ట్రేలో కప్పు, సాసర్‌లు పెట్టి కాఫీ గిన్నెను మసిగుడ్డతో పట్టుకుని కప్పులతో కాఫీ నింపుతుండగా హాల్లోనుంచి పాట వినబడింది. ఫలహారం తింటూ అందరూ వింటున్నారు. పెళ్ళికొడుక్కి ఉన్నట్లుండి పొలమారింది. బొటనవేలిని నోటి దగ్గర చూపిస్తూ నీళ్ళు కావాలన్నట్లు సైగ చేసాడు.

"ఎవరో తలచుకుంటున్నారు"

"పెళ్ళి కూతురో ఏమో."

ఎవరో అనగానే అందరూ నవ్వారు.

"ఒసేయ్ చిన్నీ!" నటరాజన్ అరిచాడు.

"ఏంటన్నయ్యా?"

"మంచినీళ్ళు పెట్టొద్దూ. ఒకటి చెపితే ఒకటి మర్చిపోతావేం?"

"ఇదిగో తెస్తున్నాను."

పాట ముగిసిన తర్వాత దేవకి వివేక్ వైపు చూసింది. అతని ముఖంలో ఏ భావమూ కనిపించలేదు. భావరహితమైన ముఖం.

"దేవకీ! నువ్వు వెళ్ళి వీళ్ళకి కాఫీలు..."

"సరే" అంటూ దేవకి లేచినప్పుడు కంగారుతో తూలిపడబోయి ఎలాగో నిలదొక్కుకుంది. వంటింట్లో తయారుగా ఉన్న ట్రేలో కాఫీలు తీసుకుని దేవకి రావడం... చిన్ని లోపలికి వెళ్ళడం ఒకేసారి జరిగాయి.

చిన్ని బట్టలమీద కాఫీ వేడిగా పడింది. చిన్ని కంగారు పడుతూ తన బట్టల కేసి చూసుకుంది. కాఫీ మరకలు. ఆమెకి చాలా కష్టంగా అనిపించింది. ఆమె దగ్గర ఉన్న ఒకే ఒక్కమంచి డ్రస్సు.

దేవకి దిగ్భ్రమ చెందినదానిలా అలాగే నిలబడిపోయింది. చిన్ని ఎదురు చూడని విధంగా ఒక సంఘటన జరిగింది. వెనకనుంచి అమ్మగారి గొంతు కోపంగా వినిపించింది.

"పాపిష్టిదాదానా! కాఫీ పూర్తిగా ఒలకపోసావుకదే బుద్ధిలేదు నీకు" అంటూ వడివడిగా వచ్చి చిన్ని నెత్తి మీద బలంగా మొట్టికాయ వేసింది.

"ఫర్వాలేదండీ. పాపం చిన్నపిల్లేకదా" అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

"ఇంకా చిన్నపిల్లేంటి? ఎనిమిదేళ్ళు నిండాయి. ఇక్కడికి వచ్చి ఏడాదయ్యింది. ఇలాగే పనులన్నీ క్రిందా మీదా చేస్తుంది."

"పీడాకారం! తరిమేసి తలకి స్నానం చేయాలి" అన్నాడు నటరాజన్.

"వదిలెయ్యండి. చిన్నపిల్ల" అన్నాడు పెళ్ళికొడుకు.

"మీరు మనస్సులో ఏదీ పెట్టుకోకండి."'

"లేదు లేదు."

"ఏమండీ!" పెళ్ళికొడుకు తల్లి భర్తకేసి చూస్తూ అన్నది.

"ఏమండీ లేదూ గీమండీ లేదు. ఇదంతా సహజం" అన్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

"వెరీగుడ్ అలాగే ఉండాలి" అన్నారు తాతగారు.

చిన్ని తడిబట్టలను తీసుకుని మేడమీదకి వెళ్ళింది.

"రస్నా తాగుతారా?"

"ఓ యస్. ఏదైనా ఫరవాలేదు" అన్నాడు పెళ్ళికొడుకు దేవకిని చూస్తూ. దేవకికి సిగ్గుగా అనిపించింది.

"అమ్మా!" మెల్లగా పిలిచింది.

"ఏమిటీ?"

"రస్నా ఎలా కలపాలి?"

"చిన్నీ లేదా?"

"మేడ మిదకి వెళ్ళింది."

"ఇప్పుడెందుకు వెళ్ళింది? రాను రాను దానికి పొగరు ఎక్కువయ్యింది. నువ్విలారా నేను కలుపుతాను."

పదినిమిషాల తర్వాత పెళ్ళివారు బయలుదేరారు. పెళ్ళికొడుకు అక్కడే తన అంగీకారాన్ని చెప్పేసాడు. మూడు నెలల తర్వాత ముహూర్తాలు పెట్టుకునేటట్లు మాట్లాడుకుని పెళ్ళివారు వెళ్ళిపోయారు. వెళ్ళేముందు పెళ్ళికొడుకు దేవకితో "వస్తాను" అన్నాడు. దేవకికి సిగ్గుగా అనిపించింది.

నటరాజన్ బస్‌స్టాండ్ వరకు సాగనంపడానికి వెళ్ళాడు. వాళ్ళు వెళ్ళగానే అమ్మ "చిన్నీ!" అని అరిచింది.

"బట్టలు ఆరేస్తున్నానమ్మా."

"అవన్నీ తర్వాత చూసుకోవచ్చు. నువ్వు మొదట క్రిందికి దిగిరా."

చిన్ని దిగి వచ్చింది.

"చిన్నీ! ఏడుస్తున్నావా?" తాతగారు అడిగారు.

"కంట్లో నలక పడింది తాతయ్యా."

"ఏది ఏమైనా నువ్వు అందరి ముందూ చిన్నిని అలా తిట్టడం బాగాలేదు." నాన్నగారు అమ్మతో అన్నారు.

తన్నుకు వచ్చిన ఏడుపును పెదవి నొక్కిపట్టి ఆపుతూ "నేను పడేయలేదమ్మా" అన్నది చిన్ని.

"తెలుసు" అన్నది అమ్మ.

చిన్ని తలెత్తి అమ్మను చూసింది.

"కళ్ళు తుడుచుకో. వంటింట్లో ఉన్న రవ్వకేసరిని తీసుకురా. అందరం తిందాం."

"ఇదిగో."

"ఆగవే చిన్నీ!" దేవకి పిలిచింది. "ఈరోజు మంచి రోజు. ఏడుస్తూ ఉండకూడదు. నువ్వు మరి."

"..........."

"నవ్వవే."

చిన్ని నవ్వింది.

రవ్వకేసరిని తల్లీ కూతుళ్ళు ఇద్దరూ పంచుకుని తిన్నారు.

"బజ్జీలో కాస్త ఉప్పు తక్కువైనట్లుంది" అంది అమ్మ.

"సరిగ్గానే ఉంది." దేవకి అన్నది.

"చిన్నీ! నువ్వు తిన్నావా?" అమ్మ చిన్నివైపు చూస్తూ అడిగింది.

"ఫరవాలేదమ్మా." చిన్ని నవ్వింది.

"తాతయ్యా! మాత్రలు వేసుకోండి." చిన్ని చేయి చాపింది.

"అమ్మలూ! వంటలో ఒక్క అక్షరం నేర్చుకోకుండా ఈ ఇంట్లో ఇన్ని రోజులు గడిపేసావు. ఇక మీదైనా నేర్చుకోవాలి."

"పోమ్మా. నేను వంటా గింటా చేయను."

"మరి బువ్వకి ఏం చేస్తావు?"

"ఎవరైనా పనమ్మాయిని పెట్టుకోవాలి మరి."

"సర్లే. నీవనుకోగానే దొరుకుతుందేమిటి? వయస్సులో చిన్నపిల్లగా, చురుకుగా, దొంగ బుద్ధిలేని పిల్ల దొరకాలికదా?"

"నా చెల్లెలు కోకిల ఉందమ్మా" అన్నది చిన్ని మెరిసే కళ్ళతో

***

## ఏర్పాటు

తమిళ మూలం: ఇందిరా పార్థసారథి

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్

రాత్రి పదిన్నర

"లైటు తీసేసి పడుకోండి."

భార్యామణి యొక్క గొణుగుడికి తల ఒగ్గుతూ పుస్తకాన్ని మూసేసి లైటు తీసేయబోతుండగా ఫోను మోగింది.




"ఈ టైములో ఎవరబ్బా?" అన్నది ఆమె.

నేను మంచం దిగి హాల్లోకి వెళ్ళాను.

"మాట్లాడుతూ కూర్చోకండి."

వెనకనుంచి మాటలు నన్ను వెంబడించాయి.

"నేనేరా... రాఘవన్‌ని మాట్లాడుతున్నాను. నువ్వు కాస్త వెంటనే బయలుదేరి వస్తావా?"

"ఏమైయ్యింది? ఏదైనా ప్రోబ్లమా?" అడిగాను.

"నాన్నగారికి సీరియస్‌గా ఉంది. డాక్టర్ని పిలిచాను. వచ్చి చూసి ఆస్పత్రికి తీసుకువెళ్ళమన్నారు. నీడ్ యువర్ హెల్ప్."

ఐ

ఫోను పెట్టేసి లోపలికి వెళ్ళాను. నేను పాంటు వేసుకోవడం చూసి ఆమె అడిగింది.

ఇందిరా పార్థసారథిగా పాఠకులకి పరిచయమున్న ప్రొఫెసర్ ఆర్.పార్థసారథి గారు, తమిళంలో ప్రముఖ నవలా, నాటక, కథారచయిత. ఆయన రచనలకి అనేక ప్రతిష్ఠాత్మకమైన అవార్డుల నందుకున్నారు. సంగీతనాటక ఎకాడెమీ అవార్డు, సాహిత్య ఎకాడెమీ అవార్డు, సరస్వతీ సమ్మాన్ ఎవార్డు వీరికి లభించాయి. ఇంతవరకూ 15 నవలలు, 6 కథాసంపుటులు, 10 నాటకాలు కొన్ని వ్యాసాలూ ప్రచురించారు.

"ఎవరినుంచి ఫోను? ఎక్కడికి వెళుతున్నారు?"

"రాఘవన్. వాళ్ళ నాన్నగారికి సీరియస్‌గా ఉందట. ఆస్పత్రిలో చేర్పించాలట."

ఆమె మంచం మీద లేచి కూర్చుంది. బద్దకంగా ఒళ్ళు విరుచుకుంటూ నా వైపు చూసింది.

"మీ ఫ్రెండ్‌కి వయసెంత?"

నేను జవాబు చెప్పలేదు. గణాంక వివరాలకోసం అడిగిన ప్రశ్నకాదు ఇది.

రాఘవన్‌కి నలభైఏళ్ళు లోకం తెలియని అమాయకుడు. చిన్నతనంలో ఒకసారి అమ్మను అడిగాడట "అమ్మా! అమాయకుడు అన్నా.. పిచ్చి సన్యాసి అన్నా ఒకడేనా." అని.

"ఎందుకురా ఇలా అడుగుతున్నావు?"

"ఇంటి దగ్గర నువ్వు, నాన్నగారు అందరూ నన్ను అమాయకుడని అంటున్నారు. కాని స్కూల్లో మాస్టారు, తోటి పిల్లలు అందరూ నన్ను పిచ్చి సన్యాసి అని అంటున్నారమ్మా.

"ఒరే పిచ్చి సన్యాసీ! నువ్వు నా బంగారుకొండరా."

ఈ విషయాన్ని వాళ్ళ అమ్మే నాతో ఒకసారి చెప్పింది. ఈ అమాయకుడు డిగ్రీ దాకా చదివి పెళ్ళిచేసుకుని, ఇద్దరు పిల్లలకి తండ్రికూడా అయ్యాడు. కాని జీవితానికి కావాల్సిన మెలుకువలు ఏవీ అతనికి తెలియవు.

దీనికి కారణం వాళ్ళ అమ్మగారే అయి ఉండవచ్చు. ఎలా, ఎందుకు లాంటి మనోతత్వ పరిశోధనలోకి నేను ఇప్పుడు వెళ్ళదలచుకోలేదు. సమయం లేదు. రాఘవన్ ఇంటికి వెళ్ళాలి. అతను నాకోసం ఎదురు చూస్తుంటాడు.

కాని ఒక్కటి మాత్రం చెప్పగలను. అతనే స్వయంగా నాతో ఓసారి చెప్పాడు. అతని భార్య అతన్ని 'అమ్మ కూచి' అని మాటమాటకి దెప్పుతుందట.

నేను రాఘవన్ ఇంటికి వెళ్ళినప్పుడు అందరూ రాఘవన్ తండ్రిగారి పడగ్గదిలో ఉన్నారు. రాఘవన్, అతని భార్య పంకజం, అతని తల్లి.....

పిల్లలు వాళ్ళ గదిలో నిద్రపోతున్నారు. వాళ్ళని లేపొద్దని రాఘవన్ తల్లి చెప్పేసింది. నన్ను చూడగానే చిన్నగా నవ్వింది.

ప్రక్కనే మంచం మీద భర్త కోమాలో ఉన్నప్పుడు, ఆ చిరునవ్వుని నేను ఎదురు చూడలేదనే చెప్పాలి.

రాఘవన్ నాన్నగారికి డెబ్బై అయిదేళ్ళు. పోయిన నెలలోనే పుట్టినరోజు ఫంక్షన్ చేసారు. నేను, నా భార్య విందు భోజనానికి వెళ్ళాము.

"డెబ్బై ఐదేళ్ళు నిండినా ఎలా గుండ్రాయిలా ఉన్నారో చూసారా?" అన్నది నా భార్య.

రాఘవన్ తల్లికి అరవై ఐదేళ్ళు. పండు ముత్తైదువ కళ ముఖంలో కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

"ఆస్పత్రికి ఫోన్ చేసాను. అంబులెన్స్ రావాలి. ఎదురు చూస్తున్నాము." రాఘవన్ తల్లి అన్నది.

"డాక్టర్ ఏమన్నారు?"

"ఆయన చెప్పడానికేముంది? కోమాలో ఉన్నారు" అన్నదావిడ.

రాఘవన్ కళ్ళలో నీళ్ళు. తండ్రినే చూస్తూ అలాగే నిలబడ్డాడు.

రాఘవన్ భార్య పంకజం ముఖాన్ని సీరియస్‌గా ఉంచుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు నాకనిపించింది. నన్ను చూడగానే చీరచెంగుతో లేని కన్నీళ్ళను తుడుచుకుంది.

వాకిట్లో వేన్ వచ్చిన శబ్దం వినబడింది.

"అమ్మయ్య.... అంబులెన్స్ వచ్చేసింది. నువ్వు కూడా రాఘవన్ తో ఆస్పత్రికి వెళ్ళు. అతని గురించి నీకు తెలుసుకదా. ఏదీ తెలియకుండానే పెరిగాడు. అక్కడ డాక్టరు త్రిమూర్తిగారు ఉంటారు. ఆయనకి ఫోన్ చేసి చెప్పేసాను, ఆస్పత్రికి రమ్మని. ఆయన మా ఆడపడుచు అల్లుడు. స్పెషల్ వార్డుకి కూడా చెప్పి ఉంచాను. ఇందులో రెండువేలు ఉన్నాయి. డిపాజిట్ అడుగుతారు. డబ్బు కట్టేసి రసీదు తీసుకో. వైద్యం గురించి త్రిమూర్తిగారు చూసుకుంటారు. ఆ తర్వాత భగవంతుడి దయ" అన్నది రాఘవన్ తల్లి.

తల్లి చెప్పింది ఏవీ రాఘవన్ చెవులకి వినబడినట్లు లేదు. ఇది నాకు అతని తల్లికి మధ్య ఉన్న వ్యవహారం అన్నట్లు, అతీతుడిగా తన తండ్రి వైపే చూస్తూ నిలబడ్డాడు.

"మీరు రావడం లేదా?" అడిగాను.

"నేను వచ్చి మాత్రం చేసేది ఏముంది? ఉన్నది ఉన్నట్లుగా చెప్పాలంటే నాకు అనిపిస్తోంది వేళ వచ్చేసిందని. మిగిలిన వ్యవహారాన్నీ చూసుకోవడానికి ఒక మనిషి కావాలిగా. నీ స్నేహితుడికి ఏమీ తెలియదు."

రాఘవన్ భార్య అత్తగారి వైపు కోపంగా చూసింది. మాటమాటకి "అతనికేమీ తెలియదు" అని అత్తగారు అనడం ఆమెకి నచ్చలేదనుకుంటాను.

అంబులెన్స్‌లో ఎక్కుతున్నప్పుడు రాఘవన్ తల్లి నాతో అన్నది. "కాస్త శ్రమ అనుకోకుండా నువ్వు కూడా అతని తోడుగా ఈ రాత్రికి ఉన్నావంటే నాకు ధైర్యంగా ఉంటుంది. ఏదైనా ముఖ్యంగా ఉంటే నాకు ఫోను చెయ్యి."

డాక్టరు త్రిమూర్తి మాతో అన్నారు. "ఏమీ చెప్పడానికి లేదు రాఘవన్! కావాలంటే మీ అమ్మగారిని రమ్మని చెప్పండి. మా శాయశక్తులా ప్రయత్నిస్తున్నాము."

రాఘవన్ తల్లికి ఫోన్ చేసి డాక్టరు చెప్పిన వివరాలను తెలిపాను.

"రాఘవన్ ఎలా ఉన్నాడు?"

"మీరు వస్తారా? మిమ్మల్ని తీసుకుని రావడానికి నేను రానా?"

"ట్రీట్ మెంట్ ఇస్తున్నారు కదా?"

"ఇంజెక్షన్ ఇచ్చారు. పెద్ద డాక్టరు రేపు ఉదయం వచ్చి చూస్తారట."

"మీ ఆవిడ ఫోన్ చేసింది. వచ్చేస్తాడు కంగారు పడవద్దు అని చెప్పాను. నువ్వు నేరుగా మీ ఇంటికి వెళ్ళు. నేను టాక్సీకి ఫోన్ చేసి ఆస్పత్రికి వెళతాను. నాకేం భయం లేదు."

"లేదత్తయ్యా! నేను వచ్చి మిమ్మల్ని....."

"చెప్పింది విను. నువ్వు ఇంటికి వెళ్ళు. ప్రొద్దున్న మా ఇంటికి శాస్త్రులుగారు వస్తారు ఎనిమిది గంటలకి. ఆయనకి విషయం చెప్పి తయారుగా ఉండమని చెప్పు. ఆఖరి నిమిషంలో చిల్లరలేదు అదిలేదు అని మాట రాకూడదు."

"సరే అత్తయ్యా."

"నువ్వు కూడా నాకు కొడుకులాంటి వాడివేనని నీ భార్యతో చెప్పు. నాకు తలకొరివి పెట్టేటప్పుడు రాఘవన్‌తో పాటు నువ్వుకూడా పెట్టాలి."

"ఏంటత్తయ్యా ఇలా మాట్లాడుతున్నారు? మా ఆవిడ ఏమైనా అన్నదా?"

"ఛ.. ఛ. ఆమె చిన్నపిల్ల. ఆమె గురించి ఇప్పుడు ఎవరన్నారు? నీతో నా మనసులో ఉన్నమాట చెపుతున్నాను, అంతే ఇదిగో చూడూ... ఆమెను నువ్వేమీ అడగకూడదు తెలిసిందా?"

నేను అడగలేదు, ఆమె ఏదైనా చెప్పే ఉంటుందని కూడా నాకు తెలుసు.

మర్నాడు ఉదయం నేను రాఘవన్ ఇంటికి వెళ్ళినప్పుడు శాస్త్రులుగారు మాత్రమే కాదు. రాఘవన్ తల్లి కూడా ఉంది. ఆస్పత్రి నుంచి వచ్చింది.

"పంకజం వచ్చింది. ఆమెను చూసుకోమని చెప్పి నేను రాఘవన్ వచ్చేశాము. వట్టి పిచ్చిది. పిల్లల్ని కూడా వెంటబెట్టుకొని ఆస్పత్రికి వచ్చేసింది."

"మామయ్యకి ఎలా ఉంది?"

నాకు జవాబు చెప్పకుండా శాస్త్రులుగారి వైపు తిరిగింది. "నేను చెప్పినదంతా బాగా జ్ఞాపకం పెట్టుకోండి. ఆయన ఓహో అంటూ బ్రతికిన మనిషి. ఎవరికీ ఏ కొరతా పెట్టింది లేదు. కర్మకాండలన్నీ విఘ్నం లేకుండా, చిన్న కొరతకూడా రాకుండా బాగా జరిపించాలి. గోదానానికి ఒకే ఆవును మళ్ళీ మళ్ళీ దానమివ్వడం లాంటి దగుల్భాజీ పనులేమీ చేయకూడదు."

"ఏంటి పిన్నిగారూ? నేను అలాంటి పనులు చేస్తానా?"

"కాలం అలా ఉంది శాస్త్రులుగారు. మీరు చెయ్యకుండా ఉండవచ్చు. సరే, మీరిక వెళ్ళిరండి."

"రాఘవన్ ఎక్కడ?" అడిగాను.

"స్నానం చేస్తున్నాడు. స్నానం చేసి ఆస్పత్రికి వెళ్ళాలిగా."

"మరి మీరు?"

"నిన్ననే నీతో చెప్పానుగా. అన్నీ నేనే దగ్గరుండి చూసుకోవాలి. మంచి చావు అన్నది పెళ్ళితో సమానం. ఇందులో దుఃఖించాల్సింది ఏమీలేదు. మేమిద్దరమూ కలిసి యాభై ఒక్క సంవత్సరాలు సంతోషంగా కాపురం చేసాము. ఆయనకి కోపం కాస్త ఎక్కువ. నాకు చిన్న తలనొప్పి వచ్చినా తల్లడిల్లిపోతారు. ఆ డాక్టర్ని పిలువు, ఈ డాక్టర్ని పిలువు అని హడావుడి చేస్తారు. రాజాలాగా బ్రతికిన మనిషి, ఇప్పుడు చూడు. ఏ స్వామివారి దర్శనం దొరికిందో తెలియదు. ముఖంలో అంత తేజస్సు! కళ్ళు మూసుకుని పడుకుని ఉన్నా ఆ ముఖంలో తేజస్సు చూసావా?"

"చూశాను." దీనికి వేరే జవాబు ఉంటుందని నేననుకోను.

రాఘవన్ స్నానం చేసి వచ్చాడు.

"రాఘవా! నువ్వు పిల్లల్ని స్కూల్లో వదిలేసి ఆస్పత్రికి వెళ్ళు. పంకజం అక్కడే ఉంటానంటే ఉండనీ. లేకపోతే వచ్చేయమని చెప్పు. నేను వంట చేయబోతున్నాను. ఆయనకి ఇష్టమైన గుత్తివంకాయ కూర, టమాట పప్పు."

"చేసి ఏం చేస్తావమ్మా?" అడిగాడు రాఘవన్.

"నేను తింటాను. నేను తింటే ఆయన తిన్నట్లు" అంటూ రాఘవన్ తల్లి లేచి లోపలికి వెళ్ళింది.

రాఘవన్ పిల్లల్ని తీసుకుని బయలుదేరాడు. వెళ్ళే ముందు నన్ను అడిగాడు "నువ్వు ఈరోజు సెలవు పెడతావా?"

"నో ప్రాబ్లమ్. నువ్వు వెళ్ళు. నేను ఇక్కడే ఉంటాను."

రాఘవన్ వెళ్ళిన తర్వాత అక్కడే ఉన్న వారపత్రికను తీసుకుని సోఫాలో కూర్చున్నాను. అలాగే నిద్రపోయాను కాబోలు.

"నీ ప్రోగ్రామ్ ఏమిటి?" అని అడుగుతూ రాఘవన్ తల్లి అక్కడికి వచ్చింది. ఉలిక్కిపడి కళ్ళు తుడుచుకున్నాను.

"ఈ పూట నా భోజనం మీ ఇంట్లోనే. గుత్తివంకాయకూర, టమాట పప్పు... తలచుకుంటేనే నోరు ఊరుతోంది అత్తయ్యా" అన్నాను.

"పెళ్ళైన తర్వాత నేను కొత్తగా కాపురానికి వెళ్ళినప్పుడు మొదటిరోజు చేసిన వంట ఇది. తిన్న తర్వాత ఆయన ఎంతగా పొగిడారంటే, ఆరోజంతా పొగుడుతూనే ఉన్నారు. నాకు ఇంకా జ్ఞాపకం ఉంది. కానీ ఒక్క విషయం. ఏదైనా నచ్చలేదనుకో రుద్రతాండవమే. రండి శాస్త్రులుగారూ! మీరు మరీ తొందర పడుతున్నారెందుకు?"

"లేదు పిన్నిగారు! ఐదువందలకి చిల్లర కదా. బరువెక్కువగా ఉంది. ఇచ్చేసి వెళదామని ఇలా వచ్చాను. బ్రాహ్మలకి చెప్పి ఉంచాను. ఎవ్వరూ పదిరోజులదాకా ఎక్కడికీ వెళ్ళరు. గోదానం కోసం ఆవుని కూడా ఏర్పాటు చేసి ఉంచాను. కానీ వీటన్నిటికీ అవసరం రాకూడదని నా కోరిక. బాబాయిగారు నిండు నూరేళ్ళూ బ్రతకాలి."

అంతలో ఫోను మ్రోగింది.

"కాస్త ఆ ఫోను సంగతి చూడు." నాతో అంటూ లోపలికి వెళ్ళింది రాఘవన్ తల్లి.

ఫోను తీశాను.

"రాఘవన్‌ని మాట్లాడుతున్నాను నువ్వేనా... అమ్మతో చెప్పు నాన్నగారికి కొంచెం ఫరవాలేదని. ఒకసారి కళ్ళు తెరిచి చూసారు. ఇంకా పూర్తిగా స్పృహ రాలేదు. ట్రీట్‌మెంట్ ఇస్తున్నారు. ఇది నిశ్చయంగా మిరాకిల్! అమ్మని పిలు."

నేను లోపలికి వెళ్ళాను.

రాఘవన్ తల్లి లోపల పూజ గదిలో కూర్చుని ఉంది.

"అత్తయ్యా!!"

జవాబు రాలేదు.

దగ్గరకి వెళ్ళాను. ముఖం త్రిప్పి చూసాను. తల ఓ పక్కగా వాలిపోయింది.

శాస్త్రులుగారు లోపలికి వచ్చారు.

"ఏమైంది?" అన్నారు కంగారుగా.

"మీరు చేసిన ఏర్పాట్లేవీ వృధాగా పోవు" అన్నాను నేను.

# అంతరంగం

తమిళ మూలం: ఆనంద్ రాఘవ్

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్



**ఆఫీసు** గదిలో అడుగు పెట్టగానే అతని సీటుకు ఎదురుగా కూర్చుని ఉన్న దీప్తి కనబడింది. అతను ఆమెను అక్కడ ఎదురు చూడలేదు. ఆఫీసుకి వెళ్ళకుండా ఇక్కడికి వచ్చిన కారణం తెలియక కంగారు పడ్డాడు. "ఏమైయ్యింది? ఏదైనా ప్రాబ్లమా?" నుదుటి మీద చెయ్యి వేసి చూస్తూ ప్రేమతో అడిగాడు.

"లేదు నిక్కీ. ఇటు వైపు ఒక క్లయింటు మీటింగ్ ఉంది."

చిరునవ్వుతో గోముగా అన్న దీప్తిని అనుమానం తీరనట్లు చూసాడు. ఇంట్లోంచి బయలుదేరినప్పుడు ఆఫీసుకి వస్తానని తనతో చెప్పలేదే

"క్లయింటు కాస్త ఆలస్యంగా వస్తానన్నారు. అంతవరకు నీతో ఉందామని ఇలా వచ్చాను." అతని మనస్సులోని ఆలోచనల్ని గ్రహించినట్లు దీప్తి అన్నది.

దీప్తి... గత ఆరునెలలుగా అతని భార్య. అతనికిలాగానే M.B.A, రోజుకి పధ్నాలుగు గంటలపని, ఉరుకు పరుగులతో నిండిన జీవితం, చేతినిండా సంపాదన. అతని ఆరున్నర అడుగుల ఎత్తులో సగం మాత్రమే ఉంటుంది. అతనికి కొంచెం కూడా ఇష్టంలేని పానీ పూరీ, పావ్‌బాజీలను లొట్టలు వేసుకుని మరీ తింటుంది. వంట చేయడంలో ఇష్టంలేని, అతని మాతృభాష అయిన తెలుగును నేర్చుకోవడానికి ఎటువంటి ఆసక్తి చూపించని మనిషి.

ఆమె సగం, ఆఫీసు సగం అన్న రీతిలో నిఖిల్ పనులను ప్రారంభించాడు. ఫోను తీసి ఎవరితోనో మాట్లాడాడు. కాఫీ తెప్పించాడు. ఆమెను బయటకి పంపే మార్గాన్ని ఆలోచించాడు. ఎవరినో పిలిచి తన ఆఫీసు పనులను పదినిమిషాలకు పోస్ట్‌పోన్ చేయమని చెప్పాడు. కంప్యూటర్ ఆన్ చేసాడు.

దీప్తి దాని కోసమే ఎదురు చూస్తునట్లుగా, సహజంగా, అదే సమయంలో దృఢంగా "బై ది బై నిఖిల్! నేను ఈ రోజు ఉదయం పొరపాటున నీకు ఒక మెయిల్ పంపించాను" అన్నది.

అతను అర్థం కానట్లు చూసాడు.

"నిర్మల అన్న ఇ మెయిల్ ఐడికి పంపించడానికి బదులుగా నిఖిల్ అన్న ఐ.డి.కి పంపించేసాను. నిర్మల మెయిల్ రాలేదు అన్నది. నిర్మల్ బదులుగా నిఖిల్ అన్న అక్షరాల మీద క్లిక్ చేసినట్లునాను. పంపిన మెయిల్ లిస్ట్‌లో చూస్తే నిర్మల్‌కి బదులు నిఖిల్‌కి మెయిల్ వెళ్ళినట్లు తెల్సింది." నవ్వింది దీప్తి.

"ఓహో!" అన్నాడు క్యాజువల్‌గా. కళ్ళు అటూ ఇటూ తిప్పుతూ, చేతులు ఊపుతూ అభినయిస్తూ మాట్లాడుతున్న దీప్తిని ఓరకంటితో సునిశితంగా చూసాడు.

కంప్యూటర్‌కి ప్రాణం వచ్చినట్లు మానిటర్‌లో విండోస్ ప్రత్యక్షమయ్యింది.

"ఆ మెయిల్ వస్తే కాస్త డిలీట్ చేసేయి నిఖిల్" దీప్తి అన్నది వెంటనే.

"ష్యూర్" అన్నాడు.

అతని కళ్ళలోని సందేహపు నీడల్ని గుర్తించినట్లు దీప్తి ఏదేదో మాట్లాడసాగింది. తాను చూడబోయే కస్టమర్ గురించి, ఆ కంపెనీ ప్రాజెక్టును కైవసం చేసుకోవడానికి తాను చేస్తున్న ప్రయత్నాల గురించి, తను పనిచేసే సంస్థకి, తన ప్రమోషన్‌కి ఆ కాంట్రాక్ట్ ఎంత ముఖ్యమైనది అని చెపుతున్న దీప్తిని పరకాయించి చూశాడు.

"నీకు టైమవ్వలేదూ. నాకు ఇంకో అరగంటలో మీటింగ్ ఉంది" అన్నాడు ముక్తాయింపుగా.

"అవును బయలుదేరాలి" అంటూ లేచి నిలబడింది కానీ కదలలేదు.

నిఖిల్ ఆఫీసు మెయిల్ ఐడిని లాగిన్ అయి ఆఫీసు మెయిల్స్ చెక్ చేసాడు.

"నీ జి మెయిల్ ఐడికి వచ్చి ఉంటుంది. "మానిటర్‌ని చూస్తూ అన్నది దీప్తి.

"నేను తరువాత డిలీట్ చేస్తాను. ఇపుడు ఆఫీసు మెయిల్స్ చాలా వచ్చి ఉంటాయి. ముఖ్యమైన వాటికి జవాబు ఇవ్వాలి. నువ్వు బయలుదేరు స్వీట్ హార్ట్." మనస్సులో బయలుదేరిన వ్యతిరేకత అతని మాటల్లో తొంగిచూసింది.

నిల్చున్నదల్లా వెళ్ళకుండా మళ్ళీ కూర్చుంది. నుదుటి మీద పడ్డ ముంగురులను చేత్తో వెనక్కి తోసింది. టేబుల్ మీద తన బ్యాగును పెడుతూ అతనివైపు చూసింది. యుద్ధరంగంలో అడుగుపెట్టబోయేటట్లు ఆమె తనను తయారు చేసుకుంది.

ఆమె చేతలు అతనికి కోపాన్ని, అనుమానాన్ని కల్గించాయి. ఏం కావాలన్నట్లు ఆమె వైపు సీరియస్‌గా చూసాడు.

"Nikki… I will be lot more relieved if you delete the mail I sent."

ఇంగ్లీష్ ఎంత సౌకర్యమైన భాష? ఇబ్బంది కలిగించే విషయాలను కూడా సులభంగా చెప్పడం సాధ్యం. దీప్తి మళ్ళీ నవ్వింది. ఆమె వెలువరిచిన కోరిక కన్నా ఆ నవ్వే అతనికి ఏదోలా అనిపించింది. ఆమె నవ్వులో చాలా రకాలు ఉన్నాయని అతనికి తెలుసు. స్నేహితులను చూస్తే వేరొక నవ్వు. అతని బంధువుల దగ్గర అంటీ ముట్టని నవ్వు. అతని దగ్గర వేరే రకమైన నవ్వు. ఆమె తడబాటును, కంగారునూ చూసిన తర్వాత ఆ మెయిల్‌ని చదివి తీరాలన్న ఆసక్తి, చిన్నపిల్లలకి ఉండే పట్టుదల ఏర్పాడ్డాయి. ఆ మెయిల్‌లో అసలేం రాసింది? దానికోసమే తను ఇక్కడ పడిగాపులు కాస్తోంది. క్లయింటుతో మీటింగ్ అంతా శుద్ధ అబద్దం.

"కమాన్ దీప్తి. నువు బయలుదేరు.నేను డిలీట్ చేస్తానని చెప్పానుగా."

"డిలీట్ చేయడానికి ఒక్క నిమిషం పడుతుందా డియర్.!?"

"అవదు, కాని ఆఫీసు పనులను వదిలేసి ఆ పని చేయాల్సిన అవసరం ఏముంది? ఈ విషయంలో నువ్వు ఇలా పట్టుబట్టడం నాకు అర్ధం కావడం లేదు దీపూ." ఆమెకి సమంగా అతికించుకున నవ్వుతో అన్నాడు.

"నేను ఎవరికో రాసిన ఉత్తరాన్ని నువ్వు చదివితే నాకు ఇబ్బందిగా ఉండదా నిక్కీ..? "

"కమాన్ దీపూ. నేను దీన్ని కచ్చితంగా చదివి తీరతానని నువ్వు తీర్మానించేశావా?"

"అలా కాదు నిక్కీ!"

అంత సులభంగా తన కోరికను అతడు నెరవేర్చడని అనిపించింది. **అతని చేతిలో ఉన్న తనకి సంబంధించిన వస్తువును అతని భావాలను గాయపరచకుండా, నేర్పుగా స్వాధీనపరచుకోవాలన్న కష్టతరమైన ప్రయత్నంలో తొలి అడుగు పెట్టింది.**

"నీకు సంబంధించిన పర్సనల్ విషయాలలో నేను తలదూరుస్తున్నానా? నీ మెయిల్ ఐ.డి. ఏంటి? పాస్ వర్డ్ ఏంటి? ఎవరికి మెయిల్ పంపిస్తున్నావు అని నేనెప్పుడైనా నిన్ను అడిగానా నిక్కీ?"

"కానీ ఈ వివరాలన్నీ నీతో పంచుకోవడంలో నాకెటువంటి అభ్యంతరం లేదు దీపూ" అన్నాడు మధ్యలోనే కలగజేసుకుంటూ.

"అదే విధంగా నా పర్సనల్ విషయాలన్నీ నీతో మాత్రమే షేర్ చేసుకోవాలని నువ్వు ఎదురు చూస్తున్నావా నిక్కీ?"

"అలా ఎదురు చూడటం తప్పుగా అనిపిస్తోందా దీపూ?"

తనకే తెలియకుండా చిన్న గొడవను సృష్టించబోతున్నట్లు అతని మనస్సు తెలియజేసింది. చెక్కులు పత్రాలు, అప్లికేషన్లు అన్నిటిలోనూ ప్రభావతి అని తనే సంతకం చేసి అమ్మ సంతకాన్ని కూడా సొంతం చేసుకున నాన్నని తన స్థానంలో ఊహించుకున్నాడు.

"పెళ్ళైన తర్వాత అన్నిటినీ నీతో పంచుకున్నా, నాకు అంటూ కొన్ని రహస్యాలు ఉండకూడదా నిక్కీ?"

"లైక్ వాట్ దీప్తి?" మాటల్లో కొంచెం కూడా కోపపు ఛాయలు కనిపించనీయకుండా జాగ్రత్త పడుతూ కుర్చీలో వెనక్కి వాలి కూర్చుంటూ నిదానంగా అన్నాడు.

"అంటే...... " కొంచెం తడబడింది. అతని వితండవాదానికి జవాబు చెప్పాల్సిన నిర్భందం. "అంటే... నాకూ నా ప్రాణ స్నేహితురాళ్ళ మధ్య, ఆడపిల్లలకి మాత్రమే మితమైన కబుర్లు... పాత సంఘటనలు. మేం మాట్లాడుకునే విషయాలు నీకు తెలియాల్సిన అవసరం లేదు కదా!"

ఒప్పుకోనట్లు చూసాడు. "భార్యాభర్తల మధ్య ఉండే పవిత్రమైన బంధానికి ఏ ప్రత్యేకతా లేదని అంటున్నావా?"

"సినిమా డైలాగులు చెప్పకు నిక్కీ. నాకూ అంటూ కొన్ని అంతరంగమైన విషయాలు ఉంటాయని నువ్వూ ఒప్పుకోవాలి. అది నీ గురించిన విషయమే అయినా దాన్ని పట్టించుకోని  గొప్పమనసు నీకుండాలి."

ఇదేదో సినిమా డైలాగులా ఉందే అని అనుకుంటూ ఆమెకి జవాబు ఇవ్వబోయేముందు ఇంటర్ కం మోగింది. "లోపలికి రా సురేష్" అన్నాడు.

పాతికేళ్ళ యువకుడొకడు లోపలికి వచ్చి దీప్తి ప్రక్కన ఉన్న కుర్చీలో కూర్చుని కొంచెం సిగ్గుపడుతూ నిఖిల్‌తో ఆఫీసు వ్యవహారాలను మాట్లాడుతున్న సమయంలో దీప్తి తీవ్రంగా ఆలోచిస్తూ కూర్చుంది.

సురేష్ వెళ్ళిన తర్వాత నిఖిల్ మౌనంగా ఉన్నాడు. ఆరు నెలల సహచర్యంలో గంటల తరబడి మాట్లాడుకున్నప్పుడు తెలియని ఆమె యొక్క ఇంకో వైపు ఆ పదినిమిషాలల్లో కనబడినట్లు అనిపించింది. ఆమె మొండి వైఖరిని, పట్టుదల యొక్క ఎల్లల్ని స్పృశించి చూడాలన్న కోరిక కలిగింది.

మాటమార్చాడు. పైపై మెరుగులతో గడిపే సంబంధంగా కాకుండా, లోతుగా వేళ్ళు పాతుకుని నిలదొక్కుకునే సంబంధంగా జీవితాన్ని కొనసాగించాల్సిన ఆవశ్యకత గురించి, ఆదర్శ దంపతులకి మారుపేరుగా ఉండటం గురించి లెక్చర్ ఇస్తూ ఆఖర్న మెయిల్ వ్యవహారానికి వచ్చాడు.

"దీప్తీ! నీ అంతరంగాన్ని నేను గౌరవించాలని నువ్వు ఎదురు చూస్తున్నట్లు నా మీద నమ్మకం ఉంచి నువ్వు నడుచుకోవాలని నేనూ ఎదురు చూడవచ్చుకదా. డిలీట్ చేస్తానని చెప్పిన తర్వాత కూడా వెళ్ళకుండా నీ కళ్ళముందే ఆ పని చేయాలని నువ్వు ఆశించడం నా మీద నమ్మకం లేనందువల్లనే కదా!" సైకలాజికల్‌గా ఆమెను బెదిరిస్తున్నట్లుగా అన్నాడు.

"నీమీద నమ్మకం లేదని కాదు హనీ! నా మనస్సుకి సమాధానం కోసం." `అవును` అని చెప్పకుండా డొంక తిరుగుడుగా అన్నది.

"అందులో అసలు ఏం వ్రాశావు?" అన్నాడు ఆమె కళ్ళకేసి చూడకుండా. లోలోపల రగులుతున్న ఆసక్తిని కష్టపడి అణుచుకుంటూ సహజ ధోరణి ప్రదర్శించబోయి ఓటమి చెందాడు. ఆమె కళ్ళల్లో తీవ్రతను గుర్తించి "సరే, ఎవరి గురించి? అదైనా చెప్పు" అన్నాడు ఒక మెట్టు దిగివస్తూ.

"లేదు నిక్కీ. ఎవరి గురించైనా ఉండనీ? చెప్పమని నన్ను బలవంత పెట్టకు."

"బలవంత పెట్టడం లేదు దీపూ. నిర్మలకి నువ్వు వ్రాసిన ఉత్తరాన్ని నేను యాదృచ్ఛికంగా చూస్తే ఏమవుతుంది? దానికి నువ్వు ఇంత టెన్షన్ అవడం ఎందుకు? నిన్ను చూస్తే నాకు నవ్వొస్తోంది" అంటూ చిన్నగా నవ్వాడు. వేరే ఎవరి గురించో అయితే నేను చూడకూడదు అని ఇంత సీరియస్‌గా ఎందుకు ఉంటుంది? నా గురించే అయి ఉంటుంది. తను చదివే ఆల్ టస్ హక్లీ, రుష్‌జీలను నేను చదవను అని వ్రాసిందా? నా కన్న తన సంపాదన ఎక్కువనా? పడగ్గదిలో నేను తనని సుఖపెట్టడం లేదనా? నిర్మలకా లేక నిర్మల్‌కుమార్ కా?

"నేను తర్కించబోవటం లేదు నిక్కీ. ఆ ఉత్తరం నీకు రాసింది కాదు. కాబట్టి దాని గురించి నువ్వు తెలుసుకోవాల్సిన అవసరం లేదు."

నిశ్చలనంగా అన్న ఆమె మాటల్లో వెలువడిన పదును అతని అహాన్ని కుదిపి సవాలు చేసింది. బ్రతిమలాడుతుందని, దీనంగా వేడుకుంటుందని అనుకున్నదానికి బదులుగా గదమాయిస్తున్నట్లుగా అడుగుతున్న ఆమెను ఎలా ఎదుర్కోవడం? ధార్మిక బలం లేని, తన ఆలోచనలో తెలుసుకోవాలన్న ఆసక్తి మాత్రమే ఉన్నందువలన ఆమెను వేరే ఆయుధంతో ఎదుర్కోవాలనుకున్నాడు.

ముప్పై ఏళ్ళు నిండబోతున్నాయన్న అవసరంలో, మితిమీరిన సంపాదనని ఏం చేయాలో తెలియని గర్వంతో, ఇంటర్‌నెట్‌లో వెతికి, పరస్పరం ఫోటోలు మార్చుకుని, ఫోన్‌లో మాట్లాడి, సిన్మాహాలు చీకట్లో ప్రక్క ప్రక్కనే కూర్చుని, "ఏ అమ్మాయైన ఫరవాలేదు, పెళ్ళి చేసుకో' అని తల్లి తండ్రులు ఆశలు వదులుకోగా చేసుకున్న ప్రేమ పెళ్ళి ఇది.

"నీ అంతరంగాన్ని కాపాడుకోవడం మన ప్రేమ కన్నా ఎక్కువ ముఖ్యమైనదా?" అన్నాడు మృదువుగా.

ప్రేమ అన్న పదాన్ని అతని నోటినుంచి వినగానే ఆమె ముఖం వికసించింది. అది ఆమె అధికారం చెలాయించే రంగం. **అతను ఓడిపోతున్నాడని తెలియగానే మెరుపుకన్నా వేగంతో చేతులు చాపి అతని చేయిని పట్టుకుంది.** కళ్ళలోకి లోతుగా చూస్తూ అన్నది. "నువ్వేమనుకుంటున్నావో నాకు తెలుసు. నీ మీద ఒట్టు. నీ గురించి రాయలేదు. నన్ను నమ్ము."

తన మనసుని తొలిచేస్తున్న సందేహాన్ని ఆమె కుండబద్దలు కొట్టినట్లు చెప్పగానే అతను మౌనంగా ఉండిపోయాడు. అంతలో ఫోను మళ్ళీ గణగణమని మ్రోగింది. "నిఖిల్! అందరూ నీకోసం వెయిట్ చేస్తున్నారు."

అందరికీ అవసరమే. ఆఫీసుకి, భార్యకి, ఆమెను పూర్తిగా తెలుసుకోవాలనుకుంటున్న తనకు.

అతను మౌనంగా ఉండిపోయాడు. అంతకన్నా ఏం చేయగలడు? సభ్యతను అనుసరించి ఓటమిని ఒప్పుకోవడమా? భార్య అంతరంగాన్ని తెలుసుకోవాలన్న న్యాయమైన, ఆటవికమైన కోరికను అణచుకుని జెంటిల్ మాన్‌లాగా ముఖానికి రంగుపూసుకుని తిరాలా?.

"ప్లీజ్ రా. మెయిల్‌ని డిలీట్ చేసేయి" అన్నది గోముగా.

"దీప్తి! వాద వివాదం చేయడం కోసం అనడంలేదు. మన మధ్య రహస్యాలు వద్దు అనే అంటున్నాను." నిజంగానే అది నిర్మలకే వ్రాసిన ఉత్తరమే అయితే ఇక ఆమెను ఎలా ఎదుర్కోవడం?

గబగబా జి మెయిల్ ఓపెన్ చేసి తన పేరు టైపు చేసాడు. పాస్ వర్డ్ టైప్ చేసే ముందు లేచి నిలబడ్డాడు. "నువ్వే చేయి. నా పాస్ వర్డు చెప్తాను." ఓడిపోయే ముందు ఆమెను ఇబ్బంది పెట్టాలన్న ఉద్దేశ్యం అతనిలో ఎక్కువైయ్యింది. ఆమె వద్దన్నా వినకుండా బలవంతంగా కూర్చోబెట్టాడు. పాస్ వర్డు చెప్పాడు.

ఆమె మౌనంగా బటన్లను నొక్కింది. మెయిల్స్ వరసగా రాసాగాయి. అందులో ఆమె పేరు స్పష్టంగా కనబడింది. దానిని సెలెక్ట్‌చేసి ట్రాష్‌కి పంపింది. దాని కోసమే ఎదురు చూస్తున్నట్లు "ఇప్పుడు సంతోషమే కదా" అన్నాడు, ఆమెతో ఆయుష్షు పర్యంతమూ జీవితాన్ని గడపాలన్న అపాయానికి నెట్టబడిన ఫీలింగ్‌తో.

"ఒక్క నిమిషం" అన్నది నిదానంగా, ట్రాష్‌ని తెరిచి దానిని ఖాళీ చేసింది, ముందు జాగ్రత్తతో, వెనకే నిలబడ్డ అతను మండే అగ్నిగోళంలా... ఆ ఉష్ణం ఆమె వీపును తాకింది. తన మౌనంతో ఆమెను ఇంకా బాధించాడు.

"నా మీద కోపంగా ఉన్నావు కదూ" ఏదైనా మాట్లాడించాలన్న తపనతో ఆమె అన్నది.

"ఛా..... ఛా .. అలా ఏమీ లేదు. నువ్వు అన్నట్లు అది నాకు రాసినది కానప్పుడు దాని గురించి తెలుసుకునే హక్కు నాకు లేదు" పెద్ద మనిషి తరహా నటిస్తూ అన్నాడు.

"నిర్మలకి ఏదో ప్రోబ్లెమ్. డైవోర్స్ గురించి ఆలోచిస్తోంది. దాని గురించి మేము పరస్పరం వ్రాసుకున్న మెయిల్స్ నీ ఐ.డి.కి వెళ్ళిందని తెలిస్తే ఆమె చాలా అప్‌సెట్ అవుతుంది కదా. అందుకే నేను.."

హీనస్వరంతో మాట్లాడుతున్న దీప్తిని మధ్యలోనే ఆపాడు. "నాకు తెలియాల్సిన అవసరం లేదని అన్నానుగా."

అతని చెయ్యిని గట్టిగా నొక్కింది. "సరి, నేను బయలుదేరతాను. లేటయ్యింది" అన్నది. నగరంలో క్రొత్తగా ఒక హోటల్ ప్రారంభించినట్లు చెప్పింది. వచ్చే శుక్రవారం రాత్రి అక్కడకి వెళ్ళాలని అన్నది. అతను ఎయిర్ ఇండియా మహారాజులాగా వంగి ఆమెను గౌరవిస్తున్నట్లు అభినయిస్తూ "ఆజ్ఞ మహారాణీ! నా హృదయరాణి చెప్పిన తర్వాత నేను చెయ్యకుండా ఉండగలనా" అన్నాడు నాటకీయంగా. దీప్తి అతని చెంపమీద మురిపంగా వేళ్ళతో తట్టి "పోరా రాస్కెల్" అంటూ ఫ్లైయింగ్ కిస్ ఇచ్చింది.

ఆఫీసు మెట్లు దిగి చెట్టు నీడలో పార్కు చేసి ఉంచిన మారుతీకారు డోర్ తీసి లోపల కూర్చుంది. దీర్ఘంగా శ్వాస తీసుకుంది సెల్‌ఫోన్ తీసి నొక్కి - "విన్‌సెంట్! ఒక చిన్న సందేహం. మెయిల్ ఒకటి పొరబాటున డిలీట్ చేసేశాను. ట్రాష్‌కేన్ కూడా ఖాళీ చేసేశాను. ఆమెయిల్‌ను మళ్ళీ రిట్రీవ్ చేయడం సాధ్యమేనా?" అని అడిగింది.

లోపల నిఖిల్ ఫోన్‌లో "మూర్తీ! మెయిల్ ఒకటి పొరపాటున డిలీట్ చేసేశాను. ట్రాష్‌కేన్ కూడా ఖాళీ చేసేశాను. ఆ మెయిల్‌ను మళ్ళీ రిట్రీవ్ చేయడం సాధ్యమేనా?" అడుగుతున్నాడు..

# పై గొళ్ళెం

తమిళ మూలం: ఆర్. వెంకటేష్

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్


ఆర్. వెంకటేష్

ఎదురుగా **సుప్రియ** ఆడుకుంటోంది. ఆడుకుంటోంది అనడం కన్నా దాన్ని చూసి సంతోషపడుతూ ఉందని చెప్పడం సరి. పాతకాలపు ఏరోప్లేన్ ఆట. ఆమె కన్నా పెద్ద వయసున్న ఆడపిల్లలు ఆడుతుండగా, ప్రక్కనే నిలబడి గెంతులేస్తూ చూస్తూ నిలబడి ఉంది. ఆటలు అర్ధమయ్యే వయస్సు. నలుగురైదుగురు ఆడపిల్లలు.. ప్రక్కింటి ఎదురింటి పిల్లలు. సాయంత్రం ఎలా గడుస్తుందో తెలియని సంబరం.

పంకజం సుప్రియని నాలుగు గంటలకే తలదువ్వి, పవుడర్ వేసి, వేరే గౌను మార్చి వాకిట్లోకి తీసుకొచ్చింది. గంట ఐదున్నరో ఆరో అయి ఉంటుంది. కోడలు మాలతి వచ్చేసింది. ఇంకాసేపట్లో పద్మనాభన్ కూడా వచ్చేస్తాడు.

"నాన్నమ్మా! మచినీళ్ళు" దాహం కళ్ళలో ప్రతిఫలిస్తుండగా సుప్రియ వేగంగా పరిగెత్తుకుంటూ వచ్చింది. ప్రక్కనే బాటిల్‌లో ఉంచిన నీళ్ళు గబగబా త్రాగి అదే వేగంతో పరిగెత్తింది.

"చీకటి పడింది. లోపలికి వెళదామా ప్రియా"

"కాసేపట్లో వచ్చేస్తాను నాన్నమ్మా! సరేనా?"

మాటలు గాలిలో కలిసిపోయాయి. వేగంతో నిండిన పరుగు.. పంకజానికి లోపలికి వెళ్ళి చేసే పనులేమీ లేవు. మనమరాలి సాయంత్రం ఆటపాటల్ని దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్నం మూడు గంటలకే రాత్రి వంటకి కావాల్సిన ఏర్పాట్లను చేసేసింది. పొట్లకాయను తరిగిపెట్టింది. ఏడుగంటల తర్వాత వంట చేయడం మొదలుపెట్టినా, ఎనిమిది గంటలకన్నా భోజనానికి కూర్చోవచ్చు.

పంకజానికి ఎన్నో విధాలుగా ఈ ఇల్లు నచ్చింది. పద్మనాభన్ ఉత్తరం వ్రాసిన ప్రతిసారీ తల్లిని చెన్నైకి రమ్మని రాసేవాడు. భర్త, రెండోకొడుకు, ఇల్లులాంటి బంధాలు కాళ్ళకి చుట్టుకున్న తాడులాగా పంకజాన్ని సులభంగా బయలుదేరటం సాధ్యం కానీయకుండా చేసాయి. ఇంతకీ పద్మనాభన్ ఇంటికి పెద్ద కొడుకు. అతని ఇంటికేరావటం కుదరలేదని అంటే ఎవరూ నమ్మరు.

ఈసారి పూర్తిగా పదిరోజులు అవకాశం దొరికింది, ఎవరో సెలవులు ఇచ్చినట్లు. వేరే ఊర్లో ట్రైనింగ్ అని పంకజం భర్త బయలుదేరాడు. చిన్నకొడుకు "నేను హోటల్లో చూసుకుంటానమ్మా. నువ్వు వెళ్ళి నీ సీమంత పుత్రుడితో, అతని గారాల కూతురుతో కాస్త సరదాగా గడిపిరామ్మా" అనగానే పంకజం మధురైనుంచి బయలుదేరింది.

ఇక్కడికి వచ్చినప్పుడు చాలా ఆశ్చర్యంగా సంభ్రమంగా అనిపించింది. పద్మనాభన్, మాలతి పొందికగా, చూడముచ్చటగా సంసారం చేసుకుంటున్నారు. పొదుపు, కుదురు ప్రతి ఒక్క విషయంలోను ప్రతిబింబిస్తున్నాయి. కొత్తకాపురం, మనమరాలి బారసాల అంటూ అప్పుడప్పుడూ వచ్చి వెళ్ళినా, ఇలా ప్రక్కనే ఉండి వాళ్ళ సంసారాన్ని చూస్తున్నప్పుడు ఆశ్చర్యంగా అనిపించింది. నేను పెంచిన పద్దూయేనా? ఎప్పుడు చూసినా ఆటపాటలతో, క్రికెట్ బాట్‌తో తిరిగినవాడేనా? ఇంత బాధ్యత, నేర్పు ఎలా వచ్చాయి?

ఆ మధ్య చిన్న కొడుకు ఏదో ఇంటర్వ్యూకోసం ఇక్కడికి వచ్చినపుడు అన్నా వదినలతో ఒక వారం గడిపి వచ్చిన తర్వాత ఒకటే పొగడ్తలు. ఆనాటితోనే......

"మన పద్దూయేనా అని నాకు సందేహం వచ్చేసిందమ్మా. ఏం చెప్పమంటావు? తనే బట్టలు ఉతికి ఆరేస్తున్నాడు. పాపకి స్నానం చేయించి బట్టలు మారుస్తున్నాడు. అన్నిటికన్నా ముఖ్యంగా కమ్మగా వంట చేస్తున్నాడు. క్రికెట్టే గతి అని పడి ఉన్న పద్దూయేనా అని నాకే సందేహం వచ్చిందనుకో" అన్నాడు.

పంకజానికి ఇందులో ఆశ్చర్యంగా ఏమీ అనిపించలేదు. తెలియదు, చేతకాదు అంటూ చేతులు ముడుచుకుని ఉంటే ఎలా సాగుతుంది? ఒక నిర్బంధం ఏర్పడితే దాంతోపాటు పనీపాట నేర్పరితనమూ అన్నీ వచ్చేస్తాయి. అంతే.

కాని ఈ ఇంట్లో పంకజానికి ఇబ్బంది కలిగించిన విషయం వేరే ఒకటి ఉంది. వాకిటి తలుపు....

పంకజం ఊర్నించి వచ్చిన రోజే పద్మనాభం వాకిటి తలుపుకు పై భాగంలో ఇంకో గొళ్ళెం పెట్టించాడు. క్రింది గొళ్ళెం పాపకి అందుతోందని, తనే వెళ్ళి గొళ్ళెం తీసి బైటకి వెళ్ళిపోతున్నదని కోడలు మాలతి అన్నది.

"లోపల పనిమీద ఉన్నప్పుడు పాప ఎక్కడ ఉందో తెలియడం లేదు. ఈ మధ్య చప్పుడు చేయకుండా తనే తలుపులు తీసేసి బైటకి వెళ్ళడం మొదలుపెట్టింది. ఒకరోజు చాలా భయపడ్డాను అత్తయ్యా! వాకిట్లోకి వెళ్ళి నడిరోడ్డుమీద నిలబడి దిక్కులు చూస్తోంది. రావే అని పిలిస్తే రానని మొండికేసింది. ఏం చెప్పమంటారు? వట్టి పెంకిఘటం."

అమ్మ తన గురించి చెపుతున్న పుకార్లు వింటున్న సుప్రియ అవును అన్నట్టుగా తల ఊపింది. "అలా చేయకూడదమ్మా" అని పంకజం అన్నప్పుడు "చేస్తాను" అన్నది. మూడేళ్ళు నిండాయి. అన్నీ అర్థమవుతున్నాయి. తనకంటూ ఒక బాణీ, హక్కును వదులుకోకూడదన్న మొండితనం.

మొదటి రెండురోజులు కబుర్లతోనే కాలం గడిచిపోయింది. అమ్మ వచ్చిన సంతోషంలో పద్మనాభం ఆఫీసుకి సెలవు పెట్టాడు. అమ్మని పిలుచుకుని తిరువేర్కాడు, మాంగాడు, పాండీబజారు, రంగనాథన్ వీధి అని ఊరంతా తిప్పి చూపించాడు. మూడో రోజు ఆఫీసుకి బయలుదేరే ముందు మనవరాలి తానే చూసుకుంటానని - క్రెచ్ కి పంపవద్దని పంకజం అన్నప్పుడు మాలతితో పాటు పద్మనాభన్ ఆలోచనల్లో పడ్డాడు.

"ఉంటుందంటావా అమ్మా!" అన్నాడు పద్మనాభం.

"ఉండకుండా ఏం చేస్తుంది? భేషుగ్గా ఉంటుంది."

"ఒకటే గొడవ చేస్తుంది. కళ్ళల్లో వత్తులు వేసుకుని మరీ చూసుకోవాలి."

"సరేలేరా. చూసుకుంటాను. నువ్వు ఆఫీసుకు బయలుదేరు."

సుప్రియ పెంకిఘటం కాదు. చుట్టూ బొమ్మల్ని పెట్టుకుని ఆడుకునే పిల్ల. బొమ్మలకి కథలు చెప్పింది. అన్నం తినిపించి మూతి తుడిచింది. మంచి నీళ్ళు త్రాగించింది. వళ్ళో వేసుకుని నిద్రపుచ్చింది. కాస్సేపట్లో తనే టీచరమ్మ అయ్యింది. చేతిలో బెత్తం పుచ్చుకుని పాఠాలు చెప్పింది. కొన్ని బొమ్మల్ని బెదిరించింది. కొన్నిటిని "గుడ్ గర్ల్" అని పొగిడింది. ఆ ఆట బోర్ కొట్టిందేమో ఒక వార పత్రికను తీసి వళ్ళో పెట్టుకుని తెరిచి బొమ్మల్ని చూసింది. అర్ధనగ్నంగా ఉన్న సినీ తారల్ని చూసి "షేమ్ షేమ్" అన్నది.

అప్పుడప్పుడు నాయనమ్మ వచ్చి తొంగి చూసినప్పుడు సిగ్గుపడుతూ నవ్వింది. పదిన్నరకి పాపకి అన్నం తినిపించినప్పుడు కష్టంగా అనిపించలేదు. ఆ తర్వాత వడిలో పడుకోబెట్టుకుని జోకొడుతూ టివీ చూస్తుండగా కాస్సేపట్లో నిద్రపోయింది. లోపల మంచం మీద పడుకోబెట్టి నిద్రలో పొర్లకుండా ప్రక్కన ఎత్తుగా తలగడలను పెట్టింది పంకజం.

మంచి నిద్ర. పాప లేచినప్పుడు గంట మూడున్నరో నాలుగో అయ్యింది. హార్లిక్స్ తాగిన తర్వాతే ఆ ప్రహసనం ప్రారంభమయ్యింది. బొమ్మలు నచ్చలేదు. పుస్తకాలు నచ్చలేదు. టీచరమ్మ ఆట అసలుకే నచ్చలేదు. అన్ని ఆటలూ ఒక్కో నిమిషం ఆడుకున్న తర్వాత ఏమీ తోచనట్లు అటూ ఇటూ తిరిగింది.

కాస్సేపు నాన్నమ్మ చపాతీలు చేయడాన్ని, పెనం మీద వేసి కాల్చడాన్ని చూస్తూ కూర్చుంది. ప్లేటులో పెట్టి ఇచ్చిన చపాతీ ముక్కల్ని తిని చేతులు కడుక్కుని నేరుగా వాకిట తలుపు దగ్గర నిలబడింది. క్రింది గొళ్ళెం తీసి తలుపులు తీయడానికి ప్రయత్నించింది. తలెత్తి పైకి చూసింది. కొత్త గొళ్ళెం చూడగానే ఏడుపు ముంచుకొచ్చింది.

పంకజానికి కాళ్ళూ చేతులు ఆడలేదు. ఇంట్లో పనులన్నీ అలాగే ఉన్నాయి. ఎంత సమాధానపరచినా సుప్రియ వినలేదు.

"ఈ క్షణం నేను బయటకి వెళ్ళాలి. తలుపు తీయి." ఒకే పాట.

రెండే నిమిషాలల్లో పనులన్నీ అలాగే వదిలేసి వాకిటి తలుపును తెరిచింది పంకజం. బైటినుంచి క్రొత్తగాలి వచ్చి ముఖాన్ని తాకగా, సుప్రియ వాకిట్లోకి పరిగెత్తింది.

ఆమె వయస్సు పిల్లలు, కాస్త పెద్ద, చిన్న పిల్లలుతో కూడిన ఒక గుంపు బైట కనబడింది సుప్రియ చప్పున వెళ్ళి వాళ్ళతో కలిసిపోయింది. ముఖంలో వింత మెరుపు, తేజస్సు, పట్టలేని సంతోషం. బొమ్మలు, పుస్తకాలు ఇవ్వని ఉత్సాహం, తోటి మనుషుల సావాసం, అది ఇచ్చే ఆనందం, తృప్తి.

అప్పుడప్పుడూ తాను అక్కడే ఉన్నానని, భయపడవద్దని చేతులు ఊపడం, పరిగెత్తుకుంటూ వచ్చి చూసి వెళ్ళడం...

కాసేపట్లో మాలతి వచ్చేస్తుంది. నచ్చచెప్పుకోవచ్చు. ఇప్పుడు అన్నిటికన్నా ముఖ్యం సుప్రియ ఆడుకోవడం.

పద్మనాభన్ నాన్నగారు కూడా ఇలాగే చెప్పేవారు. పద్దు, చిన్నవాడు కలిసి ఆడని మేచ్‌లు, గేమ్స్ లేవని చెప్పవచ్చు. అన్నిటికీ వాళ్ళ నాన్నగారే తోడుగా వెళ్ళేవారు. కొడుకుల గెలుపు ఆయనకి సంతోషం. ఇంతకీ ఆయనకి క్రికెట్ గురించి పెద్దగా ఏమీ తెలియదు. చిన్నవాడు తండ్రిని ఎగతాళి చేసేవాడు. అయినా కూడా పిల్లల్ని ఆటలకి పంపించడం ఆయనకి ముఖ్యమైన విషయం.

ఇక్కడ తాను ఉన్నంతవరకూ సాయంత్రాలలో ఇంటిపనులన్నీ త్వరగా ముగించుకుని పాపను ఆడుకోవడానికి బైటకి తీసుకెళ్ళాలని పంకజం నిశ్చయించుకుంది.

మర్నాడు ఏదో మాటల సందర్భంలో మాలతితో ఈ విషయాన్ని చెప్పింది పంకజం. ఆమె పెద్దగా ఆసక్తి కనబర్చలేదు. అదంత ముఖ్యమైన విషయం కాదన్నట్లు చూస్తూ "తనకి ఇంటినిండా బొమ్మలు, గేమ్స్ ఉన్నాయిగా, వాటితో ఆడుకోవచ్చుకదా!" అని అంది.

"ఎంత సేపని బొమ్మలతో ఆడుకుంటుంది?" అన్నది పంకజం.

"ఈమెతో ఆడుకోవడానికి మనుష్యుల్ని వేరే వెతుక్కోవాలా? మనతోనే ఆడుకోవాలి."

"మనం దానికి సాటి అవుతామా? ఆమె ఈడుపిల్లలే ఆమెకు జోడి."

మాలతి జవాబు చెప్పలేదు. పరీక్ష పేపర్లు దిద్దడానికి కూర్చుంది. రాత్రి భోజనాల సమయంలో మళ్ళీ ఈ ప్రస్తావన వచ్చింది.

"నేను నా క్లాసులోనే చూస్తున్నానత్తయ్యా. ఆటలు పాటలు అని వెళ్ళే పిల్లలు ఒక్కరు కూడా మంచి మార్కులు తెచ్చుకోవడం లేదు. ఏదో నూటికో కోటికో ఒకరిద్దరు ఎక్స్‌ట్రార్డినరీగా బాగా చదువుతూ, ఆటల్లోనూ రాణిస్తారు. చాలా మందికి చదువే అబ్బడం లేదు."

పంకజం జవాబు చెప్పలేకపోయింది. మాలతి చెప్పిందాంట్లో నిజం లేకుండా పోలేదు. కాని పంకజం ఆలోచనలు వేరు.

"నేను అలా చెప్పడం లేదు మాలతీ! కాని నలుగురితో కలిసి మెలిసి తిరగడం... ఆడుకోవడం..."

"అర్థమవుతోందత్తయ్యా. కాని ఇప్పుడు మనం ఏది నేర్పిస్తామో పిల్లలకి అదే వస్తుంది. ఆటలు నేర్పిస్తే ఆటలు వస్తాయి. చదువు నేర్పిస్తే చదువు వస్తుంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో చదువు లేకపోతే చాలా కష్టం అత్తయ్యా. మీరే చూడండి. ఎం.ఎస్సి కెమిస్ట్రీ, ఎం.ఫిల్ చదివాను. పేరుకు పి.జి. టీచర్ అయినా ఏమంత గుర్తింపు ఉందని?"

జవాబు తెలియనట్లు పంకజం మౌనం వహించింది. జీవితానికి కావాల్సిందేమిటి అన్నప్రశ్నకి జవాబు వెతుక్కోవడంలో ఏర్పడే తేడాయేనా ఇది? బ్రతికి ముగిసిన తన కథ ఇకపై ఉపయోగపడదేమో?

"ఈ కాలంలో ఎంత చదివినా చాలదత్తయ్యా. ఒకటి డబ్బు, అంతస్తు ఉండాలి. లేదా ఎవరూ చదవనంత పెద్ద చదువులు ఉండాలి. అప్పుడే కొంచెం నమ్మకంతో జీవితం గడపవచ్చు. నాకాలంలోనే ఎం.ఏ, ఎం.ఎస్సి లకి విలువలేకుండా పోయింది. ఇక సుప్రియ కాలంలో ఎలా ఉంటుందో ఆలోచించి చూడండి."

మౌనంగా ఉండటం తప్ప వేరే దారిలేదు. ఈ కాలపు విలువలు ఇవేనేమో. తను చాలా పాతబడిపోయి కాలాతీతమైపోయిందేమో.

"ఏంటమ్మా? ఇక్కడే కూర్చున్నావు. లోపలికి వెళ్ళలేదూ?"

పద్మనాభన్ వచ్చేసాడు. మోటర్ సైకిల్ని లోపల పెట్టాడు. ట్రాఫిక్‌లో వచ్చిన అలసట, నలిగి, మాసిపోయిన దుస్తులు.

"పాప ఆడుకుంటోందిరా. అదుగో చూడు. నేను తనని పిలుచుకుని వస్తాను. నువ్వు లోపలికి వెళ్ళు."

పద్మనాభన్ ఒక్క నిమిషం నిలబడి సుప్రియ వైపు చూశాడు. నియాన్ వెలుతురులో పిల్లలు దాగుడు మూతలు ఆడుతున్నారు. నాన్న వచ్చింది సుప్రియ ఇంకా చూడలేదు. ఏదీ చెప్పకుండా లోపలికి వెళ్ళిన పద్మనాభం పదినిమిషాలకల్లా బట్టలు మార్చుకుని వాకిట్లోకి వచ్చాడు. తల్లి ప్రక్కనే కూర్చున్నాడు. ఆడుకుంటున్న పిల్లల్ని తదేకంగా చూసాడు.

"ఏమిట్రా అలా చూస్తున్నావు?"

"పాప ఇలా ఆడుకుంటుండగా చూసి ఎన్ని రోజులైంది అని ఆలోచిస్తున్నాను."

భారమైన మౌనం అక్కడ వ్యాపించింది. తన యవ్వనం, వేగం పదును తగ్గిపోయాయేమో అన్న సందేహంగా భయంగా అనిపించింది పద్మనాభంకు. జీవితపు పరుగు పందెంలో తన అవసరాలు ఎలా మారిపోతూ వచ్చాయో అర్థమయ్యింది. అవసరాన్ని బట్టి ముఖ్యత్వం. కోరికలకు తగ్గట్టుగా కాదు.

"పద్దూ! ఇప్పుడు క్రికెట్ ఆడుతున్నావా?"

"లేదమ్మా. కొన్ని రోజులు ఆఫీస్ టీములో ఉన్నాను. ఆ తర్వాత కంటిన్యూ చేయలేకపోయాను. "

"ఏమయ్యింది?"

"ప్రాక్టీసు, మేచ్ అంటూ తిరగాలి. కుటుంబం, పిల్లలు అవి అయిన తర్వాత ఏది ముఖ్యం అన్న సమస్య వచ్చింది. ఏదో ఒకదాన్ని వదులుకోవాలన్న నిర్భంధం. నేను క్రికెట్‌ని వదిలేశాను. ఎప్పుడైనా పాత జ్ఞాపకాలు వస్తే వెళ్ళి ఆడుతున్నాను. కాని సీరియస్‌గా మాత్రం కాదు."

పంకజానికి మౌనమే శరణ్యమైంది. కోరికలను అణగద్రొక్కడంలో జీవితానికి అంత సంతోషం ఎందుకు? దాన్ని అతిక్రమించి కోరికలను దక్కించుకోవడం సాధ్యమేనా?

"ఇప్పుడు ఆలోచిస్తే నాన్నగారు ఎంత గొప్పవారో అర్థమవుతోంది."

"ఏమయ్యింది?"

"నేనేదో పెద్ద క్రికెటర్ అవుతానని అనుకుని, బ్యాంకుకి సెలవు పెట్టి నాతో అన్నిచోట్లకీ వచ్చేవారు. నేను పాపకోసం ఒక్కరోజు కూడా సెలవు పెట్టింది లేదు. పాపకేదైనా ఒంట్లో బాగోలేనప్పుడు కూడా మాలతి సెలవు పెట్టి చూసుకుంటుంది."

ఆ మాటల్లో ప్రతిఫలించిన ఆశక్తత పంకజానికి అర్థమయ్యింది.

మర్నాడు ఏదో సెలవు. పద్మనాభన్ ఇంట్లోనే ఉన్నాడు మధ్యాహ్నం తర్వాత సుప్రియ ఏడవసాగింది. పంకజం పనులన్నీ ముగించుకుని పైగొళ్ళెం తీయబోతుండగా పద్మనాభన్ అడ్డుకున్నాడు.

"ఏమైయ్యింది?"

"వద్దమ్మా. నువ్వు ఇలా బయటకి తీసుకెళ్ళి అలవాటు చేసేస్తావు. ఆ తర్వాత తను రోజూ బైటకి వెళ్ళాలని గొడవ చేస్తుంది. ఎవరు తీసుకు వెళతారు చెప్పు? ఇంకో రెండు మూడు రోజుల్లో నువ్వు ఊరికి వెళ్ళిపోతావు. ఆ తర్వాత మేము అవస్థపడాలి. ఇంట్లోనే ఉండనీ. ఏడ్చి ఏడ్చి తనే ఊరుకుంటుంది. బైటకి వెళ్ళి ఆడుకోకపోతే ఏమీ కొంప మునిగిపోదు."

మూడోరోజు పంకజం మధురైకి బయలుదేరింది. మళ్ళీ పైగొళ్ళెం గట్టిగా వేయబడింది.

# బోడి

తమిళ మూలం: జయంతన్

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్




మీరు కావాలనుంటే ఇప్పుడు కూడా ఆమెను ఆ గ్రామంలో చూడవచ్చు.

కాస్త పొట్టిగా కనిపించే రూపం. ఎత్తు లేకున్నా మరీ లావు అనిపించని ఆకృతి. వంటి మీద ముతక చేనేత చీర. పచ్చ రంగు లేదా నీలం.

రవిక వేసుకునే అలవాటు లేదు. వెంటనే మీరు అదోలాంటి ఆలోచన్లకి పరుగుపెట్టకండి. పైట ఎల్లవేళలా స్థానభ్రంశం చెందకుండా పొందికగా ఉంటుంది. రవిక కూడా ఎప్పుడైనా తన బాధ్యతను విస్మరించడం జరుగుతుందో ఏమో. ఇది మాత్రం చెక్కు చెదరదు.

ఛామన ఛాయ, వయస్సు ముప్పై లేదా ముప్పై రెండు. బోడి తల, దానిమీద ఒక ఇత్తడి బిందె. చంకలో ఒక బిందె. అంతే, ఈ గెటప్‌లో ఆ ఊరిలో వేరే ఎవరూ లేరు. ఊరికీ నీళ్ళ బావికి మధ్య పదినిమిషాలకొకసారి ఆమెను చూడవచ్చు.

దగ్గరికి వెళ్ళి చూసారంటే ఆ ముఖంలో ఆడతనపు ఛాయలు, అందంలాంటి లక్షణాలు ఏమీ ఉన్నట్లు పెద్దగా కనబడవు. మరీ అనాకారి కాదు. కాని ఒక స్త్రీగా ఆమెను ఎవరైనా గుర్తించి దరికి చేరుతారా అన్న సందేహం మీకు రాకపోదు.

ఇంటింటికి నీళ్ళు తెచ్చి నింపడమే ఆమె వృత్తి. ఎవరైనా అడిగితే లేదా నిర్బంధిస్తే ఆ ఇంట్లో నాలుగు అంట్లు తోమడమో లేక పిల్లల బట్టలు ఉతికి పెట్టడమో చేస్తుంది. వేరే ఏ పనీ చేయదు.

కాని ఈ వృత్తిని ఆమె స్వీకరించిన ధోరణి కాస్త ఆశ్చర్యకరమైనది. ఆమె రాకపోకలను చూస్తే నీళ్ళు మోయకుండా ఆమె ఉండలేదేమోనని అనిపిస్తుంది. ఇంత చేసినా నెలకి ఆమెకి దొరికేది పాతికో పరకో. కాని ప్రొద్దున్న ఆరుగంటలకి బిందెలను నెత్తి మీద ఎక్కించుకుందంటే మళ్ళీ వాటిని దింపడానికి రాత్రి ఏ ఎనిమిదో తొమ్మిదో అవుతుంది. ఊళ్ళోకి నీళ్ళ బావికి మధ్య నడక... నడక... నడక. ఎప్పుడు వండుకుంటుందో ఎప్పుడు తింటుందో ఎవరికీ తెలియదు. కాని ఒక్క రోజు కూడా తన కాయకష్టం గురించి విసుక్కుంది లేదు. తను తాగే గంజి నీళ్ళకి ఇలా నీళ్ళు మోసుకుంటూ నడిచే శక్తి ఎక్కడ్నించి వస్తుందో ఆ భగవంతుడికే తెలియాలి.

బోడి అన్నది అకారణంగా వచ్చిన పేరు. ఆమె అసలు పేరు చాలా మందికి తెలియను కూడా తెలియదు. అసలు పేరు గుర్తుకూడా రాని విధంగా ఈ పేరు చాలా ప్రసిద్ధి చెందింది. పేను కొరుకుడికి భయపడో, కొబ్బరి నూనె ఖర్చుకి వెనకాడో చీటికి మాటికి గుండు చేయించుకుంటుంది. అర సెంటిమీటర్ పొడువుకు మించిన జుట్టుతో ఆమెను చూసినవాళ్ళు గత పదేళ్ళుగా ఈ ఊళ్ళో ఎవరూ లేరు. ఇలాంటి గౌరవం తక్కువైన పిలుపుకి సాధారణంగా ఎవరైనా కాస్త చిన్న బుచ్చుకోవడం సహజం. కాని అలాంటి భావం ఏమీ ఆమె ముఖంలో కనబడదు. 'ఉన్న నిజాన్నే కదా మీరు చెపుతున్నారు' అన్న రీతిలో ఉంటుంది ఆమె ధోరణి. ఊర్లో ఉన్న చిన్న చితకా కూడా ఆమెను నోటినిండా "బోడీ!" అనే పిలుస్తారు.

ఆమె ఐదు ఇళ్ళకి నీళ్ళు మోసి పని ముగించిన తర్వాత ఆరో ఇంటిని ఒప్పుకున్నప్పుడు పాత ఖాతాదార్లందరూ అభ్యంతరం తెలిపారు.

"ఇప్పటికే నిన్ను పిలవడానికి ఓ మనిషిని పంపించాల్సివస్తోంది. ఇంకా ఒక ఇల్లు ఒప్పుకున్నావంటే ఇక మా పని అయినట్లే" అని అన్నారు.

కోమట్లమ్మ ఇంట్లోకి బోడి వెళ్ళిందంటే ధనలక్ష్మికి ఒక్కొక నిమిషమూ ఒక యుగంగా గడుస్తుంది. ఇంకెంత సేపు ఎంత సేపంటూ కారాలు మిరియాలు నూరుతుంది. ఈ విషయం కోమటి భార్య ఉమ్మెయాళ్ళమ్మకీ తెలుసు. ఆమెకు కొండెక్కినంత సంబరం. ధనలక్ష్మి మాడి మసై చావనీ అన్నట్లు బోడిని త్వరగ పోనీయకుండా ఆపుతుంది. "ఇంకో రెండు బిందెలు" అని పురమాయిస్తుంది. లేదా "కాస్త  ఆ పంచెను ఉతికి ఆరేసి వెళ్ళు" అని పనులు అప్పచెపుతుంది.

ఈ సంఘటన మర్నాడు అలాగే తల్లక్రిందులుగా జరుగుతుంది. ఈసారి బోడి ధనలక్ష్మి ఇంట్లో చిక్కడిపోయి ఉంటుంది. అక్కడ కోమట్లమ్మ అగ్గిమీద గుగ్గిలం అయిపోతూ ఉంటుంది. దాన్ని తలుచుకుంటూ ధనలక్ష్మి లోలోపల సంతోషపడుతూ ఉంటుంది.

కోమట్లమ్మ ఇల్లు బోడి నీళ్ళు తెచ్చే దారిలోనే ఉంది. కాస్త ఆలస్యం కాగానే కోమట్లమ్మ అరుగు పక్కనే కనీ కనిపించనట్లు నిలబడి కాపు కాసి బోడి వచ్చేటప్పుడు "ఒసే బోడీ.." అని లోగొంతుకతో గద్దిస్తుంది.

కోమట్లమ్మ మాత్రమే కాదు. ఎవరు గద్దించినా, బెదిరించినా బోడి దగ్గర ఒకే సమాధానం.

"ఇదిగో వస్తున్నానమ్మా"

కాని రాదు. ఏ ఇంటి కోసం నీళ్ళు మోస్తోందో ఆ ఇల్లాలు "ఇక చాల్లే" అన్న తర్వాతే ఇంకో ఇల్లు.

ఇందువల్ల కొంతమంది కోపం తెచ్చుకుని బోడి రాగానే "నువ్వు రానక్కరలేదు. మేము వేరే మనిషిని చూసుకుంటాము" అని తరిమేస్తున్నట్లుగా మాట్లాడిన సందర్భాలుకూడా ఉన్నాయి. కాని బోడి వాళ్ళని వదలదు.

"ఏం చెయ్యనమ్మా.. ఏం చెయ్యనమ్మా" అంటూ అలాగే నిలబడుతుంది. వాళ్ళ కోపం కాస్త చల్లారి ఉంటుందని అనిపించిన తర్వాత చనువుగా లోపలికి వెళ్ళి బిందెనో, కుండనో తీసుకుని బయలుదేరుతుంది. వాళ్ళు కూడా 'పోనీలే' అన్నట్లు చూసీ చూడనట్లు ఉంటారు.

ఏది ఏమైనా ఆమె మీద ఆ ఊరి వాళ్ళకి లోలోపల కాస్త ప్రేమ లేకపోలేదు. ***చెడు అంటే ఏమిటో తెలియని అమాయకపు ప్రాణిపై ఉండే ప్రేమ.*** అదీగాక ఈ ప్రాణి తమ కోసం తక్కువ ఖర్చులో నీళ్ళు మోస్తోంది కదా.

ఆమె ఒక ఒంటరి వృక్షం.

కాని ఆరేడేళ్ళకు ముందు ఆమెకు భర్త, ఇద్దరు కొడుకులు ఉండేవాళ్ళు. మొదట ఆమె భర్త ఆమెను విడిచిపెట్టి వెళ్ళిపోయాడు. ఆ తర్వాత ఒకరి వెంట ఒకరుగా చిన్నవాడు రోగంతోనూ, పెద్దవాడు నీట్లో మునిగిపోయి చనిపోయారు.

చిన్నవాడికి విచిత్రమైన రోగం వచ్చింది. మూడేళ్ళు నిండిన పిల్లాడికి ఆ రోగం రాగానే శరీరం కుంచించుకు పోసాగింది. సంవత్సరం తిరిగే సరికల్లా అతను మళ్ళీ ఏడాది పిల్లవాడిగా అయిపోయాడు. కడుపు మాత్రం ఏడేళ్ళ పిల్లవాడికి ఉండేటట్లు పెద్దగా ఉండేది. అతను బ్రతుకుతాడని ఎవరికీ నమ్మకం లేదు. ఆ మాటకొస్తే ఆమెకీ ఉండటానికి ఆస్కారం లేదు. నీళ్ళు మోసేటప్పుడు మధ్యలో వచ్చి ఏదైనా తినిపించి వచ్చేది. ఆ పిల్లవాడు చనిపోయినప్పుడు పెద్దగా బాధపడినట్లు కనిపించలేదు.

పెద్దవాడికి ఏడెనిమిదేళ్ళు బర్రెల్ని కాస్తూ ఉండేవాడు. ఓసారి బర్రె మీద సవారీ చేస్తుండగా అది కాస్తా ఏట్లోకి పరిగెత్తుకుంటూ వెళ్ళింది. నీళ్ళలో పడిపోయిన పిల్లవాడికి ఈతరానందున అలాగే మునిగి చనిపోయాడు. అప్పుడు మాత్రం ఆమె రెండు రోజులో మూడు

రోజులో మైలపట్టినట్లు కనపడింది. ఆ తర్వాత ఈ నీళ్ళు మోసేపని, అందులో దొరికే సంతోషం ఉన్నప్పుడు ఎవరు పోతే ఏమైంది అన్నట్లుగా అలవాటు చొప్పున నీళ్ళ బిందెను మోయసాగింది.

ఆ తర్వాత ఆ ముగ్గురి గురించి ఆమె మాట్లాడగా ఎవరూ చూడలేదు. లేదు... లేదు. మొగుడి గురించి ఒకసారి మాట్లాడింది. రెండు సంవత్సరాల క్రితం ఆమె మొగుడు మళ్ళీ ఆ ఊరికి వచ్చాడు. ఎవరూ ఎదురు చూడని విధంగా కొత్తగా ఒక వృత్తిని చేపట్టాడు.

ఒక చిన్నపిల్లవాడి తలమీద కాళికాదేవి విగ్రహాన్ని పీఠం మీద పెట్టి, చేతిలో కుంకుమ నిండిన పళ్ళెం ఇచ్చి, తను ముందుగా నడుస్తూ, కాళ్ళకి గజ్జెలతో ఆడుతూ, చేతిలో ఉన్న కొరడాతో చెళ్ళు చెళ్ళుమని ఒంటి మీద దెబ్బలు కొట్టుకుంటూ డబ్బులు అడుక్కుంటూ వచ్చాడు.

అతన్ని గుర్తుపట్టిన పిల్లలు పరిగెత్తుకుంటూ వచ్చి "బోడీ! బోడీ! నీ మొగుడు వచ్చాడు" అని చెపుతూ అతను వచ్చిన వైనం తెలిపారు. అంతా విన్న తర్వాత కాస్సేపు అలాగే శూన్యంలోకి చూస్తూ నిలబడిన బోడి చివరగా అంది. "పోతే పోయాడు పోగాలపు సచ్చినాడు."

ఇలాంటి మనిషి ఒకరోజు తన వృత్తిని వదిలి వెళ్ళిపోయింది.

ఒకరోజు చెల్లెలు ఇంట్లో ఏదో విశేషం అని బయలుదేరి భువనగిరికి వెళ్ళింది. రాత్రి రైలుకే తిరిగి వచ్చేస్తానని, ఒక్కరోజు మాత్రం ఎలాగో సర్దుకోమని అందరితో చెప్పి వెళ్ళిన మనిషి ఆ తర్వాత రానే లేదు.

ఒక వారం తర్వాత ఆమె గురించి కబురు తెలిసింది. ఆ ఊళ్ళోనే కొత్తగా ప్రారంభించిన కాకా హోటల్లో బోడి పిండి రుబ్బడానికి, అంట్లు తోమడానికి పనికి కుదురుకున్నట్లు ఎవరో చెప్పారు.

ఇక్కడ ఖాతాదార్లంతా తల్లడిల్లిపోయారు. ఇక మీద బోడి పన్లోకి రాదు అని తెల్సిన తర్వాత నీళ్ళు మోయడానికి ఎవరైన దొరుకుతారేమోనని వాకబు చేసారు. వాళ్ళు మూడు రెట్లు జీతం అడగడమే కాకుండా పన్లోకి రావడానికి ముందే ఇన్ని బిందెలు మాత్రమే తెస్తామని కండిషన్లు పెట్టారు. వాళ్ళకి ఎలా తెల్సిందో తెలియదు గాని "మేస్త్రిగారింటి నీళ్ళ తొట్టె ఇరవై బిందెలు పడుతుందట కదా" అని అన్నారు. "నర్సమ్మ ఊరికే నీళ్ళు క్రింద పారబోస్తుందట" అని కూడా అన్నారు.

ఆ తర్వాతే బోడి యొక్క గొప్పతనం, చవకలో పని చేసిన వైనం ఊరి వాళ్ళకి అర్ధమైంది.

పదిహేను రోజుల తర్వాత బోడి పనికి చేరిన కాకా హోటల్ యజమాని ఎవరు అని తెలిసింది. అతను కూడా ఈ ఊరి వాడే సాక్షాత్తూ మాణిక్యం!

నలభై ఏళ్ళు పై బడిన మాణిక్యానికి భార్య ఎప్పుడో పోయింది. పిల్లా జెల్లా కూడా లేరు. తెలిసిన వృత్తి వంట మాత్రమే. అక్కడా ఇక్కడా వంట చేస్తూ కాలం గడిపాడు. మొదటి భార్య పోయిన తరువాత ఎవరూ పిల్లని ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో బాటు, ఎవరినీ పిల్లని అడిగే స్తోమత తనకి లేదని అతనే అనుకున్న కారణంగానూ అలాగే ఉండిపోయాడు. ఏడెనిమిది సంవత్సరాల క్రితం ఊరు వదిలి వెళ్ళిన మనిషి ఎలాగో కాస్తో కూస్తో కూడబెట్టి కాకా హోటల్ పెట్టాడు కాబోలు.

మరుసటి వారం అతనే ఊళ్ళోకి వచ్చాడు. అతనికి భువనగిరిలో ఉన్న బోడి చెల్లెల్ని తెలుసట. అక్కడే ఉండమని బోడిని చెల్లెలు బలవంతం చేసిందట. అతన్ని అడిగినప్పుడు బోడి అక్కడ బాగానే ఉన్నట్లు చెప్పాడు.

సుమారు రెండు నెలల తర్వాత ఏదో ఉన్న రెండు మూడు అల్యూమినియం గిన్నెల్ని తీసుకెళ్ళడానికి బోడి ఆ ఊరికి వచ్చింది. ఎవరూ ఎదురు చూడని విధంగా బోడి బాగానే ఉంది. కాస్త వళ్ళు చేసి రంగు కూడా తేలింది. కళకళలాడుతున్న ముఖం మంచి చీర.

కాని తల మాత్రం బోడిగానే ఉంది. ఎవరో ఆమెను అడగను కూడా అడిగారు 'జుట్టు పెంచుకోకూడదూ" అని. "ఊహూం" అంది. వెళ్ళేముందు అందరి దగ్గరా వీడ్కోలు తీసుకుంది.

ఆ తర్వాత ఒక నెల గడిచి ఉంటుంది.

ఊళ్ళో జనం ఆమెను దాదాపు మర్చిపోయారనే చెప్పాలి.

కాని ఒక రోజు ప్రొద్దున్న ఊళ్ళో చిన్న కలకలం రేగింది. "బోడి వచ్చేసింది... బోడి వచ్చేసింది."

"బోడి మునుపటిలాగే నీళ్ళు మోసి బ్రతకడానికి ఈ ఊరికే వచ్చేసిందట"

పాత ఖాతాదార్లందరికీ పెద్ద భారం దించినట్లయింది. ఆ రోజు ఉదయమే తమ ఇంట్లో నీళ్ళు తెచ్చే మనిషిని రానక్కర్లేదని చెప్పేసారట కూడా.

కాని ఊళ్ళో ఒక్కరు వదలకుండా అందరి మనస్సులోనూ తలెత్తిన ప్రశ్న, సౌకర్యమైన ఆ జీవితాన్ని వదిలేసి మళ్ళీ ఈ ఊరికి నీళ్ళు మోసి చావడానికి బోడి ఎందుకు వచ్చింది అని.

చాలా మందికి అనుమానం మాణిక్యం కాకా హోటల్ని బిచాణా ఎత్తేశాడేమోనని. అంతగా బ్రతకనేర్చిన మనిషి కాదు కదా.

కాని విషయం అది కాదు. కాకా హోటల్ బాగానే నడుస్తోందని బోడి చెప్పింది.

మరి కారణం ఏమై ఉంటుంది?

బోడి మౌనంగా ఉండిపోయింది. కోమట్లమ్మ, ధనలక్ష్మితో సహా అందరినీ "మునుపటిలాగా నీళ్ళు మోయడానికి రానా?" అని అడిగింది.

బోడికి చాలా కావాల్సిన వాళ్ళు పాపమ్మ, ముత్తమ్మ. ముందు వసారాలో జొన్నలు దంచుతున్నప్పుడు, బోడి వీధిలో వస్తుండగా చూసి కాపు కాసి పట్టుకున్నారు, "ఒసే బోడీ! ఇలా రావే."

"ఏంటక్కా?" అమాయకంగా అడుగుతూ వాళ్ళ దగ్గరికి వచ్చింది బోడి.

తనకూ బోడికీ మధ్య ఉన్న చనువును హక్కుగా తీసుకుని పాపమ్మ కటువుగా అడిగింది. "ఏంటే? నెత్తి మీద నీళ్ళ బిందె లేకపోతే ఒంటి మీద చీర లేనట్లుగా ఉందా?"

"ఏంటక్కా?"

"మరి అక్కడ హోటల్ పని వదిలేసి ఎందుకు వచ్చినట్లు? ఏదో నాలుగు అంట్లు తోమి నీడలో బ్రతకమంటే చేదుగా ఉందా? ఇక్కడికి వచ్చి ఎండనకా వాననకా రోడ్లంబట నెత్తి మీద బరువుతో తిరుగుతూ చావడం తియ్యగా ఉందా?"

బోడి బదులు చెప్పలేదు.

"ఆ మనిషి జీతం అదీ సరిగ్గానే ఇచ్చేవాడు కదా?"

"ఊం"

మళ్ళీ మౌనం.

"చెల్లెలితో ఏదైనా గొడవ పడ్డావా?"

"అదేం లేదు."

"మరి ఎందుకు వచ్చినట్లు?"

మళ్ళీ మౌనం.

"ఊర కుక్కను నీడపట్టున హాయిగా ఉండమంటే మురికి గుంటనే పట్టుకుని వేళ్ళాడిందట ఇదే కాబోలు."

ఈ మాట వినగానే బోడి ముఖంలో ఉన్నట్లుండి రోషం పొంగి వచ్చింది. పాపమ్మ, ముత్తమ్మ కొంచెం కూడా ఎదురు చూడని కోపం. ఉక్రోషం నిండిన కోపం.

బోడి ఎర్రబడిన ముఖంతో పాపమ్మ ముఖానికి ఎదురుగా చెయ్యి చాపుతూ అన్నది. "వాడు నన్నూ.. నన్నూ ఉంపుడుగత్తెగా ఉండమన్నాడు."

పాపమ్మ, ముత్తమ్మ దిగ్భ్రమ చెందినట్లు చూశారు. కాసేపు అక్కడ మౌనం రాజ్యం ఏలింది.

వస్తాను అని కూడా చెప్పకుండా బోడి అక్కడ్నించి బయలు దేరింది. ఆమె వెళుతున్న వైపే చూస్తూ నిలబడిపోయారు పాపమ్మ, ముత్తమ్మ.

అది కూడా ఒక్క నిమిషమే. ఆ తర్వాత ఏదో తోచినట్లు వాళ్ళ ముఖంలో ఆశ్చర్యం మాయమై ఆ స్థానంలో సన్నని నవ్వు కదలాడింది.

వెళుతూ ఉన్న బోడిని చూస్తూ ముత్తమ్మ మెల్లగా అన్నది. "ఉండమంటే ఉంటే పోలా?"

పాపమ్మ కిసుక్కుమని నవ్వింది. "అంతే కదా మరి" అంటూ బోడి వీపుకేసి చూసింది. ఆ తర్వాత ఇద్దరూ కాసేపు ఏదేదో ఊహించుకుని పెద్దగా నవ్వుకుంటూ జొన్నల దంపుడులో దిగారు.

ఇది ఆ ఇద్దరి అభిప్రాయం మాత్రమే కాదు. ఈ మాట తమ దాకా వచ్చినప్పుడు ఆ ఊర్లో చాలామంది ఇలాగే అనుకున్నారు. వాళ్ళ దృష్టిలో ఇది ఆమె తాహతు కన్నా మించిన సౌకర్యం. ఆ సంబంధాన్ని ఆమె నూటికి నూరు పాళ్ళు అంగీకరించి ఉండాల్సిందని వాళ్ళ అభిప్రాయం. ఇప్పుడు ఆమె ఉన్న స్థితికి అదేం తీసిపోయిందన్నది వాళ్ళ ప్రశ్న.

ఒకటో రెండో నెలల తర్వాత మాణిక్యం ఆ ఊరికి ఏదో పని మీద మళ్ళీ వచ్చాడు. ఊళ్ళో కొంత మంది అతన్ని తమాషాగా "ఏంటీ సంగతి?" అని అడిగినప్పుడు తనకేమీ పట్టనట్టు "అదొక పిచ్చిమాలోకం" అని మెల్లగా జారుకున్నాడు.

ఇప్పుడు బోడి ఊళ్ళో మునుపటి లాగా పాతబడిపోయింది. ఐదారు ఇళ్ళకి నీళ్ళు మోస్తూ తిరుగుతూ ఉంది.

ఆమె లేనప్పుడు ఆమె గొప్పతనాన్ని గుర్తించిన ఊరి జనం అన్నీ మరిచి పోయి మునుపటిలాగే అధికారం చెలాయిస్తూ, విసుక్కుంటూ పని చేయించుకున్నారు.

బోడి మళ్ళీ చిక్కిపోయింది. వన్నె మాసిపోయింది. ఆ రెండు నెలల జీవిత ఛాయలు ఆమె జ్ఞాపకాలలో కొంచెం కూడా ఉన్నట్లు కనబడలేదు.

ఊళ్ళో మాత్రం ఎవరికైనా జ్ఞాపకం వస్తే ఆమెను సతాయిస్తూ ఏదైనా అనే వాళ్ళు ఏడిపించాలని ప్రయత్నించే వాళ్ళు. అందులో వాళ్ళు గెలుపు సాధించేటప్పుడు ఆమె అదే రోషంతో ఎర్రబడిన ముఖంతో చెయ్యి చాపి "వాడు నన్నూ... నన్నూ..." అంటూ సాగదీసేది. దాన్ని చూసి వాళ్ళు ఆనందిస్తున్నారు.

మీరు కావాలనుకుంటే ఇప్పుడు కూడా ఆమెను ఆ గ్రామంలో చూడవచ్చు.

## గడియారం

తమిళ మూలం: నీలపద్మనాభన్

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్



నీలంపద్మనాభన్

రాత్రంతా నిద్ర లేకుండా అతను చాలా అవస్థ పడ్డాడు. ఎడమ వైపు భుజం నుంచి క్రింద నడుము దాకా భయంకరమైన నొప్పి. ముఖ్యంగా గుండె దగ్గర. ఊపిరి అందనట్లుగా లోపల ఎక్కడో చురుక్కుమంటోంది.

మెలుకువ వచ్చి కళ్ళు తెరిచినప్పుడు భగ్గుమని మండినట్లనిపించింది. జ్వరం అంత తీవ్రంగా ఉంది.

"అమ్మా... అమ్మా" అంటూ మూలిగాడు. ఎవరిదైనా చేయి తగిలినా బాధ ఎక్కువైనట్లుగా అనిపించింది. అందుకే కాళ్ళు పట్టడానికి వచ్చిన మాలతిని తరిమేశాడు.

తనకే తెలియకుండా ఎప్పుడు నిద్రపోయాడో తెలియదు. కాని చెవులకు వినబడుతున్న పిల్లలు ఆడుకుంటున్న సందడి, రోడ్డు మీద వాహనాల చప్పుడు వీటిన్నిటినీ మించి అలవాటుకు విరుద్ధంగా ఏదో భయంకరమైన నిశ్శబ్దం తన చుట్టూ ఆవరించుకున్నట్లనిపించింది. మెల్లగా కళ్ళు తెరిచి చూసాడు.

బాగా ప్రొద్దెక్కినట్లు ఎండ పెళ్ళుమని కాస్తోంది. ఎదురుగా ఉన్న గోడ గడియారంలో ముళ్ళు పన్నెండు అంకెను తాకీ తాకనట్టుగా ఉన్నాయి. పద్దెనిమిది పంతొమ్మిదికి మధ్యస్థంగా తేదీని చూపిస్తోంది. గురువారం పూర్తిగా మాయమవకుండా వెండి అక్షరాలు మెరుస్తున్నాయి.

అతనికి పెళ్ళైన కొత్తలో, సుమారు ఎనిమిదేళ్ళ క్రితం కొన్న సైకో టైం డేటర్ అది. నెలకొకసారి కీ ఇస్తే చాలు. స్మగుల్డ్ ఐటం. ఆఫీసులో దాన్ని తెచ్చినప్పుడు ప్యూన్ రామసామిని అందరూ చుట్టుముట్టారు. పోటా పోటీలకి మధ్య 250 రూపాయలు ఇచ్చి కొనుక్కుని తీసుకుని వచ్చినప్పుడు అతని సంతోషానికి పట్టపగ్గాలు లేవు. మాలతికి అతనికన్నా ఒక పాలు ఎక్కువ. ఇంటికి ఎవరు వచ్చినా ఈ గడియారం గురించి ఎపుడు అడుగుతారా అని ఉత్సాహంతో ఎదురు చూస్తూ ఉండేవాళ్ళు.

అప్పుడు ఆరోగ్యంగానే ఉండేవాడు. ఈ గడియారం కూడా రిపేరు కాలేదు. గత కొద్ది నెలలుగానే ఏదో అస్వస్థత.

నొప్పి ఉధృతంగా తన ప్రభావాన్ని చూపిస్తోంది. అమ్మా.... అయ్యో....

పెద్ద పిల్లలిద్దరు అతని దగ్గరికి వచ్చి కాస్సేపు కూర్చుని వెళ్ళారు. కడపటి వాడికి, చంటిదానికి అతని ఆరోగ్యం గురించి బెంగపెట్టుకునేంతగా వయస్సు లేదు. తండ్రి గుండెల మీదే పడుకుంటామని ఇద్దరూ గొడవపడ్డారు. మాలతి వచ్చి ఇద్దరినీ లోపలికిలాక్కెళ్ళింది. కాస్సేపు అయిన తర్వాత కాఫీ తీసుకుని వచ్చింది.

"టైమెంతయ్యింది?"

మేజ డ్రాయరులో ఉన్న చేతి గడియారాన్ని తీసి చూసి "ఏడు కావడానికి ఇంకా ఐదు నిమిషాలు ఉంది" అని అంది.

"కాఫీ గ్లాసు పక్కన పెట్టి ఆ గడియారం పెండ్యులాన్ని కాస్త ఊపు" అన్నాడు నొప్పిని భరిస్తున్న గొంతుకతో.

"సరే, కాస్త కాఫీ అయినా తాగండి. నిన్న సాయంత్రం నుంచి ఏమీ తినలేదు" అని బలవంతం చేసినప్పుడు "నీకు చెప్పిన పనిని చేస్తావా లేక నన్ను లేచి సరి చేయమంటావా?" అంటూ గట్టిగా అరిచాడు.

మాలతి గ్లాసును మేజ మీద పెట్టి గడియారం దగ్గరకి పరిగెత్తినట్లుగా వెళ్ళింది. కుర్చీ లాగి దాని మీద నిలబడి గడియారం క్రింది భాగంలో ఉన్న చిన్న గాజు తలుపును తీసింది. చలనం లేకుండా ఉన్న పెండ్యులాన్ని ఆమె చేత్తో ఊపినప్పుడు కుర్చీ కూడా ఊగింది.

ఇప్పుడు టిక్ టిక్ అంటూ గడియారం చప్పుడు చెవులకి వినిపించినప్పుడు అతనికి శాంతిగా అనిపించింది.

మాలతి బిగుసుకుపోయిన చిన్న ముల్లును చూపుడు వేలుతో మెల్లగా తిప్పి పన్నెండుకు తెచ్చింది. ఇప్పుడు గడియారం పన్నెండుసార్లు టంగ్ టంగుమని మ్రోగి ఊరుకుంది. ఆ తర్వాత ఆరు అంకెకు చిన్న ముల్లును తిప్పి పన్నెండున్నర, తర్వాత ఒంటి గంట ఒకటిన్నర, రెండు, రెండున్నర... ఇలా కాలచక్రం గిర్రున తిరిగి ఏడు గంటలకి వచ్చి ఆగింది.

మాలతి కుర్చీ మీద నుంచి దిగిన తర్వాత "ఆ థర్మామీటర్ కాస్త ఇవ్వు" అన్నాడు.

థర్మామీటర్ తెచ్చి అతని నోట్లో పెట్టింది. కాస్సేపాగి తీసి చూస్తూ "నూట మూడు ఉంది. డాక్టర్ దగ్గరకి వెళదామా?" అని ఆదుర్దాగా అడిగింది.

"వెళ్ళి మాత్రం ఏం ప్రయోజనం? పోయిన వారమే కదా వెళ్ళి వచ్చాము."

"అందుకని?"

"నువ్వు నోర్మూసుకుని లోపలికి వెళ్ళు." బాధను ఏకాంతంగా అనుభవించనీయకుండా మాలతి తనతో మాట్లాడుతుండడం అతనికి ఇబ్బందిగా అనిపించింది.

ఆరేడు నెలలకు ముందు..... మొదటిసారిగా నొప్పి వచ్చినప్పుడు, ప్రముఖ డాక్టర్ షెనాయ్ దగ్గరకి వెళ్ళాడు. ఆయన పూర్తిగా చెకప్ చేసి, "ఏమీ లేదు. ఏదైనా మస్క్యులర్ పెయిన్ అయి ఉండొచ్చు అంతే" అంటూ ఏదో పిల్స్ రాసి ఇచ్చి పంపించేశారు.

మరీ ఓర్చుకోలేనంతగా కాకున్నా గుండెలో సన్నగా నొప్పి ఎప్పుడూ ఉంటూనే ఉంది. కాని ఏ రోగం లేదని డాక్టరే చెప్పారుగా అని తనకి తనే సమాధానం చెప్పుకుంటూ ధైర్యం చేకూర్చుకుంటూ ఆఫీసు, ఇల్లు, స్నేహితులతో కబుర్లు అంటూ తిరుగుతూ ఉండేవాడు. కాని రోజులు గడుస్తున్న కొద్దీ తన వళ్ళు చిక్కిపోవడం, బలహీనం చోటు చేసుకోవడం అతనికే తెలియసాగింది. ఎప్పుడూ జ్వరం, ఆహారం మీద పెద్దగా ఇష్టం లేకపోవడం, చీటికీ మాటికీ కడుపు నొప్పి రావడంతో మళ్ళీ డాక్టర్ షెనాయ్ దగ్గరకి వెళ్ళాడు. తరచూ వచ్చే గుండెనొప్పి గురించి కూడా చెప్పాడు. డాక్టరు మళ్ళీ అన్ని టెస్టులు చేయించి "మీకు ఏ రోగమూ లేదు. పథ్యం కూడా ఏమీ వద్దు. నోటికి రుచిగా ఉన్నవన్నీ తినండీ" అని టానిక్ వ్రాసి ఇచ్చి పంపించేశాడు.

ఇప్పుడు మళ్ళీ నిశ్శబ్దం. అతను కళ్ళు తెరిచి చూసినప్పుడు గడియారం మళ్ళీ ఆగిపోయింది. అతను పక్కకు తిరిగి పడుకున్నాడు. లోపల ఏదో పచ్చి పుండుని కెలికినట్లు కలుక్కుమంది.

"మాలూ! " గట్టిగా అరిచాడు.

మాలతి వచ్చింది.

గడియారాన్ని చూపించాడు.

మాలతి పెదవి విరుస్తూ, మళ్ళీ కుర్చీ మీదకి ఎక్కి గడియారం ముళ్ళను ఏడున్నరకు జరిపి అతని దగ్గరకి వచ్చింది. 'కాఫీ కూడా తాగలేదు. కాస్త పాలైనా తీసుకురానా?"

"వద్దు".

"కొంచెంగా తీసుకువస్తాను."

"నాకు ఇప్పుడు ఏమీ వద్దు... అమ్మా.."

మాలతి వెళ్ళిపోయింది.

డాక్టరు షెనాయ్ దగ్గరికి వెళ్ళి వచ్చిన తర్వాత కూడా నొప్పి తరచూ వస్తూ ఉండటం వలన మార్పు కోసం వేరే డాక్టర్లను సంప్రదించాడు. వాళ్ళూ షెనాయ్ చెప్పిందే చెప్పారు. ఇదంతా చూసిన తర్వాత అతనికి తానేదో లేని రోగాన్ని ఉన్నట్లు ఊహించుకునే

హైపో కాండ్రియాక్‌గా మారిపోయాడేమోనని తన మీద తనకి సందేహం కలిగింది.కాని.. చురుక్కుమంటూ గుండె లోతుల్లోంచి పెల్లుబికి వచ్చే ఈ నొప్పి, నిప్పు కణికల మీద నిలబడి ఉన్నట్లుగా దహించే ఈ జ్వరం.... ఇదంతా అబద్ధం, వట్టి భ్రాంతి మాత్రమే అని చెప్పాలంటే తన వంట్లో ప్రాణం లేకుండా ఉండాలి. అయ్యో... అమ్మా...

మళ్ళీ నిశ్శబ్దం.

కళ్ళు తెరిచి చూసినప్పుడు గడియారం ఏడు నలభై దగ్గర ఆగిపోయినట్లు కనబడింది.

మాలతిని పిలవడానికి అతను చేసిన ప్రయత్నం ఫలించలేదు. గొంతు పెగలనే లేదు. కాలం స్థంభించిపోయినట్లు అనిపించింది. భూమి కదిలికలు కూడా ఆగిపోయినట్లు....

"ఇలాగే ఉంటే ఎలా? గోమతితో మీ ఇంటికి కబురుచెయ్యనా?

గోమతి వాళ్ళింటి పనిపిల్ల.

"ఊఁ.... ఏదో ఒకటి చెయ్యి. మొదట గడియారాన్ని సరి చెయ్యి." అరిచాడు.

"దాన్ని రిపేరుకు ఇవ్వాలి. ఎన్నిసార్లని పెండ్యులాన్ని ఊపడం?"

"అన్నీ తర్వాత చూసుకోవచ్చు. ఇప్పుడు మొదట గడియారాన్ని సరి చెయ్యి." గొంతు పెంచాడు.

మాలతి మేజ మీద ఉన్న చేతి గడియారాన్ని తీసి చూసి, కుర్చీ మీద ఎక్కి గడియారం ముళ్ళను ఎనిమిదికి జరిపి పెండ్యులాన్ని ఊపింది.

పిల్లలు స్కూలుకి వెళ్ళే సందడి. "నాన్నా... టాటా" అని చెప్పి పెద్ద పిల్లలు ఇద్దరూ ఆయాతో స్కూలుకి బయలుదేరారు.

తమ్ముడు మెట్లెక్కి లోపలికి వచ్చాడు.

"మళ్ళీ నొప్పి వచ్చిందా? గోమతి వచ్చి చెప్పింది."

తనకన్న రెండేళ్ళు చిన్నవాడు. వయస్సు ముప్పై ఒకటి.

"అయ్యో... ఈ నొప్పిని భరించలేకపోతున్నాను."

"ప్రొద్దుట్నించి ఏమీ తాగలేదు." పాలగ్లాసుతో అక్కడికి వచ్చిన మాలతి పుకారు చెపుతున్నట్లుగా అన్నది.

" ఏమీ తాగకుండా ఉంటే ఎలా అన్నయ్యా? కాస్త పాలైనా తాగు."

అతనూ బలవంతం చేయడంతో పాల గ్లాసు తీసుకుని రెండు గుక్కలు తాగి మళ్ళీ ఇచ్చేసాడు. నొప్పి మాత్రం తగ్గలేదు. గోడ గడియారం ఎనిమిది దగ్గరే ఆగిపోయి తననే మిటకరించి చూస్తున్నట్లు భ్రమ.

"సరే. డాక్టరు దగ్గరికి వెంటనే వెళదాం పద. టాక్సీ తీసుకొస్తాను" అంటూ తమ్ముడు బైటికి వెళ్ళి టాక్సీ తీసుకొచ్చాడు. బాధతో లుంగలు చుట్టుకుపోతూ, తడబడుతూ ఎలాగో టాక్సీ ఎక్కుతూ కూడా "గడియారాన్ని కాస్త ఊపు. ఆగిపోయింది" అని మాలతితో చెప్పడం అతను మర్చిపోలేదు.

డాక్టర్ షెనాయ్ ఇంట్లో పేషెంట్ల గుంపు కాస్త ఎక్కువే. ఇప్పుడు కూడ ఆయన దగ్గరే ట్రీట్‌మెంట్. మంచి శకునం.... డాక్టరుగారింట్లో గడియారం బాగానే పనిచేస్తోంది.

ఒక్కొక్క పేషెంటు లోపలికి వెళ్ళి రావడానికి ఇరవై నుంచి ముప్ఫై నిమిషాల దాకా అవుతోంది. పదకొండున్నరకి అతని వంతు వచ్చేంత వరకు నొప్పితో అవస్థ పడుతూ అలాగే కూర్చున్నాడు.

"డాక్టర్... మళ్ళీ నొప్పి వచ్చింది" అని అతను అంటుండగానే, తమ్ముడు ఎక్సరేలు, బ్లడ్ రిపోర్టులు, మందు చీటీలు అన్నీ కట్టగా డాక్టరికి అందించాడు.

మొదటిసారిగా చూస్తున్నట్లుగా డాక్టర్ వాటిని శ్రద్ధగా పరిశీలించారు. ఎక్సరేలను వెలుతురులో ఉంచి చూసారు. బెడ్ మీద పడుకుని ఉన్న అతని దగ్గరికి వచ్చారు.

"ఎప్పుడూ ఉంటుందే, అలాగే ఉందా ఈ నొప్పి?"

"లేదు డాక్టర్... ఇంతకు ముందు గుండెలో సన్నగా నొప్పి ఉంటూ ఉండేది. నిన్న సాయంత్రం ఆఫీసు నుంచి ఇంటికి వచ్చినప్పట్నించి భయంకరమైన నొప్పి భరించలేనంతగా. ఊపిరి కూడా సరిగ్గా తీసుకోలేకపోతున్నాను. జ్వరం కూడా ఉంది, నూటమూడుకు పైగానే.." అతని బాధంతా కళ్ళలో ప్రతిఫలించింది.

డాక్టర్ అతని వీపు మీద స్టెతస్కోప్ పెట్టి చూసారు. ఒకటి నుంచి పదిదాకా లెక్కపెట్టమన్నారు.

"దగ్గు ఉందా?"

"లేదు డాక్టర్."

కడుపు మీద నొక్కి చూసారు. ఆఖర్లో ఎప్పటిలాగే అన్నారు.

"మీకు ఏమీ లేదు. పోతే ఈ కాప్స్యూల్స్ ఒక రోజుకి నాలుగు చొప్పున మూడు రోజులకు వాడండి" అని చెప్పి హోస్టా సైక్లిన్ 12 అని వ్రాసి ఇచ్చారు.

దారిలో మందుల షాప్ దగ్గర తమ్ముడు దిగి మందులు కొనుక్కుని వచ్చి అతన్ని ఇంటి దగ్గర దిగబెట్టాడు.

మంచం మీద పడుకోబోయే ముందు ఏదో స్ఫురించినట్లుగా గడియారం వైపు చూసాడు.

అది పదకొండు గంటలకి ఆగిపోయింది.

ఛరుమని కోపం వచ్చింది అతనికి. పక్కనే తమ్ముడు ఉన్నందువలన అప్పటికి అణుచుకున్నాడు.

కాప్సూల్ తీసి అతనికి ఇచ్చి మంచినీళ్ళ గ్లాసును అందిస్తూ "నాకు సెలవు లేదు. ఆఫీసుకు వెళ్ళాలి. సాయంత్రం మళ్ళీ వస్తాను రెండో కాప్సూల్ ఆరు గంటల తర్వాత వేసుకోవాలి" అని చెప్పి తమ్ముడు వెళ్ళిపోయాడు.

బైట ఎండ ఫెళ్ళుమంటున్నా ఇంట్లో చల్లగా ఉన్నట్లు అనిపించింది. జ్వరం ఎక్కువగా ఉన్నందువలన శరీరం వణక సాగింది.

మాలతి కంబళిని తెచ్చి కప్పింది.

"ఎందుకు గడియారాన్ని సరిచేయలేదు?" మండిపడ్డాడు భార్య మీద.

"ఎన్నిసార్లని సరిచేయను? ఐదు నిమిషాలు కూడా సరిగ్గా పని చేయడం లేదు. స్కూలుకి క్యారియర్ తీసుకెళ్ళడానికి ఆయా వచ్చే టైమయ్యింది. గడియారాన్ని ఊపుతూ కూర్చుంటే నా పనులు ఎలా అవుతాయి?"

ఆ గడియారాన్ని చూస్తే మాలతికి వళ్ళు మండుతోందని అనిపించింది అతనికి.

"చెప్పేది వినిపించుకోవేం? ఇంట్లో ఒక మనిషికి కులాసాగా లేనప్పుడు అపశకునంలా గడియారం ఇలా ఆగిపోతే?"

మాలతి గడియారపు ముళ్ళని పన్నెండుకు జరిపి పెండ్యులాన్ని ఊపింది.

రాత్రి నిద్ర సరిగ్గా లేనందువల్ల కలిగిన అలసట వల్లనో.. లేక మందుల ప్రభావమో తెలియదు. అతనికి నిద్రవస్తున్నట్లు అనిపించింది.

ఎంతసేపు నిద్రపోయాడో తెలియదు ఉన్నట్లుండి విపరీతమైన దాహం వేసింది. చటుక్కున కళ్ళు తెరిచి చూసాడు. ఎదురుగా అతన్నే దిగులుగా చూస్తూ నిలబడ్డ మాలతి ముఖం కనబడింది.

"కాస్త మంచినీళ్ళు ఇవ్వనా?"

అతని కళ్ళు గడియారం వైపు తిరిగాయి. అది చక్కగా టిక్కు టిక్కుమంటూ తన పని తాను చేసుకుంటూ పోతోంది. అమ్మయ్య అనిపించింది అతనికి.

"గడియారం ఆగిందా?"

"లేదు. ఆ తర్వాత ఆగలేదు." మాలతి అంది.

"అమ్మయ్య. ఇక కొన్ని రోజులకి ఏ చీకు చింతా లేదు" అని అంటుండగానే గుండెనొప్పి ప్రొద్దున్న కన్నా ఉధృతంగా ఉన్నట్లనిపించింది. టిక్కు టిక్కు మంటూ కదులుతున్న గడియారాన్ని చూస్తూ నిద్రలోకి జారుకున్నాడు శాశ్వతంగా.

❀❀❀

## అమ్మకూచి

తమిళ మూలం: వి.యస్.నాగరాజన్

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్



*ఇటీవలే తన 80 వ పుట్టినరోజుని జరుపుకున్న నాగరాజన్ గారు, 50 సంవత్సరాల క్రిందట వ్రాసిన కథ ఇది.*

సావిత్రమ్మ మనసులో ఉన్నది చాలా సహజమైన, న్యాయమైన కోరిక. తనకు కోడలుగా రాబోయే అమ్మాయి కోడలుగా కాకుండా సొంత కూతురులాగా ఉండాలన్నదే ఆమె కోరిక. ఆడ సంతానం లేని ఒక తల్లి ఆ విధంగా కోరుకుంటే అందులో తప్పేముంది?

సావిత్రమ్మ ఇప్పుడే మొదటిసారిగా కొడుకుకి పెళ్ళి చేయబోవడం లేదు. ఇంతకు ముందే ఇద్దరు కొడుకులకి పెళ్ళిళ్ళు జరిగాయి. పెద్ద కొడుకు ఢిల్లీలో పెద్ద ఆఫీసరు. అక్కడే పెద్ద ఆఫీసరుగా ఉన్నాయన కూతురు అతనికి భార్యగా వచ్చింది. పెళ్ళైన తర్వాత అత్తగారింట్లో కొన్ని రోజులు ఉండడానికి వచ్చింది కొత్తకోడలు. సావిత్రమ్మ కళ్ళకి ఆ అమ్మాయి కోడలుగా కనబడలేదు. రేసు గుర్రాలను ఇంతకు ముందెప్పుడు ఆమె చూసింది లేదు. కాని కోడల్ని చూసినప్పుడల్లా ఆ జ్ఞాపకమే వచ్చింది. మంచి ఎత్తు, ఎత్తు తగ్గ లావు. బాగా టెన్నిస్ ఆడుతుందట. కప్పులు కూడా గెలుచుకున్నదట. మాట మాటకి కళ్ళద్దాలు సరి చేసుకుంటూ కోడలు తన వైపు చూసినప్పుడల్లా సావిత్రమ్మ భయంతో గజ గజ వణికిపోయేది.

రెండో కొడుకు హైదరాబాదులో ఉన్నాడు. అతనికి మంచి ఉద్యోగమే. మొదటి కోడలి విషయంలో తనకి కలిగిన నిరాశను సరి చేసుకోవడానికి సావిత్రమ్మ రెండో కొడుక్కి పెళ్ళి చేసేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకుంది. ఈ సారి ఉద్యోగస్తుల కూతుళ్ళ జాతకాన్ని కూడా వేలుతో తాకలేదు. ఆఖరున ఆమె ఎదురు చూసిన విధంగానే తంజావూరు భూస్వామిగారింటి అమ్మాయిని కోడలుగా నిశ్చయించిది. అమ్మాయి ఎక్కువగా చదువుకోలేదు. టెన్నిస్ ఎలా ఆడతారో తెలియదు. కళ్ళద్దాలు పెట్టుకోదు. సారె సంపద అంతా

బాగానే తెచ్చింది. ఈ కోడలైనా తనతో ప్రేమగా ఉంటుందని, గౌరవం చూపిస్తుందని ఆశించిన సావిత్రమ్మకి ఈసారి కూడా ఆశాభంగం కలిగింది.

హైదరాబాదులో కాపురం చేస్తున్న ఈ కోడలు సంవత్సరానికి ఒకసారి వస్తుంది. రెండు రోజులు అత్తగారింట్లో ఉండి, గ్రామానికి పుట్టింటికి వెళుతుంది. అక్కడ్నినుంచి తిరిగి వచ్చేటప్పుడు క్రమం తప్పకుండా ప్రతీసారీ తల్లిని వెంటేసుకుని వస్తుంది. వియ్యంకురాలు వచ్చిన ప్రతిసారీ ఒక్కొక్క రోగం పేరు చెప్పుకుంటూ, డాక్టరుకి చూపించుకునే సాకుతో రోజుల తరబడి తిష్టవేసేది. కూతుర్ని హైదరాబాదుకు రైలు ఎక్కించే ముందు ఫ్లాట్ ఫారం మీద కంటికి మింటికి ఏకధారగా కూతుర్ని వదిలి పెట్టలేక శోకాలు పెట్టేది.

ఏది ఎలాగైతేనేం? సావిత్రమ్మకి తన మీద ప్రత్యేకంగా శ్రద్ధ, ప్రేమ చూపించి, తనని నోరారా అమ్మా అని పిలిచే కోడలు ఇంత వరకు రాలేదు. మూడో కొడుకు సేతు. నూటికి నూరు పాళ్ళు అమ్మకు ముద్దుల కొడుకు, గారాల తనయుడు. నిజంగా చెప్పాలంటే సేతుకు అమ్మ మీద ప్రేమ ఒక పాలు ఎక్కువే. అమ్మ గీచిన గీటు దాటడు. సినిమాకి వెళ్ళాలన్నా అమ్మ పర్మిషను తీసుకున్న తర్వాతే వెళతాడు. చుట్టుపక్కన తెలిసిన వాళ్ళందరూ "అమ్మ కూచి సేతు" అని అతని ముందే అనేవాళ్ళు. ఆ విషయం సావిత్రమ్మకీ తెలుసు. ఆ బిరుదును తల్లీ కొడుకులిద్దరు తప్పుగా అనుకోలేదు. న్యాయమైన బిరుదుగానే స్వీకరించారు. చదువు అయిన తర్వాత చిన్న ఉద్యోగమైనా చాలు అని చెన్నైలోనే ఉండిపోయాడు సేతు. ఢిల్లీ, ముంబైకి వెళితే మంచి ఉద్యోగం దొరుకుతుందని అన్నయ్యలిద్దరూ ఉత్తరాలు వ్రాసినా అతను వెళ్ళలేదు. తల్లి మీద ఉన్న ప్రేమే దానికి కారణం. ఆ విషయాన్ని వచ్చి పోయే వాళ్ళందరితో చెప్పి చెప్పి మురిసిపోయేది సావిత్రమ్మ.

ఈ కొడుకు పెళ్ళి తన స్వంత బాధ్యతగా జరిపించాలని సావిత్రమ్మ నిశ్చయించుకున్నందులో తప్పేమైనా ఉందా? సేతు నాన్నగారు ఏదో చెప్పాలని ప్రయత్నించినప్పుడు "మీరు కాస్త నోరు మూసుకోండి. మీరు పూనుకుని పెద్దవాడికి, రెండోవాడికి ఉత్తరం నుంచి దక్షిణం నుంచి సంబంధాలు చేసారు. మన సేతుకి అలా చెయ్యనివ్వను. అతనికి రాబోయే భార్య ఎలా ఉండాలో తెలుసా? పెద్ద కోడలిలాగా అధికారి కూతురుగా ఉండకూడదు. రెండో కోడలిగా భూస్వామంతుల కూతురుగాను ఉండకూడదు. వాళ్ళకి ఆస్థి అంతస్తులు ఉండాలి. కాని మరీ ఎక్కువగా ఉండకూడదు. అమ్మాయి కాస్త చదువుకున్న పిల్ల అయి ఉండాలి. కాని పెద్ద కోడలిగా టెన్నిస్ ఆడే పిల్లగా ఉండకూడదు. కళ్ళు మిరుమిట్లుగొలిపే అందచందాలు ఉండకూడదు. అందుకని మరీ కురూపిగాను ఉండకూడదు. రెండో వియ్యంకురాలి లాగా కూతుర్ని తలుచుకుని సదా కళ్ళల్లో నీళ్ళు పెట్టుకునే సంబంధం అస్సలు వద్దు." దీర్ఘంగా ఉపన్యాసం ఇచ్చింది సావితమ్మ.

"నీ ఇష్టప్రకారమే చూడమ్మా. అదే నాకూ ఇష్టం" అన్నాడు అమ్మకూచి సేతు.

సేతుకు కంపెనీలో ఉద్యోగం. సంవత్సరానికి రెండుసార్లు బోనసు ఇస్తారు. శని ఆదివారాలు రెండూ రోజులు సెలవు. ఎలాగో ఒకలాగా సేతుకి ప్రమోషన్ వచ్చింది. కాని ఆఫీసులో పెట్టిన కండిషన్ సేతుకి సమ్మతంగా లేదు. ట్రైనింగ్ అన్న పేరిట అతను ఏడెనింది నెలలు తిరుచ్చి బ్రాంచిలో పని చేయాలి. "నాకు ప్రమోషన్ వద్దమ్మా. నిన్ను వదిలి ఏడెనిమిది నెలలు నేను ఎలా ఉండగలను?" మనస్పూర్తిగా అన్నాడు సేతు.

సావిత్రమ్మకీ అదే సరి అనిపించింది. కాని తండ్రి ఒప్పుకోలేదు.

"ఒక ఆర్నెల్లు వెళ్ళి ఉండి రానీ. ఈ వయస్సులో ప్రమోషన్ తప్పి పోతే తర్వాత కష్టం" అన్నారాయన. సేతుకి వెళ్ళడానికి కొంచెం కూడా ఇష్టం లేదు. ఎలాగో బయలుదేరి వెళ్ళాడు. తిరుచ్చికి వెళ్ళిన ఆ వారమే శని, ఆదివారాలకి చెన్నైకి వచ్చేసాడు. అప్పట్నుంచి ప్రతీ వారం సెలవులకి చెన్నైకి వచ్చి అమ్మ చేతి వంట తిని వెళ్ళడం తప్పనిసరి అయ్యింది. రెండు నెలలు ఇలా సాగిన తర్వాత సావిత్రమ్మ

అన్నది. "నిన్ను రావద్దని చెప్పలేకపోతున్నాను. రమ్మని చెప్పడానికి నోరు రావడం లేదు. కొంచెం కూడా తీరిక లేకుండా రెండు రోజులు ప్రయాణం చేస్తే ఒంటికి పడదు. అందువలన ఇక్కడికి వస్తే అదే రోజు మళ్ళీ బయలుదేరి వెళ్ళు. ఒకరోజు విశ్రాంతి తీసుకుని మర్నాడు ఆఫీసుకు వెడుదువుగాని."

సేతు అర్థమనస్కంగా ఈ ఏర్పాటుకు ఒప్పుకున్నాడు. ఎలాగో ఒకలాగా ట్రైనింగు ముగించుకుని మళ్ళీ అమ్మ చేతి వంట తినడానికి చెన్నై వచ్చి చేరి, ఎప్పటిలాగే అమ్మకూచి అయ్యాడు.

కొడుక్కి వచ్చిన సంబంధాలలో ఒక్కటి కూడా సావిత్రమ్మ షరతులకు సరిపోయేదిగా లేదు. ఆఖర్న వచ్చిన సంబంధం అన్ని విధాలుగా ఆమెకి తృప్తిగా అనిపించింది. అమ్మాయి తండ్రి  మధురైలో సర్కారు ఆఫీసులో సూపరింటెండ్ (ఆఫీసరు కాదు) మిగిలినవన్నీ కూడా సరిగ్గానే ఉన్నాయి.

పెళ్ళి చూపులకు మధురైకి వెళ్ళాలి. తనకి దూరపు బంధువు, చిన్న నాటి స్నేహితురాలు అయిన జానకి అక్కడ ఉన్నట్లు జ్ఞాపకం వచ్చింది. ఆమె చిరునామా వెతికి ఎలాగో పట్టుకుని ఉత్తరం రాసింది సావిత్రమ్మ.

మధురైలో జానకి ఇంటికి వెళ్ళి స్నానపానాలు అయ్యాక మీనాక్షి దేవాలయం, తిరుప్పర కున్రం, తిరుమలైనాయక్కర్ మహల్ అన్ని చోటలకి తల్లి తండ్రులని తీసుకెళ్ళి చూపించాడు సేతు. కొత్త ఊరిలో బస్సులో ఎక్కడానికి, కొత్త ప్రదేశాలకి వెళ్ళడానికి ఎటువంటి తడబాటులేకుండా దక్షతతో వ్యవహరిస్తున్న సేతుని చూసి జీవితంలోనే మొదటిసారిగా తన కొడుకు వట్టి అమ్మకూచి మాత్రమే కాదు, నిజంగానే కార్య దక్షతగలవాడు అని సావిత్రమ్మ తెలుసుకుంది.

మధ్యాహ్నం భోజనాలయ్యాక సేతు, అతని తండ్రి ముందు గదిలో పడుకుని చిన్నగా కునుకు తీసారు. సావిత్రమ్మ, జానకి పాత కబుర్లు చెప్పుకుంటూ కూర్చున్నారు. ఆఖర్న జానకి అడిగింది.

"అది సరేగానీ నీకు ఈ సంబంధం ఉన్నట్లు ఎలా తెలిసింది? ఎవరైనా తెలిసిన వాళ్ళ ద్వారా అమ్మాయి జాతకం వచ్చిందా?"

"ఎవరి ద్వారానో రావడం దేనికి? మన ఇంట్లో పెళ్ళికి పిల్లవాడు ఉన్నాడు. వాళ్ళింట్లో ఎదిగిన అమ్మాయి ఉంది. వచ్చి అడిగారు. నాకేమో ఇది మంచి సంబంధం అనే అనిపిస్తోంది" అన్నది సావిత్రమ్మ.

"నేను చెపుతున్నానని తప్పుగా అనుకోకు. ఆ తర్వాత ఎప్పుడన్నా నీకీ విషయం తెలిస్తే నన్ను 'ముందే నీకు తెలియదా జానకీ?' అని నిలదీయకుండా ఉండాలని ముందే చెపుతున్నాను."

"విషయం ఏమిటి ?"

"నువ్వు పెళ్ళి చూపులకు వెళుతున్నావే, ఆ అమ్మాయి గురించి."

"ఏమిటే ఇది? పెద్ద రాయి తీసి నా నెత్తిన వేస్తున్నావా?"

"అవును ఆ పెద్ద రాయే. ఆ అమ్మాయి సంవత్సరం క్రితం కాలేజీలో చదివింది. అప్పుడు ఎవరో అబ్బాయిని ప్రేమించిందట."

"అయ్యో రామా!"

"ప్రేమ అంటే అలాంటి ఇలాంటి ప్రేమకాదు. అతనితో కలిసి సినిమా, డ్రామా, వైగై ఆనకట్ట అంటూ తిరగని చోటు లేదట."

"ఏమిటే నువ్వు చెప్పేది?" ముక్కు మీద వేలేసుకుంది సావిత్రమ్మ.

"నా చెవులదాకా వచ్చిన విషయాన్నే చెపుతున్నాను. ఈ ఊర్లో వాడ వాడలా అందరికీ ఈ విషయం తెలిసి నవ్వుల పాలైన తర్వాతే తల్లితండ్రులకి విషయం తెలిసింది. వెంటనే అమ్మాయి చదువుని మధ్యలోనే ఆపు చేయించి ఇంట్లో కూర్చోబెట్టారట."

"ఎంత అప్రతిష్ఠ?"

"ఆ అమ్మాయి ఆ అబ్బాయినే చేసుకుంటాను. లేకపోతే నూతిలో దూకి చస్తాను అని అన్నదట."

"దూకి చావక పోయిందా?"

ఏమో? దూకలేదు మరి. కూతురు ప్రేమ వివాహం చేసుకోవడం తల్లితండ్రులకు సుతారము ఇష్టం లేదు. ఆమె ఆ విషయం మర్చిపోవాలనే ఒక సంవత్సరం పెళ్ళి మాటెత్తకుండాఊరుకుని ఇప్పుడు పెళ్ళి చేసేయాలని తీవ్రంగా ఉన్నారు."

సావిత్రమ్మకి నోరు పడిపోయినట్లయింది. ఏం చెయ్యాలో పాలు పోలేదు. అంతలో అమ్మాయి తండ్రి వీళ్ళని తీసుకెళ్ళడానికి స్వయంగా వచ్చారు.

అమ్మాయి చూడటానికి బాగానే ఉంది. మొదటి చూపులోనే అందరి మనస్సులో స్థానం సంపాదించుకున్న ఆ అమ్మాయిని చూస్తున్న కొద్దీ జానకి చెప్పిన కథ జ్ఞాపకం వచ్చి సావిత్రమ్మకి వళ్ళు మండిపోయింది. పెళ్ళి కాకముందే ఒక అబ్బాయితో సినిమా, డ్రామాలకి వెళ్ళడానికి ఆ అమ్మాయికి ఎంత గుండె ధైర్యం ఉండాలి? ఈమె గనక తన ఇంటికి కోడలిగా వస్తే అమ్మకూచి అని అందరితో పిలవబడే, అమాయకుడైన తన కొడుకు సేతుని, తనని ఎన్ని ఆటలాడిస్తుంది? ఏది ఏమైనా సరే ఈ సంబంధం వద్దు.

సంప్రదాయమైన మాటలు ముగిసాక మగ పెళ్ళివాళ్ళు బయలు దేరారు. సావిత్రమ్మ అందరికన్నా ముందుగా "ఊరికి వెళ్ళి ఉత్తరం వ్రాస్తాము" అని చెప్పి బయలు దేరింది.

తల్లి ముఖం చూసి ఏమీ కనుక్కోలేక సేతు తల్లడిల్లిపోయాడు. ఆమె భర్తకు తన భార్య మాటలు, చేతలు ఏనాడు అర్థమయ్యింది లేదు.

చెన్నైకి వచ్చి రెండు మూడు రోజులైన తర్వాత సావిత్రమ్మ అన్నది. "సేతూ! మళ్ళీ ఒక జోస్యుడి దగ్గర మధురై అమ్మాయి జాతకాన్ని చూపించాను. ఆయన మీ ఇద్దరి జాతకాలు కలవలేదన్నారు. ఈ సంబంధం చేసుకోవద్దని చెప్పారు" అని అన్నది.

"ఏంటమ్మా ఇది? పెళ్ళి చూపులకి వెళ్ళే ముందే ఇద్దరు జోస్యులకి చూపించినప్పుడు అంతా సరిగ్గానే ఉందని చెప్పారు కదా?" అన్నాడు తనకే తెలియకుండా చిందులు వేస్తూ.

కొడుకు తన చేతి నుంచి జారిపోతున్నట్లు సావిత్రమ్మకి అనిపించింది.

"ఏమిట్రా నువ్వనేది? ఇద్దరికి చూపిస్తే మూడో చోట చూపించకూడదని శాస్త్రం ఏదైనా ఉందా?"

పట్టాభిరామయ్య అన్నారు. "నాకేమో సేతుకు వచ్చిన అన్ని సంబంధాలలో ఈ సంబంధమే బాగా నచ్చింది. అమ్మాయి తండ్రి చేసిన మర్యాదలు, అమ్మాయి చక్కదనం అన్నీ సరిగ్గానే ఉన్నాయి." సేతు తల్లి ముఖాన్ని సూటిగా చూస్తూ ధైర్యంగా అన్నాడు. "ఈ అమ్మాయి నాకు బాగా నచ్చింది. జాతకాలు కాస్త వెనకా ముందు అయినా ఫర్వాలేదు. నేను అడ్జెస్ట్ చేసుకుంటాను. ఈ సంబంధమే కావాలి."

"నాక్కూడా" అన్నారు పట్టాభిరామయ్య.

"వీల్లేదు. నాకు కొంచెం కూడా ఇష్టం లేదు. ఈ పెళ్ళి జరగడానికి నేను ఒప్పుకోను" అన్నది సావిత్రమ్మ.

"ఎందుకు వద్దంటున్నావో ఆ కారణం నువ్వు చెప్పి తీరాలి. జాతకాలు కుదర లేదని నువ్వు అన్నది అబద్ధం. నీ మనస్సులో వేరే ఏదో ఉంది. నీ మనస్సులో కల్గిన ఏవో పిచ్చి ఆలోచనల కారణంగా అనవసరంగా ఒక అమ్మాయి జీవితాన్ని బలి చేయకమ్మా." కళ్ళల్లో నీళ్ళు పెట్టుకోవడం తరువాయిగా అంటున్న కొడుకుని ఊసి "ఓరి దుంపతెగా" అన్నది సావిత్రమ్మ. "ఈ సంబంధం ఎందుకు వద్దు అన్న విషయాన్ని నా నోటితో నేను చెప్పకూడదనే అనుకున్నాను. ఆ అమ్మాయి ఇంతకు ముందు ఎవరినో ప్రేమించిందట. విషయం చాలా దూరానికి వెళ్ళిందట. ఆ పోకరి వెధవతో సినిమా డ్రామా అని తిరగని చోటు లేదట. ఊరు ఊరంతా గొల్లుమందట."

"ఇదంతా నీకెవరు చెప్పారు?"

"ఎవరు చెపితేనేం? ఒకరికి ఇద్దరి దగ్గర అడిగి తెలుసుకున్నాను. పిల్ల తండ్రి దగ్గర చాటుమాటుగా అడిగేసాను కూడా."

"ఆ పోకిరి వెధవను నేనేనమ్మా."

"ఏమిట్రా అంటున్నావు? కల ఏదైనా కన్నావా?"

"కల కాదమ్మా, నిజం. ఆ అమ్మాయిని ప్రేమించింది నేనే. ఆమెను సినిమాకి, డ్రామాలకీ తీసుకెళ్ళిందీ నేనే."

"ఏమిట్రా నువ్వంటున్నదీ?"

"అవునమ్మా. పోయిన సంవత్సరం నేను తిరుచ్చికి వెళ్ళినప్పుడు మొదటి రెండు నెలలు శని ఆదివారాల్లో ఇక్కడికి వచ్చినప్పుడు నువ్వే అన్నావు కదా ఒక రోజు ఇక్కడ ఉంటే చాలు. మర్నాడు తిరుచ్చికే వెళ్ళి రెస్టు తీసుకోమన్నావు. మర్నాడు తిరుచ్చికి వెళ్ళకుండా మధురైకి వెళ్ళాను. గుడికి వెళ్ళి వస్తుంటే ఈ అమ్మాయిని చూసాను. సాక్షాత్తూ ఆ మీనాక్షి దేవి శిల ప్రాణం పోసుకుని నడిచి వస్తున్నట్లు అనిపించింది."

"ఓరి నీ అసాధ్యం కూల?"

"మరుసటి వారం కూడా మధురైకి వెళ్ళాను. ఆమె వెనకాలే ఇంటిదాకా వెళ్ళాను. తను కాలేజీలో చదువుకుంటుండేది. అందువల్ల ఇంట్లో వాళ్ళకి తెలియకుండా సినిమాకి, పార్కులకి తిరగడానికి సౌకర్యంగా ఉండేది."

"ఆ అమ్మాయి నాన్నగారికి నేవెవరో తెలుసా?"

"తెలియదు. ఆయన నన్ను చూడలేదు. ఎవరి ద్వారానో ఆ అమ్మాయి విషయం వాళ్ళ నాన్నగారికి తెలిసి మర్నాటి నుంచి ఆ అమ్మాయిని ఇంటి నుంచి బైటకి రానివ్వలేదు. అంతలో నాకు ట్రైనింగ్ ముగిసిపోవడంతో మళ్ళీ ఇక్కడికి వచ్చేసాను."

"మరి వాళ్ళకి మన అడ్రెస్ ఎలా తెలిసింది? జాతకం ఎలా పంపారు?"

"అదంతా ఇప్పుడు ఎందుకమ్మా? ఎవరి ద్వారా తెలిసిందన్న విషయమా ముఖ్యం?"

"నాకు తల తిరుగుతోంది. ఏం చెయ్యాలో అర్థం కావడం లేదు." సావిత్రమ్మ కుర్చీలో చతికలబడింది.

"నాకు అర్థమయింది. ఒరేయ్ సేతూ! మధురై రైలుకు ఇంకా ఎంత సమయం ఉంది? నువ్వు వెళ్ళి వెంటనే ఒక టాక్సీ తీసుకురా. మిగిలిన విషయాలన్నీ నేను చూసుకుంటాను." పట్టాభిరామయ్య తన జీవితంలో మొదటిసారిగా భార్యను సంప్రదించకుండా ఒక నిర్ణయం తీసుకున్నారు.

అమ్మని ఒక్క మాట కూడా అడక్కుండా, షర్ట్ వేసుకోవడం కూడా మరచి పోయి టాక్సీ తీసుకుని రావడానికి ఆఘమేఘాల మీద వెళుతున్న కొడుకుని చూసిన తర్వాత ఇక ఈ సేతు అమ్మకూచి కాదు అని సావిత్రమ్మకి అర్థమైయింది.

❀❀❀

తొలిగిన మేఘాలు

తమిళ మూలం: జి. తిలకవతి I.P.S

తెలుగు అనువాదం: గౌరీ కృపానందన్




"ఈ రోజు ఎలాగైనా సరే, చచ్చిపోవాలి." కోకిల మనసులో దృఢంగా అనుకుంది. ఆత్మహత్య చేసుకునే వాళ్ళంతా ఎలా చేసుకుంటున్నారు? రైలు క్రిందపడి చచ్చిపోదామనుకుంటే ఆ ఊరిలో రైల్వే స్టేషను అసలే లేదు. దీనికోసం పద్దెనిమిది కిలోమీటర్లు వెళ్ళడం కుదురుతుందా? నిప్పంటించుకోవచ్చు. కాని చాలా చిత్రవధ. బాధ భరించలేక అరిస్తే ఎవరైనా వచ్చి కాపాడడానికి ఆస్కారం ఉంది. ఆలోచిస్తూ వాకిట్లో సాను్పు జల్లి ముగ్గు పెట్టింది కోకిల.

ముగ్గు పిండి డబ్బా ఒక చేత్తో పట్టుకుని, నడుములో దోపుకున్న లంగాను సరి చేసుకుంటూ నిటారుగా నిలబడిన కోకిలకి రెప్ప వాల్చకుండా తననే చూస్తున్న విద్య కనబడింది.

"కోకిలా! ఊరికే ఊరివాళ్ళని తప్పుపట్టడం ఏం న్యాయం? బంగారపు బొమ్మలాంటి రూపం, ఒత్తుగా, కృష్ణ సర్పంలా నిగనిగలాడే తలకట్టు, అందమైన చిత్రంలా తీర్చి దిద్దినట్లున్న ముఖంతో ఉన్న నిన్ను చూస్తుంటే.." విద్య ముఖంలో కించిత్తు గర్వంతో పాటు, గొంతులో అనురాగం కూడా తొణికిసలాడింది.

విని విని విసిగెత్తిపోయినట్లు "ప్చ్..." అంది కోకిల. తన అందం, రూపలావణ్యం గురించి ఎవరైనా పొగిడితే ఆమెకే తెలియని నిర్లిప్తత ఆవరించుకునేది. గత రెండేళ్ళగా అలాంటి పొగడ్తలు వింటుంటే ఒక విధమైన ద్వేషం కూడా ఏర్పడసాగింది.

"ఏమైంది రాణిగారికి? ఎందుకబ్బా అంత విరక్తి?" కోకిలని ఉడికిస్తూ చిలిపిగా అంది విద్య. అవడానికి అక్కయ్యే అయినా తల్లిలాగా చెల్లెలితో వ్యవహరించేది విద్య.

"ఏంటక్కా? నువ్వు కూడా ఇలా మాట్లాడుతున్నావు?" అంటుండగానే కోకిల కళ్ళలో నీళ్ళు నిండుకున్నాయి.

చిన్న పచారి కొట్టుకుని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్న కుటుంబం వాళ్ళది. తండ్రి ఆరోగ్యంగా ఉన్నంత వరకు, పెద్దగా చెప్పుకునేటట్లుగా కాకున్నా చీకూ చింతాలేకుండా కాలం గడిచిపోయింది. కట్టుబాట్లలో లేని మధుమేహం, రక్తపోటు తండ్రిని ఇంట్లోనే కట్టిపడేసాయి. సరుకు కొనుగోలు చేయడానికి, గల్లా దగ్గర కూర్చుని వ్యాపారాన్ని చూసుకోవడానికి సరైన మనిషి దొరక్క చాలా ఇబ్బందుల పాలైయ్యారు.

కుటుంబంలో విద్య మొదటి సంతానం. ప్లస్ టు ముగించి గత పదేళ్ళుగా పెళ్ళికోసం ఎదురు చూపులు చూస్తోంది. ఆమెకి అయిదేళ్ళు చిన్నవాడు గోపి. గోపికి ఎనిమిదేళ్ళు నిండినప్పుడు పుట్టింది కోకిల.

గోపి చదువు పాడైపోకూడదనేది ఇంట్లో వాళ్ళందరి ఉద్దేశం. ఏనాడు గడపదాటని తల్లి పనివాళ్ళతో పచారి కొట్టును నడుపుతూ, ఇంటిని ఎలాగో ఒకలాగా నిర్వహిస్తూ వస్తోంది.

"ఊరికే దిగులు పడితే మాత్రం జరిగేదేముంది సుందరం? కల్యాణ ఘడియ వస్తే పెళ్ళికొడుకు తనంతటతానే వెతుక్కుంటూ వస్తాడు. అనవసరంగా దిగులు పడి ఆరోగ్యాన్ని పాడుచేసుకోకండి." డాక్టరు వచ్చిన ప్రతిసారి చిలక్కి చెప్పినట్లు సలహా చెప్పడం మానరు.

"విద్యని ఒక అయ్య చేతిలో పెడితే, ఆ బలమే ఆయన్ని లేచి కూర్చోబెడుతుంది. ఆ మాంగాడు తల్లి ఎప్పుడు కరుణిస్తుందో?" అమ్మ ప్రార్థించుకోని రోజు లేదు.

ఎన్ని వ్రతాలు? ఎన్ని పూజలు చేసింది. రోజుల తరబడి శ్లోకాలు వల్లించింది. ఆఖరికి విసిగి వేసారి "అమ్మా! నన్ను వదిలెయ్యి. నాకు పెళ్ళీ పెటాకులు ఏమీ వద్దు" అంది.

జాతకరీత్యా ఏ దోషమూ లేని, ఏ అవకరమూ లేని విద్యకి ఇంకా వరుడు దొరక్కపోవడం గురించి బంధువులంతా చెవులు కొరుక్కున్నారు.

''ఇదిగో చూడండి. కట్నం పెద్ద విషయం కాదు. మీ అమ్మాయి విద్య చూడడానికి బాగానే ఉంది. కాదని చెప్పడం లేదు. కానీ అబ్బాయి మీ చిన్నమ్మాయిని ఇష్టపడుతున్నాడు.''

ముందుగానే కూడబలుక్కున్నట్లు వచ్చిన వాళ్ళందరూ ఒకే పాఠం వల్లెవేశారు.

''ఒసే కోకిలా! ఈ రోజు మీ అక్కయ్యని చూడడానికి పెళ్ళివాళ్ళు వస్తున్నారని తెలుసుకదా? చెప్పింది జ్ఞాపకం ఉంచుకో. తగుదునమ్మా అంటూ వాళ్ళముందుకు రాకు. వాళ్ళు వచ్చి వెళ్ళేవరకు వంటింట్లోనో లేకపోతే పక్కింట్లోనో పడి ఉండు.'' అమ్మ ఆజ్ఞాపిస్తున్నట్లుగా అంది. కోకిల ముఖం చిన్నబోయింది. ''సరేనమ్మా'' అన్నది తగ్గు స్వరంలో.

పక్క గది నుంచి వేగంగా వచ్చింది విద్య. ''అమ్మా! నువ్వు ఊరికే ఉండవా? ఇప్పుడు తనని ఎందుకు ఏడిపిస్తున్నావు?'' అని తల్లిని కోపగించుకుంటూ కోకిల వైపు తిరిగింది. ''పిచ్చిపిల్లా! ఇంత చిన్న విషయానికి ఎవరైనా ఏడుస్తారా? నువ్వు ఎక్కడికీ వెళ్ళక్కర్లేదు. ఎప్పటిలాగే నీ పనులు చూసుకో'' ప్రేమతో అధికారం చెలాయిస్తున్నట్లుగా అంది.

ఒక్కొక్క సంబంధం తప్పిపోతున్నప్పుడు నాన్నగారి ఆరోగ్యం మరింత దిగజారసాగింది. ఇదంతా తనవల్లే అన్న అపరాధ భావం కోకిల మనస్సును మరింత వేధించసాగింది.

రూపంలో విద్యకన్నా తక్కువగా ఉన్న ఎంతో మంది ఆడపిల్లలు పెళ్ళై పిల్లా పాపలతో కళకళలాడుతున్నారు. చక్కగా సంసారాలు చేసుకుంటున్నారు. ఇక్కడ తనే పెద్ద సమస్యగా మారింది. వచ్చిన వాళ్ళంతా అక్కయ్యను తనతో పోల్చుకుని ఆమె తనకన్నా తక్కువగా కనిపిస్తున్న కారణం వల్లే ఆమెకి సంబంధం కుదరడం లేదు.

విద్యను పెళ్ళివాళ్ళు వద్దని తిరస్కరించి వెళ్ళిన ప్రతిసారీ కోకిలకి ఒళ్ళు మండుకొస్తుంది. ''బుద్ధి జ్ఞానం లేని మూర్ఖుల్లారా! విద్యకన్నా చక్కని, బుద్ధిమంతురాలైన, ఒద్దికగా కాపురం చేసే అమ్మాయి మీకు ఎక్కడ దొరుకుతుంది? అందమట అందం..! అందం అంటే అసలు అర్థం ఏమిటో తెలుసా మీకు?'' లోలోపల అగ్ని పర్వతంలా దహించుకుపోయేది. చూసి చూసి వేసారి పోయి తను చస్తే గానీ అక్కయ్యకి పెళ్ళికాదని నిర్ణయానికి వచ్చింది కోకిల. మనసు భారమయ్యింది. వెళ్ళి అద్దం ముందు నిలబడింది.

అందంగా ఆకర్షణీయంగా కనిపించిన తన ప్రతిబింబాన్ని చూసి తనే అసహ్యించుకుంది. తన అందానికి పక్కన తేలిపోతున్న అక్కయ్యను తలుచుకున్న కొద్దీ ఆ అసహ్యం ఇంకా ఎక్కువయ్యింది. డ్రెస్సింగ్ టేబుల్ డ్రాయర్నిలాగింది. చిన్న బాటిల్ని తీసి జాకెట్లో దాచింది.

పెరటి వైపు వెళ్ళింది. నిండుగా వ్యాపించిన పాలవెన్నెల.

కొబ్బరాకుల సందుల్లో నుంచి దాగుడు మూతలాడుతున్న చంద్రుడిని చూడగానే ఆమె కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి. ఇదే వెన్నెల క్రింద తనకి భర్తగా రాబోయే, ముఖమెరగని ఆ రాకుమారుడితో సిగ్గు దొంతరల మధ్య తను గడపబోయే మధురమైన రాత్రుల గురించి తను కన్న కలలు కళ్ళముందు కదలాడాయి. ఏడుపు ముంచుకొచ్చింది. బాటిల్ని తెరిచింది.

''కోకిలా!''

బాటిల్ క్రిందపడి చెల్లాచెదురయ్యింది.

''అప్పుడే అనుకున్నాను. ప్రొద్దున్న లేచినప్పటినుంచి పిచ్చి చూపులు చూస్తూ, ఇంటిపనులను సవ్యంగా ముగించకుండా కిలగాపులగం చేసినప్పుడే అనుకున్నాను ఇలాంటి పిచ్చి పని ఏదైనా చేస్తావేమోనని. కళ్ళల్లో వత్తులు వేసుకుని నిన్నే గమనిస్తున్నాను.''

''అక్కా! దయచేసి నన్ను వదిలెయ్యి అడ్డుపడకు.'' వెక్కిళ్ళ మధ్య అంది కోకిల. ''నా వల్ల ఎంత మందికి కష్టం?''

''పిచ్చిదానిలా మాట్లాడకు. నీ వల్ల ఎవరికి కష్టం? ఆడదాన్ని భోగం వస్తువుగా తప్ప వేరే విధంగా చూడడం తెలియని కామపిశాచాలతో, స్త్రీ జాతినే కించపరచే మూర్ఖులతో నా జీవితం ముడిపడకుండా ముందుగానే వాళ్ళను గుర్తించడంలో నాకు ఎంతో

సహాయం చేస్తున్నావు. భార్యని సాటి ప్రాణిగా, మంచి స్నేహితురాలిగా చూడగలిగే ఒక మంచి మనిషి కోసం నేను ఎదురు చూస్తున్నాను." దృఢంగా అంది విద్య.

కోకిల మనస్సులో కమ్ముకున్న మేఘాలు మెల్లగా తొలిగిపోయాయి. "అక్కా!" విద్య భుజం మీద తలదాచుకుంటూ ఆశ్రయం దొరికినట్లుగా కళ్ళు మూసుకుంది కోకిల.

❀❀❀

మూలకథా రచయిత్రి తిలకవతి గారు తమిళనాడులో ఐ.పి.ఎస్ ఆఫీసర్. ఆమె వ్రాసిన 'కల్మరం' అనే నవలకి 2005 సంవత్సరంలో కేంద్ర సాహిత్య ఎకాడెమీ అవార్డు లభించింది.